


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 06 గురువారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 142
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## హరీశ్‌ను అరెస్టు చేయవద్దు

- అప్పటి వరకు హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దు: తెలంగాణ హైకోర్టు
- హరీశ్ రావును 12 వరకు అరెస్ట్ చేయవద్దంటూ ఉత్తర్వులు పొడిగింపు
- తదుపరి విచారణను 12వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు



2

## ఢిల్లీలో 58 శాతం పోలింగ్

- ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 63.83 శాతం పోలింగ్
- అత్యల్పంగా సౌత్ ఈస్ట్ ఢిల్లీలో 53.77 శాతం పోలింగ్
- ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగింపు దశకు వచ్చింది. సాయంత్రం 5 గంటల వరకూ 57.70 శాతం

## మళ్లీ కేజ్రీవాలే!

- ఢిల్లీలో మళ్లీ గెలిచేది కేజ్రీవాలే-తేల్చేసిన కేకే
- మరికొన్ని సర్వేల్లో హంగ్ వచ్చే అవకాశం
- మ్యాట్రిజ్-ఏబీపీ ఎగ్జిట్ పోల్‌లో హంగ్
- ఓటింగ్ సరళిని బట్టి చెరిసగం సీట్లు..కాంగ్రెస్‌కు ఒకటి

2



| పోల్ డైరీ | కేకే సర్వే ఎగ్జిట్ పోల్స్ | టైమ్స్ నౌ: | ఏబీపీ మ్యాట్రిజ్ |
|---|---|---|---|
| బీజేపీ:42-50 | ఆప్ : 39 | బీజేపీ39- 45 | బీజేపీ:35 - 40 |
| ఆప్:18 - 25 | బీజేపీ : 22 | ఆప్:29 - 31 | ఆప్ :32 - 37 |
| కాంగ్రెస్: 2 | | కాంగ్రెస్: 1 | కాంగ్రెస్:0 - 1 |

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలవబోతున్నారనే అంశంపై పలు ఎగ్జిట్ పోల్ సంస్థలు తమ అంచనాల్ని విడుదల చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో కూటమి గెలుస్తుందని పక్కాగా ఊహించిన కేకే సర్వే ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలపైనా తన అంచనాల్ని విడుదల చేసింది. వీటిలో కేకే సర్వే ఢిల్లీలో ఆప్ అధికారం నిలబెట్టుకోవడం ఖాయమని తేల్చేసింది.. కేకే సర్వే ఎగ్జిట్ పోల్ ప్రకారం 70 సీట్లున్న ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఈసారి 44 సీట్లు సాధించబోతున్నట్లు అంచనా వేశారు. అలాగే విపక్ష బీజేపీకి మాత్రం 26 సీట్లకు పరిమితం అవుతుందని తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కడం లేదని తేల్చేశారు. దీంతో వరుసగా నాలుగోసారి కూడా ఢిల్లీలో ఆప్ హవా కొనసాగడం ఖాయమని తేలిపోయింది. అలాగే బీజేపీ ఎంత పోరాడినా గెలుపుకు చాలా దూరంలో నిలిచిపోతున్నట్లు కేకే సర్వే అంచనా వేసింది. ఇవే ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికల్లో ఆప్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగిందని అంచనాలు చెబుతున్నాయి. అయితే గతంలో ఏపీ ఎన్నికలతో పాటు పలు ఎన్నికల్లో కచ్చితమైన ఎగ్జిట్ పోల్స్ ఇచ్చిన చరిత్ర ఉన్న కేకే సర్వే మాత్రం ఈసారి కూడా ఢిల్లీలో ఆప్ గెలుస్తుందని అంచనా వేస్తోంది. అయితే కేకే సర్వే ఢిల్లీ ఎన్నికల్లో విజేతపై చెప్పిన అంచనాలు నిజమవుతాయో లేదో తేలాలంటే ఈ నెల 8వ తేదీ వరకూ ఆగాల్సిందే.

## తీన్మార్ మల్లన్నకు షోకాజ్

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు
- కులగణన సర్వేలో బీసీల రిజర్వేషన్లను తగ్గించారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపణ
- కులగణన సర్వే నివేదికపై విమర్శ,కాపీల దగ్ధం
- మల్లన్నపై భగ్గుమన్న కాంగ్రెస్ నేతలు
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మల్లన్నకు నోటీసులు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే నివేదికను విమర్శించడంతో పాటు తగలబెట్టినందుకు తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ బుధవారం(ఫిబ్రవరి 5)నాడు కాంగ్రెస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రక్షించడానికి డేటాను తారుమారు చేసి.. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను తగ్గించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ మల్లన్న కులగణనను ఫామ్‌ను దగ్ధం చేశారు. అలా చేయడంపై వివరణ ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మల్లన్నకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుకు ప్రతిస్పందిస్తూ.. తెలంగాణ కులగణన లెక్కలపై తన అభిప్రాయాలను షోకాజ్ నోటీసు మార్చదని తీన్మార్ మల్లన్న అన్నారు. "నాకు నోటీసులు ఇవ్వడానికి మీరు ఎవరు? వారు నన్ను బెదిరించడానికి ప్రయత్నిస్తే, అది పనిచేయదు" అని ఆయన అన్నారు. ఇటీవల తీన్మార్ మల్లన్న కులగణన సర్వేను ప్రశ్నించడమే కాకుండా బీసీ నినాదం ఎత్తుకుని వరుసగా బీసీ సమావేశాలు నిర్వహిస్తూ రెడ్డి సామాజిక వర్గంపైనా, సొంత పార్టీ నేతలపైనా ఘాటు విమర్శలు చేస్తూ వస్తున్నారు. తీన్మార్ మల్లన్న చర్యపై మంత్రి సీతక్క ఏమన్నారంటే? తీన్మార్ మల్లన్న చర్యలపై మంత్రి సీతక్క స్పందించారు. పార్టీతో ఏవైనా సమస్యలు ఉంటే అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. మీరు కాంగ్రెస్ నాయకుడైతే పార్టీ విధానాలతో ఏకీభవించాలని.. ఏమైనా ఆందోళనలు లేదా సమస్యలు ఉంటే వాటిని చర్చించడానికి సమావేశాన్ని షెడ్యూల్ చేయడం ముఖ్యమని సీతక్క

## టీటీడీపీ కోసం రంగంలోకి పీకే



- ఢిల్లీలో లోకేశ్‌తో రాజకీయ వ్యూహకర్త మంతనాలు
- ఏపీ రాజకీయ పరిస్థితిపై పీకే గ్రౌండ్ రిపోర్ట్
- టీడీపీతో పొత్తు..బీజేపీ-సేన సొంత ఇమేజ్‌కై యత్నాలు
- తెలంగాణలో టీడీపీ బలపేతం కోసం వ్యూహం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో టీటీడీపీతో బీజేపీ పొత్తు

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
ఏపీ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీజేపీ, జనసేన కూటమిలో భాగస్వాములుగా ఉంటూనే సొంతంగా బలం పెంచుకోవటంపైన కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నాయి. తాము బలోపేతం అయ్యేందుకు ప్రస్తుత సమయమే సరైనదిగా బీజేపీ, జనసేన భావిస్తున్నాయి. ఈ సమయంలోనే మంత్రి లోకేష్ ఢిల్లీ పర్యటనలో ప్రశాంత్ కిశోర్ తో భేటీ అయ్యారు. ఎన్నికల ముందు టీడీపీకి వ్యూహాలు.. సూచనలు అందించిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు ఏపీలో పరిస్థితుల పైన ఇచ్చిన గ్రౌండ్ రిపోర్ట్‌లో కీలక అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. కీలక భేటీ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీలోని ముఖ్య మంత్రి నివాసం 1-జన్‌పథ్‌కు పీకే వచ్చారు. అక్కడ దాదాపు గంటకు పైగా లోకేశ్‌తో చర్చలు జరిపారు. ఏపీలో 2019 ఎన్నికల్లో పీకేకు చెందిన ఐప్యాక్ వైసీపీ తరఫున పనిచేసింది. ఆతర్వాత ఐప్యాక్ నుంచి ఆయన బయటకు వచ్చేశారు. బిహార్‌లో 'జన్ సురాజ్' పేరుతో సొంతంగా పార్టీ ఏర్పాటు చేశారు. కాగా, 2024 ఎన్నికల సమయంలో పలు సందర్భాల్లో పీకే టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఏపీలో జగన్ ఓటమి ఖాయమని ముందుగానే పీకే

## త్రిషకు రూ.కోటి నజరానా

- ప్రపంచకప్‌లో రాణించిన త్రిషకు సీఎం సత్కారం..
- కోటి నజరానా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన త్రిష
- టీం సభ్యులకు కూడా 10లక్షల చొప్పున నజరానా

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
జూబ్లీహిల్స్ నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టీమిండియా మహిళా క్రికెటర్ గొంగడి త్రిష మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా అండర్-19 ప్రపంచ కప్‌లో అద్భుతంగా రాణించిన త్రిషను సత్కరించి అభినందించారు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి. అలానే ఆమెకు రూ. కోటి రూపాయల నజరానా ప్రకటించారు. భవిష్యత్‌లో దేశం తరుపున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ అండర్ 19 వరల్డ్ కప్ టీమ్ మెంబర్స్ అయిన, తెలంగాణ కు చెందిన ధృతి కేసరికి రూ.10 లక్షలు, హెడ్ కోచ్ నౌషీన్,ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున నజరానాను ప్రకటించారు. ఈ టీ20

## నేటి కేబినెట్ భేటీకి పవన్ గైర్హాజరు?

- కీలక ప్రకటన చేసిన జనసేన పార్టీ
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను వేధిస్తున్న జ్వరంతో పాటు స్పాండిలైటిస్ సమస్య
- కేబినెట్‌లో కూర్చోవడం కష్టం కనుక గైర్హాజరు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
ఏపీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రేపు జరిగే ఏపీ కేబినెట్ భేటీకి హాజరయ్యే అవకాశాలు కనిపించడం లేదు. రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో జరిగే కేబినెట్ భేటీకి పవన్ కళ్యాణ్ రాకపోవచ్చని జనసేన పార్టీ కొద్దిసేపటి క్రితం ప్రకటన విడుదల చేసింది. దీనికి గల కారణాలను కూడా ఆ ప్రకటనలో జనసేన నేతలు వెల్లడించారు. దీంతో రేపటి కేబినెట్ భేటీ తొలిసారి పవన్ లేకుండానే జరిగే అవకాశముంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రస్తుతం వైరల్ జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరంతో పాటు స్పాండిలైటిస్ సమస్య కూడా ఆయన్ను బాధిస్తోంది. దీంతో డాక్టర్ల సూచన మేరకు విశ్రాంతి తీసుకొంటున్నారని జనసేన పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే ఆరోగ్య సమస్యల కారణంగా రేపు జరిగే కేబినెట్ భేటీకి కూడా పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోవచ్చని ప్రకటించింది. దీంతో పవన్ కేబినెట్‌కు హాజరు కావడం కష్టమని తెలుస్తోంది. ఈ మధ్య ఆరోగ్య కారణాలతో పవన్ తరచుగా

## ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం!

- వరుస ఓటముల నేపథ్యంలో పోటీకి ముందుకు రాని అభ్యర్థులు
- ఎన్నికల్లో ఖర్చు పెట్టినా దండగేనన్న బీఆర్ఎస్ నేతల అభిప్రాయం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ వద్దని నిర్ణయం



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** గడిచిన పదేళ్లలో ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ఏ ఎన్నికలు వచ్చినా దూకుడుగా వ్యవహరించిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలపై ఏమాత్రం ఆసక్తి చూపకపోవడంతో సర్వత్రా చర్చ జరుగుతోంది. 'ఎన్నికలు ఏవైనా గెలుపు మాదే' అంటూ ధీమా వ్యక్తం చేస్తూ వచ్చిన గులాబీ పార్టీ ఈ ఎన్నికల్లో పాల్గొనకపోవడానికి కారణం ఏమై ఉంటుందని రాజకీయ వర్గాల్లో ఎవరికి తోచిన అభిప్రాయం వారు చెబుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోవడం, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ స్థానం కూడా దక్కకపోవడం తదితర కారణాలు ఆ పార్టీని అయోమయంలో పడేశాయని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.
రాష్ట్రంలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు, ఒకటి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం. వీటికి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. దీనిపై ఇప్పటివరకు తమ అధినేత కేసీఆర్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, బీఆర్ఎస్ తరఫున అభ్యర్థి పోటీలో ఉండరని ఆ పార్టీ నాయకులు పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలాఉండగా... రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు జరుగుతున్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య ఎక్కువ. దీంతో ఆ పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటుందన్న విషయంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పోటీ చేయడానికి అభ్యర్థులు ముందుకు రాకపోతే పార్టీ అధిష్ఠానం మాత్రం ఏం చేస్తుందని పార్టీనేతలంటున్నారు.

## వైసీపీ హయాంలోని మద్యం అక్రమాలపై సిట్ విచారణ

- విజయవాడ సిపి రాజశేఖర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు
- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం!
- 2019 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు
- లావాదేవీల్లో అక్రమాలు జరిగాయనే అభియోగాలు



**అమరావతి-నవభూమిబ్యూరో**
ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ప్రభుత్వం హయాంలో జరిగిన మద్యం అక్రమాలపై సిట్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 అక్టోబర్ నుండి 2024 మార్చి వరకు రాష్ట్రంలో మద్యం విక్రయాలకు సంబంధించి రూ. 90 వేల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. నగదు లావాదేవీలతో పాటు హోలోగ్రామ్‌ల వ్యవహారంలోనూ పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.
ఈ నేపథ్యంలో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో ప్రభుత్వం సిట్‌ను నియమించింది. మద్యం అమ్మకాలకు సంబంధించి సిట్‌కు అవసరమైన పూర్తి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. దర్యాప్తుకు సంబంధించిన వివరాలను ప్రతి 15 రోజులకు ఒకసారి సీఐడీ చీఫ్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.
సీఐడీ డీఐజీ ఆధ్వర్యంలో సిట్ పని చేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. సిట్ బృందానికి ప్రభుత్వం పూర్తి అధికారాలను కల్పించింది. సిట్‌లో సభ్యులుగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సుబ్బారాయుడు, అదనపు ఎస్పీ కొల్లి శ్రీనివాస్, సీఐడీ ఏఎస్పీ శ్రీహరిబాబు, డోన్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శివాజీని నియమించారు.

## హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు

- విధుల్లో ఉన్న 18 హిందూమతేతరుల గుర్తింపు
- వారిని తొలగించడం లేదా ఇతర శాఖల్లోకి మళ్లింపు
- అవసరమైతే వీఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపించేయడం
- దీనికి అన్యమతస్థుడు దరఖాస్తు చేసుకోవాలి

2



**తిరుపతి-నవభూమిబ్యూరో:** హిందూయేతర ఉద్యోగులు, సిబ్బం దిపై టీటీడీ చర్యలకు ఉపక్రమిం చింది. విధుల్లో ఉన్నప్పుడు హిందూ యేతర ఆచారాలను అనుసరిస్తున్న వారిపై చర్యలు టీటీడీ సిద్ధమైంది. కొందరు హిందూమతాలను అనుసరిస్తామని ప్రమాణం చేసి ఉద్యోగంలో చేరాక అన్యమతాలను ఆచరిస్తున్నట్లు టీటీడీ గుర్తించింది. మతపరమైన నియ మాలను ఉల్లంఘించినందుకు 18 మంది ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలకు టీటీడీ ఆదేశాలు జారీ

## వాల్తేర్ డివిజన్ ఇక విశాఖ డివిజన్

### విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం గుడ్ న్యూస్




2

**విశాఖ-నవభూమిబ్యూరో:** ఏపీలో విభజన హామీల్లో భాగంగా విశాఖ కేంద్రంగా ఏర్పాటవుతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పై కేంద్రం మరో శుభవార్త చెప్పింది. ఇప్పటికే రైల్వే శాఖ ఈ కొత్త జోన్ ఏర్పాటు కోసం చురుగ్గా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రధాన కార్యాలయం నిర్మాణానికి ప్రధాని మోడీ చేతుల మీదుగా శంకుస్థాపన కూడా చేశారు. ఇప్పుడు ఈ విశాఖ రైల్వే జోన్ పరిధిని కూడా నిర్ణయిస్తూ కేంద్రం మరో నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం వాల్తేర్ డివిజన్‌ను విశాఖ డివిజన్‌గా పేరు మారుస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్రం పరిగణనలోకి తీసుకుంది. అలాగే గతంలో ఉన్న విశాఖ డివిజన్ పరిధి మార్చుతూ తాజా ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు



## శంషాబాద్ సమీపంలో ప్రహరీ గోడలు కూల్చివేసిన హైడ్రా

**హైదరాబాద్-నవభూమి:** కొద్ది రోజులుగా దూకుడు తగ్గించిన హైడ్రా మళ్లీ రంగంలోకి దిగింది. బుధవారం శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ప్రహరీ గోడలను హైడ్రా అధికారులు కూల్చివేశారు సర్వే నంబర్లు 601, 602 లో చేపట్టిన ప్రహరీ గోడను తెల్లవారుజామున కూల్చివేశారు. వివాదాస్పద రోడ్డు స్థలం విషయంలో ఫిర్యాదులు రావడంతో కూల్చివేశారు. అయితే తమ పట్టా భూమిలో తాము నిర్మించుకున్న ప్రహరీ గోడను హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేసారని బాధితులు మండిపడుతున్నారు. హైడ్రా అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తామని బాధితులు ప్రకటించారు.కాగా నిర్మాణరంగ, ఇతర వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోసే వాహనాలపై సంస్థ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి అక్రమంగా వ్యర్థాలు డంప్ చేస్తోన్న నాలుగు టిప్పర్లను హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు పట్టుకున్నాయి. ఉందాసాగర్‌లో వ్యర్థాలు పోస్తున్న నాలుగు టిప్పర్లు, పోసిన మట్టిని వెంటనే చదును చేస్తోన్న ప్రొక్లెయినర్‌నూ పట్టుకున్నారు. అనంతరం బండ్లగూడ పోలీస్ స్టేషన్‌లో వాహనాలు, డ్రైవర్ క్లీనర్‌ను అప్పగించి వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవులపల్లి (సమర్‌కుంట) చెరువులో మట్టి పోస్తోన్న మరో లారీని పట్టుకున్నారు. వాహనం, డ్రైవర్, క్లీనర్‌ను పోలీసులకు అప్పగించారు. వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో మట్టి, ఇతర వ్యర్థాలు పోస్తే కేసులు నమోదు చేస్తామని, అన్ని ప్రాంతాల్లో హైడ్రా బృందాల నిఘా ఉందని కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు.




## 'గచ్చిబౌలి' ప్రభాకర్.. వారంలో ఆ ఒక్క రోజే చోరీలు, వీకెండ్‌లో జల్సాలు..!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ గచ్చిబౌలి ప్రిజం పబ్‌లో నాలుగు రోజుల క్రితం కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. మోస్ట్ వాంటెడ్ దొంగ బత్తుల ప్రభాకర్ పోలీసులపై కాల్పులు జరపగా.. ఓ కానిస్టేబుల్ గాయపడ్డాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే కేసు విచారణలో బత్తుల ప్రభాకర్ గురించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభాకర్ చోరీలు చేసేందుకు ప్రత్యేకంగా వారంలో ఓ రోజును ఫిక్స్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.వారంలో తొలి 3 రోజులు ప్లానింగ్ చేసి.. గురువారం మాత్రమే చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత శుక్ర, శని, ఆదివారాలు జల్సాలు చేస్తాడని పోలీసులు వెల్లడించారు. కనీసం రూ.10 లక్షలు దొరుకుతాయనుకుంటే అతడు రంగంలోకి దిగుతాడని తెలిసింది. ఎవ్వరికీ అనుమానం రాకుండా ప్రముఖ కాలేజీలు, విద్యా సంస్థల్లో మాత్రమే అతడు చోరీలు చేస్తాడు. జీవితంలో రూ.335 కోట్లు కొట్టేసి.. 100 మంది అమ్మాయిలతో గడపాలనేది అతని టార్గెట్‌గా పోలీసుల విచారణలో తేలింది. అందుకు గుర్తుగా తన వంటిపై 333, 100 నెంబర్లను పచ్చబొట్లుగా పొడిపించుకున్నాడు.ఖరీదైన ప్రాంతాల్లో నివాసముండే.. బత్తుల ప్రభాకర్.. సొంతూళ్లో తనకు చేపలు, రొయ్యల చెరువుల వ్యాపారులున్నాయని చెప్పుకుని స్థానికులను నమ్మించేవాడు. బ్రాండెడ్ దుస్తులు మాత్రమే వేసుకునేవాడు. బ్రాండెడ్ విదేశీ మద్యం తాగుతూ దర్పం ప్రదర్శించేవాడు. చోరీ చేసిన సొమ్ములతో లగ్జరీ కార్లు కొనేవాడు. ఏమాత్రం అనుమానం రాకుండా వాటిని తన స్నేహితుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించేవాడు. ఎప్పుడు డబ్బులు అవసరమైనా, ఆన్‌లైన్ లావాదేవీలు చేయాలన్నా స్నేహితుల బ్యాంకు ఖాతాలు మాత్రమే వినియోగించేవాడు.ఇక ఓసారి జైలులో తోటి ఖైదీలో గొడవ జరగ్గా.. ప్రతీకారంతో అతడిని చంపేందుకు బిహార్ వెళ్లి కంట్రిమేడ్ గన్స్ మూడింటిని కొనుగోలు చేశాడు. వాటి కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసినట్లు పోలీసులు గుర్తించారు. 500 బుల్లెట్లు సైతం కొనుగోలు చేసిన ప్రభాకర్.. ఓఆర్ఆర్ సమీపంలోని అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి తుపాకీ పేల్చటాన్ని సొంతంగానే నేర్చుకున్నాడు. శిక్షణ కోసం దాదాపు 100 రౌండ్ల దాకా బుల్లెట్లు వాడేశాడు. కేవలం ఏడో తరగతి మాత్రమే చదివిన ప్రభాకర్ తెలివితేటలు చూసి పోలీసుల సైతం ఆశ్చర్యపోతున్నారు.

## మహబూబాబాద్: డీజే సౌండ్‌కు డ్యాన్స్.. ఇంటర్ విద్యార్థినికి గుండెపోటు



**మహబూబాబాద్-నవభూమి::** మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఓ ఇంటర్ విద్యార్థి (16)ని హార్ట్ ఎటాక్‌తో కన్నుమూసింది. గతరాత్రి పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేయగా.. ఆ వేడుకల్లో డీజీ సౌండ్‌కు విద్యార్థిని డ్యాన్స్ చేసింది. డ్యాన్స్ తర్వాత కొద్ది క్షణాల్లోనే ఆమె కుప్పకూలి చనిపోయింది. వివరాల్లోకి వెళితే.. మరిపెడ మండలం తానంచర్ల శివారు సపావట్ తండాకు చెందిన సపావట్ రోజా సీరోలు ఏకలవ్య గురుకులంలో సీఈసీ ఇంటర్ మొదటి ఫస్ట్ ఇయర్ చదువుతోంది. గతరాత్రి టెన్త్ విద్యార్థుల కోసం ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేసారు. పార్టీలో భాగంగా.. రోజా డీజే సౌండ్ బాక్స్ ముందు డ్యాన్స్ చేసింది. డ్యాన్స్ చేసిన తర్వాత స్టేజీ కిందకు వచ్చిన రోజా.. ఉన్నట్లుండి కుప్పకూలిపోయింది.వెంటనే అప్రమత్తమైన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు రోజాను మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ఆమె అప్పటికే చనిపోయినట్లు వెల్లడించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకున్నారు. కూతురు మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోధించారు. వారు రోధించిన తీరు అక్కడున్న వారిచే కంటతడి పెట్టించింది. రోజా చాలా యాక్టివ్‌గా ఉండేదని ఏకలవ్య గురుకులం సిబ్బంది తెలిపారు. డ్యాన్స్ చేసిన క్షణాల వ్యవధిలోనే కుప్పకూలిపోయిందన్నారు. వెంటనే తాము సీపీఆర్ చేశామని.. ఆ తర్వాత ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఈ ఘటనతో స్కూల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.కాగా, ఇటీవల కాలంలో గుండెపోటు మరణాలు ఎక్కువయ్యాయి. కొవిడ్ తర్వాత చాలా మంది గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు సైతం ఆకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోయారు. ఆడుతూ.. పాడుతూ.. నడుస్తూ.. నవ్వుతూ.. ఇలా క్షణాల వ్యవధిలోనే కుప్పకూలిపోతున్నారు. అందుకు వారి జీవనశైలి, మారుతున్న ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయకపోవటం వంటివి కారణాలుగా డాక్టర్లు చెబుతున్నారు. ఇక డీజేలు కూడా మనుషుల ప్రాణాలు తీస్తున్నాయి. డీజే సౌండ్ ఎక్కువగా పెట్టుకొని వినటం, దాని ముందు డ్యాన్సులు చేయటం ద్వారా గుండె బలహీన పడుతుందని నిపుణులు చెబుతున్నారు. బీపీని పెంచే ఏ కారణమైనా చివరకు గుండెకే ఎఫెక్ట్ చూపిస్తుందని అంటున్నారు. పెద్ద పెద్ద సౌండ్‌లతో డ్యాన్స్ చేయటం ద్వారా రక్తప్రసరణలో వేగం పెరిగి గుండెపోటుకు దారి తీస్తుందని అంటున్నారు.

## త్రిషకు రూ.కోటి నజరానా

**(1వపేజీ తరువాయి)**ప్రపంచ కప్ టోర్నీ ప్రారంభం నుంచి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో త్రిష క్రికెట్ అభిమానులను ఆకట్టుకోవడంతో పాటు.. టీమిండియా కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది.

**309 పరుగులు.. 7 వికెట్లు**

మలేషియా వేదికగా జరిగిన మహిళల అండర్ 19 టీ20 వరల్డ్ కప్ లో భారత అమ్మాయిలు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఫైనల్ లో దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించి వరుసగా రెండో సారి ఛాంపియన్ గా నిలిచారు. ఈ కప్ సాధించడంలో గొంగడి త్రిష కీలక పాత్ర పోషించింది. బ్యాట్, బంతితో ఆల్ రౌండ్ షో చేసి ఆకట్టుకుంది. తుది పోరులో 33 బంతుల్లో 44 పరుగులతో నాటౌట్ గా నిలిచింది. బౌలింగ్ లోనూ 3 వికెట్లు తీసింది. మొత్తంగా ఈ టోర్నీలో 77.25 సగటుతో 309 పరుగులు చేసింది త్రిష.

# తెలంగాణ రైతులకు గుడ్‌న్యూస్.. అకౌంట్లలో డబ్బులు జమ.. చెక్ చేసుకోండి..!



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో శుభవార్త వినిపించింది. జనవరి 26వ తేదీన లాంఛనంగా ప్రారంభించిన రైతు భరోసా పథకం కింద.. ఎకరానికి రూ.12 వేల పెట్టుబడి సాయాన్ని.. ఆ రోజు ఎంపిక చేసిన గ్రామాల్లోని అన్నదాతలకే అందించింది. అయితే.. మిగతా రైతులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వేళ.. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శుభవార్త వినిపించారు. ఈరోజు (ఫిబ్రవరి 05) నుంచి రైతు భరోసా డబ్బులను అన్నదాతల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను రేవంత్ రెడ్డి సర్కార్ ప్రారంభించిందని మంత్రి తుమ్మల వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో రైతుల అకౌంట్లలోకి ఇవ్వాళ్టి నుంచి రైతుభరోసా డబ్బులు జమ చేస్తున్నట్లుగా తెలిపారు. మొదటగా.. ఒక ఎకరం వరకు సాగులో ఉన్న భూములకు అంటే.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17.03 లక్షల మంది అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమవుతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.అయితే.. జనవరి 26వ తేదీన రైతు భరోసా పథకాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి సర్కార్.. మార్చి 31 నాటికి అన్నదాతల అకౌంట్లలోకి పెట్టుబడి సాయాన్ని జమ చేసే ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొంది. అయితే.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా.. ఇప్పటికే పలు జిల్లాల్లో రైతు భరోసా డబ్బుల పంపిణీ నిలిచిపోయింది. ఈ క్రమంలో.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. రైతు భరోసా లబ్ధిదారులకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే ఖాతాల్లో డబ్బులు వేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.జనవరి 26న రాష్ట్రవ్యాప్తంగా 563 గ్రామాల్లో రైతు భరోసా పథకంతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే.. ఈ పథకాలు ప్రారంభించిన తర్వాతి రోజు (జనవరి 27) నుంచే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమయ్యే ప్రక్రియ మొదలైంది. ఆరోజు వేసిన వారికి కాకుండా.. మిగిలిన గ్రామాల్లో రోజు విడిచి రోజు 40 రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు రేవంత్ సర్కార్ ప్లాన్ చేసింది. అయితే.. మధ్యలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావటంతో కొన్ని ప్రాంతాల్లో రైతు భరోసాకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కాగా.. తిరిగి రైతు భరోసా డబ్బుల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఈటల రాజేందర్‌కు గులాబీ బాస్ కేసీఆర్ ఫోన్..

# క్లారిటీ ఇచ్చిన బీజేపీ ఎంపీ



**హైదరాబాద్-నవభూమి:**మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు ఫోన్ చేశారని.. మళ్లీ కలిసి పని చేయాలని పిలిచారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రచారంపై ఈటల రాజేందర్ స్పందిస్తూ.. ఫుల్ క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఈటల తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ తనకు ఫోన్ చేసి పిలిచారంటూ చక్కర్లు కొడుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేశారు. తానంటే గిట్టని వారు.. సోషల్ మీడియాలో ఉండే కొందరు సైకోలు, శాడిస్టులు మాత్రమే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఈటల ఘాటుగా స్పందించారు. ఇందులో ఎలాంటి నిజం లేదని ఈటల రాజేందర్ ఖండిం చారు.తాను చాలా కాలంగా బీఆర్ఎస్, కేసీఆర్ విషయంలో తన స్పష్టమైన అభిప్రాయాన్ని చెబుతూనే ఉన్నప్పటికీ.. కొంతమంది కావాలనే పనిగట్టుకుని మరీ.. తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది పూర్తిగా బాధ్యత లేని వ్యక్తుల శాడిజమని అభిప్రాయ పడ్డారు. తనపై ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసేవారిపైనే త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటనని ఈటల రాజేందర్ హెచ్చరిం చారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈటల రాజేందర్.. కీలక విషయాలు వెల్లడించారు. మళ్లీ కేసీఆర్ పిలిస్తే వెళ్తారా అంటూ.. జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు ఈటల తనదైన శైలిలో స్పందించారు. తామంతా బాధ్యత ఉన్న రాజకీయ నేతలుగా చెప్పుకొచ్చిన ఈటల.. ఇదేమీ పిల్లల ఆట కాదన్నారు. వాళ్ల పార్టీ వాళ్లది, తమ పార్టీ తమదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావటమే తన లక్ష్యమని ఈటల స్పష్టం చేశారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రోజులో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో సరైన సమాచారం లేదని పేర్కొన్న ఈటల రాజేందర్.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ జరిపిన కులగణనలో కూడా శాస్త్రీయత లేదంటూ విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే బీసీ-ఈ గ్రూప్ తీసుకొచ్చారన్నది తప్పుడు వాదన అని.. నిజానికి ఆతకుముందే కొన్ని ముస్లిం కులాలు బీసీ-బీ గ్రూప్‌లో ఉన్నాయని ఈటల వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిష్పక్షపాత దృష్టి, చిత్తశుద్ధి, సరైన ప్రణాళిక ఏమీ లేదన్నారు.

# హిందూయేతర ఉద్యోగులు,సిబ్బందిపై చర్యలు

**(1వపేజీ తరువాయి)**చేసింది. చర్యలు తీసుకుంది. ఈ ఉద్యోగులు హిందూ సంప్రదాయాలను పాటించడం లేదని, హిందూయేతర మత కార్యకలాపాలలో పాల్గొంటున్నారని గుర్తించారు. హిందూ ఉద్యోగులు మాత్రమే దేవస్థానంలో పనిచేయగలరని టీటీడి బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు ఇప్పటికే స్పష్టం చేశారు. ఆయన సూచనలతో టీటీడీ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.దర్యాప్తులో 18 మంది ఉద్యోగులు హిందూయేతర సంప్రదాయాలను అనుసరిస్తు న్నట్లు తేలింది. దీని కారణంగా వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. బదిలీ లేదా వీఆర్ఎస్ టీటీడీ బోర్డు ప్రతిపాదన ప్రకారం, ఈ ఉద్యోగులను తిరుమల దేవాలయాలు, సంబంధిత విభాగాల నుంచి తొలగిస్తారు. అలాగే వారు ఏ హిందూ మతపరమైన కార్యక్రమంలో లేదా ఆచారంలో పాల్గొనడానికి అనుమతించబడరు. ఈ ఉద్యోగులకు బోర్డు రెండు ఎంపికలను ఇచ్చింది - వారు ప్రభుత్వ విభాగానికి బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాలి లేదా స్వచ్ఛంద పదవీ విరమణ పథకం కింద సంస్థ నుండి పదవీ విరమణ చేయాలి. వారు ఈ ఎంపికలలో దేనినైనా అంగీకరించకపోతే వారిపై మరింత కఠినమైన చర్యలు తీసుకోబడతాయి. "టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు టీటీడీలో పనిచేస్తున్నప్పుడు హిందూయేతర మతపరమైన కార్యకలాపాల్లో పాల్గొన్న ఉద్యోగులపై చర్యలు ప్రారంభించబడ్డాయి. హిందూ సంప్రదాయా లను పాటించకుండా ఇతర మతాలకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొన్న 18 మంది ఉద్యోగులను అధికారులు గుర్తించారు. అలాంటి ఉద్యోగులను దేవాలయాలు, మతపరమైన కార్యక్రమాల నుండి తొలగిస్తారు. వారికి బదిలీ లేదా వీఆర్ఎస్ ఎంపిక ఇవ్వబడుతుంది. టీటీడీ మతపరమైన ప్రాముఖ్యతను, దేవాలయాల ఆధ్యాత్మిక పవిత్రతను కాపాడుకోవడానికి ఈ నిర్ణయం తీసుకోబడింది" అని టీటీడీ విడుదల చేసిన అధికారిక ప్రకటనలో తెలిపింది. 1989 ఎండోమెంట్ చట్టం ప్రకారం.. టీటీడీ బోర్డు ప్రకారం, 1989 ఎండోమెంట్ చట్టం ప్రకారం టీటీడీ ఉద్యోగులందరూ హిందూ సంప్రదాయాలను పాటించడం తప్పనిసరి. ఈ విషయం ఆలయ పవిత్రతకు, భక్తుల మతపరమైన భావాలకు సంబంధించినదని బోర్డు పేర్కొంది. తిరుమలను హిందూ విశ్వాస కేంద్రంగా ఉంచడం తన ప్రాధాన్యత అని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఇప్పటికే స్పష్టం చేశారు. దేవస్థానం సంప్రదాయాలను గౌరవించడంలో రాజీ పడబోమని ఆయన అన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నాయకుడు భాను ప్రకాష్ రెడ్డి ఈ నిర్ణయాన్ని సమర్థించారు. హిందూ మత స్థలాల పవిత్రతను కాపాడుకోవడానికి ఇది అవసరమైన చర్య అని తెలిపారు. అవసరమైతే హిందూయేతర ఉద్యోగులందరినీ తొలగించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ నిర్ణయం తర్వాత తిరుపతి ఆలయ పరిపాలనలో మార్పులు జరిగే అవకాశం ఉంది.

# తప్పుడు ప్రచారాలను బీసీ ప్రజలు నమ్మొద్దు

### తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణలో ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ, కులగణన అంశాలు హాట్ టాపిక్‌గా మారాయి. నిన్న (మంగళవారం) ప్రత్యేకంగా శాసనసభ, మండలి సమావేశాలు నిర్వహించి మరీ సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ వాటిని ఆమోదించింది. అయితే బీసీ కులగణనపై ప్రతిపక్ష, స్వపక్ష నేతల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. బీసీ జనాభా తగ్గించి చూపే ప్రయత్నం చేశారంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కులగణన మొత్తం తప్పులతడకగా ఉందని, దాదాపు 40 లక్షల బీసీ జనాభా తగ్గించి లెక్కలు చూపారంటూ మండిపడుతున్నారు. అయితే అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకునే పక్కాగా సర్వే చేసినట్లు మంత్రులు, కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఎక్కడా వారిని తగ్గించి చూపలేదని, సర్వే పక్కాగా జరిగిందని అంటున్నారు. ఈ మేరకు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలకు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు.

ఈ సందర్భంగా గాంధీ భవన్ వద్ద పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "ఏ లెక్కల ఆధారంగా కులగణన తప్పని అంటున్నారో ప్రతిపక్షాలు చెప్పాలి. మీరు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపండి. రాజకీయ నాయకుల ఉచ్చులో బీసీ సంఘాలు, బీసీ నాయకులు పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. బీసీలను అనగదొక్కిన పార్టీలు, నాయకుల మాటలు నమ్మి మోసపోకండి. బీసీ లెక్కలు తగ్గాయని మాట్లాడుతున్న వారికి ప్రామాణికం ఏంటి?. దేన్ని ఆధారం చేసుకుని వారు మాట్లాడుతున్నారు. తప్పుడు మాటలతో బీసీ ప్రజలను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి. గత పదేళ్లలో బీసీలకు ఏం న్యాయం చేశారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి.

స్థానిక సంస్థల్లో బీసీల జనాభా తగ్గించింది బీఆర్ఎస్ కాదా?. ఎన్నో సంవత్సరాలుగా బీసీ కులగణన కోసం ఆ వర్గం నేతలు, ప్రజలు ఎదురుచూశారు. అది కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చింది. బీసీల ఆకాంక్ష నేరవేర్చామని ప్రతిపక్షాలకు కడుపుమంట. అడ్డగోలుగా కుటుంబంలో నలుగురికి మంత్రి పదవులు ఇచ్చే పార్టీ మాది కాదు. సమగ్ర కుటుంబ సర్వే మంచిదే అయితే దాన్ని ఎందుకు టేబుల్ చేయలేదో సమాధానం చెప్పాలి. ఇన్ని రోజులూ ఎడారిలో ఉన్నాం. బిందెడు నీళ్లు దొరికితే వాటిని కాపాడుకోవాలి. గురువారం మా కుటుంబ(కాంగ్రెస్ పార్టీ) మీటింగ్ జరుగుతుంది. కులగణనపై ఎవరికైనా అనుమానాలు ఉంటే అన్ని విషయాలూ అక్కడ మాట్లాడుకుంటాం. కాంగ్రెస్ నేతలు ఎంత చిన్నవారైనా, పెద్దవారైనా పార్టీ క్రమశిక్షణకి లోబడే ఉండాలి. పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు. ఎవరైనా కులగణనకు ఇంకా వివరాలు ఇవ్వకపోతే ఇప్పటికైనా ఇవ్వండి" అని చెప్పారు.

**మల్లన్నకు షోకాజ్ నోటీసులు..**

కాగా, కులగణన సర్వేను ఎమ్మెల్సీ చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) కాల్చివేయడంపై కాంగ్రెస్ పార్టీ సీరియస్ అయ్యింది. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో చెప్పాలంటూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మల్లన్న ఇచ్చే సమాధానం ఆధారంగా ఆయనపై చర్యలు తీసుకోవాలా, వద్దా? నిర్ణయించనుంది. అయితే ప్రస్తుతం తీన్మార్ మల్లన్న వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడడం లేదు. పార్టీలో ఉంటూనే సొంత ప్రభుత్వం చేసిన సర్వేను ఆయన వ్యతిరేకిస్తూ హాట్ టాపిక్‌గా మారారు.

# మళ్లీ కేజ్రీవాలే!

**(1వపేజీ తరువాయి)**ఢిల్లీలో గెలిచేది వారే-తేల్చేసిన మ్యాట్రిజ్-ఏబీపీ ఎగ్జిట్ పోల్..!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలవబోతున్నారనే అంశంపై మ్యాట్రిజ్-ఏబీపీ ఎగ్జిట్ పోల్ అంచనాలు వెలువడ్డాయి. 70 సీట్లున్న ఢిల్లీ అసెంబ్లీలో అత్యధిక సీట్లు గెలువబోతున్న పార్టీ, ఇతర పార్టీలకు ఎన్ని సీట్లు వస్తాయనే దానిపై మ్యాట్రిజ్-ఏబీపీ పోల్ తన అంచనాలను ప్రకటించింది. ఇందులో ఈసారి కేంద్రంలో బీజేపీ ఢిల్లీలో ఆప్ ఆధిపత్యానికి గండి కొట్టబోతున్నట్లు తెలిపింది. మ్యాట్రిజ్-ఏబీపీ ఎగ్జిట్ పోల్ ప్రకారం 70 సీట్ల ఢిల్లీ అసెంబ్లీలో బీజేపీ ఈసారి ఏకంగా 35 నుంచి 40 సీట్లు దక్కించుకోబోతున్నట్లు తెలిపింది. అలాగే అధికార ఆప్ కు 32 నుంచి 37 సీట్లు లభించబోతున్నట్లు వెల్లడించింది. కాంగ్రెస్ పార్టీకి 0 నుంచి 1 సీటు దక్కే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దీంతో గత మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఊపుమీదున్న ఆప్ ఆధిపత్యానికి గండిపడటం ఖాయమని మ్యాట్రిజ్-ఏబీపీ ఎగ్జిట్ పోల్ తేల్చేసింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఆప్, బీజేపీ మధ్య గట్టి పోరు సాగింది. ఇరు పార్టీలు విజయం కోసం తీవ్రంగా ప్రయత్నించారు. కేజ్రివాల్ నేతృత్వంలోని ఆప్ వరుసగా నాలుగోసారి డిల్లీలో అధికారం దక్కించుకునేందుకు శ్రమించారు. అయితే కేంద్రంలో మూడోసారి గెలిచినా ఢిల్లీని గెలవలేకపోతున్నారన్న అపప్రదను పోగొట్టుకునేందుకు బీజేపీ నేతలు పక్కా వ్యూహాలు రచించారు. ఈ నేపథ్యంలో మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్ అంచనాలు కాషాయ దళంలో ఊపుతెచ్చాయి.

## టీటీడీపీ కోసం రంగంలోకి పీకే

**(1వపేజీ తరువాయి)**చెప్పుకొచ్చారు. టీడీపీకి పని చేస్తున్న రాబిన్ శర్మ టీంతో కలిసి కొన్ని కీలక వ్యూహాలు.. సూచనలు ఆ సమయం లోనే ప్రశాంత్ కిశోర్ టీడీపీకి అందించారు. ఇప్పుడు ఏపీతో పాటుగా తెలంగాణ రాజకీయాల పైన లోకేష్ తో ప్రశాంత కిశోర్ చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీతో కలిసి వెళ్లాలని భావిస్తోంది. ఈ మేరకు ప్రతిపాదన చర్చకు వచ్చింది. దీంతో, ఈ అంశం పైన ప్రశాంత్ కిశోర్ తో లోకేష్ ప్రధానం గా చర్చ చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణలో టీడీపీ యాక్టివ్ అయ్యే అవకాశం.. గ్రేటర్ తో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం బలం - బలహీనతల పైన ఈ చర్చ లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఏపీలో ప్రభుత్వం పైన ప్రజల్లో ఉన్న అభిప్రాయం.. కూటమి పార్టీల మధ్య సమన్వయం కొరవడిన అంశాల ను ప్రశాంత్ కిశోర్ నివేదిక రూపంలో లోకేష్ కు అందించినట్లు తెలుస్తోంది. పీకే నివేదిక ఏపీలో కూటమి ప్రభుత్వ ఎనిమిది నెలల పాలన పైన టీడీపీ నాయకత్వం ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి నుంచి సమాచారం సేకరిస్తోంది. పథకాల అమలు విషయంలో వస్తున్న ఫీడ్ బ్యాక్ తో వాటి అమలు చేయాలనే ఆలోచన చేస్తోంది. ఇక, పవన్ - బీజేపీ రాజకీయ వ్యూహాల పైన టీడీపీ అలర్ట్ అవుతోంది. వారితో సఖ్యతగా ఉంటూనే...రాజకీయ పరిణామాలకు అనుగుణంగా భవిష్యత్ నిర్ణయా లను తీసుకుంటోంది. దీంతో.. ప్రధానంగా ఏపీలో కూటమి పాలన పైన ప్రజల్లో ఉన్న అంచనాలు, రాజకీయంగా మారుతున్న లెక్కల గురించి ప్రశాంత్ కిశోర్ కీలక సూచనలు.. అలర్ట్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో, ఇప్పుడు పీకే సూచనల మేరకు రాజకీయంగా ఎలాంటి కొత్త నిర్ణయాలు అమలు అవుతాయనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## నేటి కేబినెట్ భేటీకి పవన్ గైర్హాజరు?

**(1వపేజీ తరువాయి)**అధికారిక కార్యక్రమాలకు దూరమవుతున్నారు. కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కు డాక్టర్లు రెస్ట్ తీసుకోవాలని సూచించారు. దీంతో సమీక్షలకు కూడా దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కేబినెట్ భేటీకి కూడా హాజరుకాకుండా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కేబినెట్ భేటీకి వెళ్తే కనీసం మూడు, నాలుగు గంటలు అయినా సమావేశంలో కూర్చోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం జ్వరంతో బాధపడుతున్న పవన్ అంత సమయం కేబినెట్ భేటీలో కూర్చొనే పరిస్థితి లేకపోవడంతో డాక్టర్ల సూచన మేరకు గైర్హాజరు అవుతున్నట్లు సమాచారం.

## వాల్తేర్ డివిజన్ ఇక విశాఖ డివిజన్

**(1వపేజీ తరువాయి)**డివిజన్లు రానున్నాయి. అలాగే విశాఖ డివిజన్‌లో 410 కి.మీ పరిధిని కూడా చేరుస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సికింద్రాబాద్-అయోధ్య, ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్‌కు ఏపీలో హాల్ట్ స్టేషన్లు ఇవే అలాగే కొండపల్లి-మోటుమర్రి సెక్షన్‌ను సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్‌కు మారుస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ మరో నిర్ణయం తీసుకుంది. మరోవైపు రాయగడ రైల్వే డివిజన్ పరిధి కూడా ఖరారు చేస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. తాజా మార్పుల ప్రకారం రైల్వే డివిజన్లు, జోన్లు పనిచేయబోతున్నాయి. వాస్తవంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లోకి తొలుత వాల్తేరు డివిజన్ కలిపేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ఒప్పుకోలేదు. దీంతో కొత్త రైల్వే జోన్ కూడా ఆలస్యమైంది. ఇప్పుడు రైల్వే శాఖ నిర్ణయంతో పనులు వేగవంతం కానున్నాయి.

## హరీశ్‌ను అరెస్టు చేయవద్దు

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఈ నెల 12వ తేదీ వరకు హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దని హైకోర్టు పేర్కొంది. హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఈరోజు మరోసారి పొడిగించింది. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసింది.పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేయాలంటూ హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది.

## తీన్మార్ మల్లన్నకు షోకాజ్

మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తెలంగాణ జనాభాలో 56.33 శాతం బీసీలే.. రాష్ట్ర జనాభాలో 56.33 శాతం (1,99,85,767 మంది) వెనుకబడిన తరగతులకు చెందిన వారే ఉన్నారని కులగణన సర్వే లెక్కలు వెల్లడించాయి. తెలంగాణ కులగణన సర్వే భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 96.9 గృహాలను కవర్ చేసి 3,54,77,554 మంది వ్యక్తులను సర్వే చేశారు. సర్వే ప్రకారం, తెలంగాణ జనాభాలో 10.45 శాతం (37,05,929) షెడ్యూల్డ్ కులాలు .. 17.43 శాతం (61,84,319) షెడ్యూల్డ్ తెగలు ఉన్నారు. అంతేకాకుండా, కులగణన సర్వేలో తెలంగాణలో ముస్లిం సమాజానికి చెందిన 44,57,012 మంది ఉన్నారని, మొత్తం జనాభాలో 12.56 శాతం మంది ఉన్నారని తేలింది. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతం, రాష్ట్రంలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతంగా ఉందని కులగణన సర్వే ద్వారా తెలిసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in






## టీవీకేలో ఆటో డ్రైవర్‌కు వరించిన పదవి

**చెన్నై- నవభూమి:** ప్రముఖ సినీనటుడు విజయ్(నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగంలో కోయంబత్తూరు సూలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న కోయంబత్తూరు సబర్బన్ ఈస్ట్ జిల్లా కార్యదర్శిగా బాబు అనే ఆటో డ్రైవర్‌ను నియమించారు. విజయ్ వీరాభిమాని అయిన బాబు తనకు పార్టీలో కీలకమైన పదవి ఇచ్చినందుకు ఉబ్బితబ్బిబ్బైపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన స్నేహితులు, పార్టీ మహిళా కార్యకర్తలు ఆయనను సత్కరించారు.ఆటో డ్రైవర్ బాబు మాట్లాడుతూ తాను



విజయ్ అభిమాన సంఘం, విజయ్ మక్కల్ ఇయక్కమ్‌లో క్రియాశీల కార్యకర్తగా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనేవాడినని, పార్టీ ప్రారంభించిన తర్వాత కూడా సాధారణ కార్యకర్తగానే కొనసాగాలని నిర్ణయించుకున్నానని, ఈ పరిస్థితుల్లో పార్టీ నేత విజయ్ తనకు జిల్లా శాఖ కార్యదర్శి పదవినివ్వడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

## అడుగడునా బారికేడ్లు..ప్రజలు ఓట్లు ఎలా వేస్తారు.. ఢిల్లీ పోలీసులపై మంత్రి ఫైర్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. ఒకే విడతలో జరగనున్న ఈ పోలింగ్‌లో అన్ని నియోజకవర్గాల్లో కలిపి వివిధ పార్టీల నుంచి 699 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం ఆతిషీ సహా అనేక మంది ప్రముఖ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ మొదలైనప్పటి నుంచి ఉదయం 11 గంటల వరకూ దాదాపు 20 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అటువంటి పరిస్థితిలో గ్రేటర్ కైలాష్ నియోజకవర్గం నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి మంత్రి సౌరభ్ భరద్వాజ్ సంచలన ఆరోపణలు చేశారు.ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ బుధవారం మాట్లాడుతూ, ఆప్ బలంగా ఉన్న ప్రాంతాలలో పోలింగ్ బూత్‌ల నుంచి 200 మీటర్ల దూరంలో ఢిల్లీ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఇలా అడుగడునా బారికేడ్లు ఏర్పాటు చేస్తే ప్రజలు ఓట్లు ఎలా వేస్తారని ఢిల్లీ పోలీసులపై మండిపడ్డారు.

**ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలి..**

ఎక్స్ వేదికగా ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఇలా రాశారు. 'ఆమ్ ఆద్మీ పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఢిల్లీ పోలీసులు పోలింగ్ బూత్‌ల నుంచి 200 మీటర్ల దూరంలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇది చిరాగ్ ఢిల్లీ పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాటు. బైక్‌లు, స్కూటర్లు, కార్లను అనుమతించరు. ప్రజలు ఎలా ఓటు వేస్తారు? వృద్ధులు, వికలాంగులు ఓటు వేయడానికి 200 మీటర్లు నడిచి వస్తారా? ఇది ఏ చట్టం లేదా నియమం ప్రకారం జరుగుతుందో ఎన్నికల సంఘం మరియు ఢిల్లీ పోలీస్ కమిషనర్ చెప్పాలి?' అని ప్రశ్నించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో పేలిన ప్రెషర్ బాంబు



**చింతూరు-నవభూమి:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలిన ఘటనలో ముగ్గురు జవాన్లకు గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం బీజాపూర్, దంతెవాడ జిల్లాల సరిహద్దులో చోటుచేసుకుంది. డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్స్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు మంగళవారం కూంబింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబ్‌పై ఇద్దరు జవాన్లు అడుగు వేయడంతో అది పేలింది. ఆ ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. మరో జవాను మావోయిస్టులు అమర్చిన బూబీ ట్రాప్‌పై అడుగు వేయడంతో గాయపడ్డాడు. గాయపడ్డ జవాన్లను రాయపూర్ ఆస్పత్రికి తరలించారు.

## ఆయన.. అమిత్ షా గూండా!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ పోలీసు అధికారిపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పోలీసు అధికారిని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా గుండాగా అభివర్ణించారు. "అమిత్‌షా గూండా ఒకరు పోలీసు దుస్తులు ధరించారు. బహిరంగంగానే ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అమిత్‌షా గారూ.. ఈ దేశం మీ గూండాయిజాన్ని ఏమాత్రం సహించదు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. సంబంధిత వీడియోను ఆప్ మీడియా చీఫ్ కోఆర్డినేటర్ వికాస్ యోగి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. "నాతో పెట్టుకుంటే నువ్వు నన్నేమీ చేయలేవు. కానీ, నేను తలుచుకుంటే నువ్వు ఇబ్బందుల్లో పడతావు" అంటూ బవానా నియోజకవర్గం ఆప్ అభ్యర్థిని ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్.. బహిరంగంగా బెదిరించిన వీడియోను కూడా పోస్టు చేశారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ స్పందిస్తూ.. "ఇది అమిత్‌షా గూండాగిరికి నిదర్శనం" అని అన్నారు. 'అమిత్‌షా గూండాగిరి' హ్యాష్ ట్యాగ్‌తో సోషల్ మీడియాలో ఆయన క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు.సీఎం అతిశీపై ఢిల్లీలోని గోవిందపురి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎన్నికల నిబంధనావళిని సీఎం ఉల్లంఘించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారి తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని తెలిపారు. "సీఎం అతిశీ తన అనుచరులు 50-70 మందితో 10 వాహనాల్లో వచ్చి ఫతే సింగ్ మార్గ్‌ను బ్లాక్ చేశారు. ఇది కోడ్‌కు విరుద్ధం" అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కాగా, మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘంతో కేజ్రీవాల్, అతిశీ భేటీ అయ్యారు.

## దివ్యాంగులందరూ పరీక్షల్లో స్క్రైబ్‌లను ఉపయోగించుకోవచ్చు

**న్యూఢిల్లీ-నవభూమి:** దివ్యాంగ అభ్యర్థులందరూ పరీక్షల్లో జవాబులు రాసేందుకు తమకు సహాయకులుగా 'స్క్రైబ్' (లేఖరి)లను నియమించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం 40 శాతం మేర వైకల్యం ఉన్న అభ్యర్థులే స్క్రైబ్‌లను తోడుగా తీసుకెళ్లవచ్చు. ఇందుకు సంబంధిత అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి వారిని 'పర్సన్స్ విత్ బెంచ్‌మార్క్ డిజేబిలిటీస్' (పీడబ్ల్యూబీడీ) అభ్యర్థులుగా వ్యవహరిస్తారు. 40 శాతం ప్రామాణికత కన్నా తక్కువ వైకల్యం ఉన్న 'పర్సన్స్ విత్ డిజేబిలిటీస్' (పీడబ్ల్యూడీ) అభ్యర్థులు కూడా స్క్రైబ్‌లను వినియోగించుకోవచ్చని సోమవారం జస్టిస్ జె.బి.పార్డీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఆదేశించింది. దీనిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని తెలిపింది. పరీక్షలు నిర్వహించే అన్ని సంస్థలూ దీన్ని పాటించాలని పేర్కొంది. ఇలాంటి సమస్యలు కోర్టు వరకు రాకుండా ముందుగానే పరిష్కరించేందుకు వీలుగా పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రస్తుతం ఆరు నెలలకు చెల్లుబాటు అయ్యేలా స్క్రైబ్ సర్టిఫికెట్ ఇస్తుండగా ఆ గడువును పెంచాలని ఆదేశించింది.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ ఎక్కువ సార్లు విజయం సాధించిందో తెలుసా?




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో నేడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే మూడు పార్టీల మధ్యే ప్రధానంగా పోటీ జరుగుతుండగా.. ఈసారి అధికారం ఎవరు దక్కించుకోబోతున్నారో తెలుసుకునేందు దేశ వ్యాప్తంగా ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదంతా ఇలా ఉండగా.. ఇప్పటి వరకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ సార్లు గెలుపొందిన పార్టీ ఏది, ఎవరెవరు ముఖ్యమంత్రులుగా పని చేశారు, మొత్తం ఎన్ని సార్లు అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు వంటి విషయాల గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

దేశ రాజధాని ఢిల్లీలో మొదటి శాసన సభ ఎన్నికలు 1952లో జరిగాయి. కానీ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం 1956 ప్రకారం ఢిల్లీని భారత రాష్ట్రపతి ప్రత్యక్ష పరిపాలనలో కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. అలాగే ఢిల్లీ శాసనస భను కూడా రద్దు చేశారు. కానీ 1991లో 69వ సవరణ ద్వారా ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతాన్ని అధికారికంగా ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతంగా ప్రకటించారు. ఇక ఆ తర్వాత అంటే 1993లో తొలి సారిగా ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు.

ముఖ్యంగా 1993 నవంబర్ 6వ తేదీన నిర్వహించిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో.. 70 సీట్లకు గాను బీజేపీ 49 స్థానాలు దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీ 14 సీట్లను, జనతా దళ్ 4 స్థానాలను, స్వతంత్ర అభ్యర్థులు 3 స్థానాలను గెలుచుకున్నారు. ఇలా బీజేపీ అధికారాన్ని దక్కించుకోగా.. మదన్ లాల్ కురానా తొలి ముఖ్యమంత్రిగా పని చేశారు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా.. పీవీ నరసింహారావు ప్రధానిగా పని చేశారు.ఇక రెండోసారి 1998లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా.. 52 స్థానాలు దక్కించుకుని కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బీజేపీకి 17 స్థానాలు రాగా జేడీయూకి ఒకే ఒక్క స్థానం లభించింది. ఇలా ఢిల్లీ రెండో ముఖ్యమంత్రిగా షీలా దీక్షిత్ పని చేశారు. అప్పుడు కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉండగా.. అటల్ బిహారీ వాజ్‌పేయూ ప్రధానిగా పని చేశారు.

ఇక మూడోసారి 2003లో జరిగిన ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో 70 స్థానాకలు గాను.. కాంగ్రెస్ 47 స్థానాలు దక్కించుకుంది. బీజేపీకి 20, జేడీయూకి 1, ఎన్‌సీపీకి 1, స్వతంత్ర అభ్యర్థికి ఒక స్థానం రాగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అలా ఢిల్లీ మూడో ముఖ్యమంత్రిగా మళ్లీ షీలా దీక్షిత్‌యే నియమితులయ్యారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాగా.. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నారు.నాలుగో సారి 2004లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌యే విజయం సాధించింది. 70 సీట్లకు గాను కాంగ్రెస్ 43, బీజేపీ 23, బీఎస్పీ 2, ఎల్‌జేపీ 1, స్వతంత్ర అభ్యర్థి ఒక సీటు గెలుచుకోగా.. నాలుగో సీఎంగా కూడా షీలా దీక్షిత్‌యే పదవీ బాధ్యతలు చేపట్టారు. అప్పుడు కూడా కేంద్రంలో కాంగ్రెస్‌యే అధికారంలో ఉండగా మన్మోహన్ సింగ్‌యే ప్రధాన మంత్రిగా పని చేశారు. అయితే ఐదో సారి 2013లో జరిగిన ఎన్నికల్లో మాత్రం ఆమ్ అద్మీ పార్టీ విజయం సాధించింది. కేవలం 28 సీట్లు మాత్రమే గెలుచుకున్న ఆప్.. 8 స్థానాలు కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చింది. అప్పుడు బీజేపీకి 31 సీట్లు రాగా, ఇండిపెండెంట్ అభ్యర్థికి ఒక సీటు, జేడీయూకు ఒక స్థానం, ఎస్ఏడీకి ఒక స్థానం వచ్చింది. ఇలా ఐదో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ అధినేత అర్విందు కేజ్రీవాల్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అప్పుడు కేంద్రంలో ఏడాది పాటు కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. 2014లో బీజేపీ గెలిచింది. అలాగే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారు.ఇక 2015లో ఆరోసారి ఢిల్లీకి శాసన సభ ఎన్నికలు జరగ్గా.. ఆమ్ అద్మీ పార్టీ 66 స్థానాలు గెలుచుకుని విజయం సాధించింది. బీజేపీ 4 సీట్లు రాగా.. కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది. ఇలా ఆరోసారి ముఖ్యమంత్రిగా అర్విందు కేజ్రీవాల్‌యే పదవీ బాధ్యతలు స్వీకరించారు. అప్పుడు కేంద్రంలో బీజేపీయే అధికారంలో ఉండగా.. ప్రధానిగా మోదీ పని చేస్తున్నారు. ఇక ఏడో సారి 2020లో జరిగిన ఎన్నికల్లోనూ ఆప్ 62 స్థానాలు గెలుచుకోగా.. బీజేపీ 8 స్థానాలు దక్కించుకుంది.

ఇలా ఏడో ముఖ్యమంత్రిగా అర్విందు కేజ్రీవాల్ బాధ్యతలు చేపట్టగా.. లిక్కర్ స్కాంలో ఇరుక్కుని జైలుకు వెళ్లారు. అక్కడి నుంచి పాలన అందించడం కష్టం కావడంతో.. 2024 సెప్టెంబర్ నెలలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిశీకి పదవీ బాధ్యతలు అప్పజెప్పారు. ఇప్పుడు కూడా కేంద్రంలో బీజేపీయే అధికారంలో ఉంది. మరి ఇప్పుడు జరగబోతున్న ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుంది, ఎవరు ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోబోతున్నారో తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

## మహిళకు ఎమ్మెల్యే ఫ్లయింగ్ కిస్.. కేసు నమోదు, నెటిజన్ల ఫైర్



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. 70 స్థానాలకు గానూ ఒకే విడతలో ఇవాళ ఎన్నికలు నిర్వహిస్తుండగా.. ఈనెల 8వ తేదీన ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ క్రమంలోనే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు హోరా హోరీగా తలపడుతున్నాయి. వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ఉవ్విళ్లూరుతుండగా.. ఈసారైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ పీఠం కైవసం చేసుకునేది ఎవరు అనేది తేలాలంటే శనివారం వరకు ఆగాల్సిందే. అయితే అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఓ ఆప్ ఎమ్మెల్యే తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఓ మహిళ పట్ల ఆ ఎమ్మెల్యే అసభ్యంగా ప్రవర్తించారంటూ ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆప్ ఎమ్మెల్యే దినేష్ మోహానియా.. ఒక మహిళ పట్ల తీవ్ర అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రచారానికి వెళ్లిన దినేష్ మోహానియా.. ఒక మహిళకు ఫ్లయింగ్ కిస్ ఇచ్చారన్న వార్త ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలోనే రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసులు. దినేష్ మోహానియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.ఢిల్లీలోని సంగం విహార్ నియోజకవర్గం నుంచి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దినేష్ మోహానియా.. తాజాగా మరోసారి అదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల తన నియోజకవర్గంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించిన దినేష్ మోహానియా.. ఓ మహిళతో అనుచితంగా ప్రవర్తించడంతో పాటు ఆమెను చూస్తూ సైగలు చేసినట్లు బాధితురాలు ఆరోపించారు. ఆ తర్వాత ఆమెకు ఫ్లయింగ్ కిస్ ఇవ్వడంతో.. ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆ?గ్రహం వ్యక్తం చేసిన ఆ మహిళ.. తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది.


మరోవైపు.. ఎన్నికల ర్యాలీలో భాగంగా దినేష్ మోహానియా ఫ్లయింగ్ కిస్ ఇచ్చిన ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ వీడియో వైరల్ కావడంతో ఎమ్మెల్యేపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. అయితే ఇలాంటి వివాదాలు దినేష్ మోహానియాకు ఇప్పుడు కొత్తేమీ కాదు. గత ఏడాది కూడా సంగం విహార్ నియోజకవర్గంలోని రోడ్డు పక్కన పండ్ల వ్యాపారితో ఆయన దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై కేసు నమోదు అయింది. ఇక ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది.

## వలసదారుల విమానం.. వారిని అదుపులోకి తీసుకుంటారా?



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటినుంచి.. ఆ దేశంలో వీసా గడువు ముగిసినా నివసించేవారు, అక్రమ మార్గాల్లో అమెరికాకు వచ్చిన వారిని.. స్వదేశాలకు పంపించే చర్యలు వేగవంతం చేశారు. అందులో భారతీయులు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా సైనిక, వాణిజ్య విమానాల్లో అక్రమ వలసదారులను వారి దేశాలకు పంపిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా 205 మంది భారతీయులతో కూడిన అమెరికా సైనిక విమానం సీ17.. పంజాబ్‌లో దిగింది. అమెరికాలోని అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న డొనాల్డ్ ట్రంప్.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. చట్టవ్యతిరేకంగా అమెరికాలో ఉంటున్న వారిని బయటికి పంపేస్తోంది.ఇ-ఈ క్రమంలోనే మంగళవారం 205 మందితో టెక్సాస్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరిన అమెరికా మిలిటరీ విమానం సీ-17.. బుధవారం మధ్యాహ్నం పంజాబ్‌లోని అమృత్‌సర్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అయితే అందులో ఉన్న వారంతా పంజాబ్, దాని పరిసర రాష్ట్రాలకు చెందిన వారు అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇక స్వదేశానికి చేరిన ఈ అక్రమ వలసదారులను ఏం చేస్తారు అనేదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే వారిని అదుపులోకి తీసుకునేందుకు మన దేశంలో ఎలాంటి ఆదేశాలు లేవని తెలుస్తోంది. దీంతో అవసరమైన తనిఖీలు నిర్వహించిన తర్వాత.. వారందర్నీ ఎయిర్‌పోర్టు నుంచి బయటికి పంపించనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.అయితే వారిని అమెరికా నుంచి స్వదేశానికి పంపించే ముందు ప్రతీ ఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు తెలిపారు. మరికొన్ని రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు.. అక్రమ వలసదారులను తీసుకు రానున్నాయని స్పష్టం చేశారు. అమెరికా హోంలాండ్ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం.. అమెరికాలో ఉంటున్న 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేవని తెలుస్తోంది. వారిలో 17,940 మందిని వెనక్కి పంపేందుకు అమెరికా ప్రభుత్వం తుది ఉత్తర్వులు జారీ చేసింది. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ నిర్బంధంలో ఉంచగా.. తొలివిడతలో భాగంగా 205 మందిని పంపించేశారు.మరోవైపు.. అమెరికా నుంచి అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించాలని అమెరికా తీసుకున్న నిర్ణంపై ఇప్పటికే భారత్ స్పందించింది. ఏ దేశంలోనైనా అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని.. ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా గడువు ముగిసిన తర్వాత లేదా సరైన పత్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని స్పష్టం చేసింది.

## చెవులు కుట్టించబోతే బిడ్డ మృతి.. ఎంత పనైంది?



**న్యూఢిల్లీ-నవ భూమి:** చిన్న పిల్లలు పుట్టి నప్పటి నుంచి వారికి ఓ ఐదేళువచ్చే వరకు అనేక క్రతువులు నిర్వహిస్తుంటారు. పురుడు, బారసాల, నామకరణ మహోత్సవం, అన్నప్రాసన, చెవులు కుట్టించడం, పుట్టు వెంట్రుకలు తీయడం, ఆడ పిల్లలు అయితే గాజులు వేయడం అలా ప్రతీ దాన్ని పండగలాగే జరుపుకుంటారు. అలాంటి ఓ కార్యక్రమమే చేయబోయిందో కుటుంబం. ముఖ్యంగా తమ ఆరు నెలల శిశువుకు చెవులు కుట్టించాల నుకున్నారు. అయితే బిడ్డ నొప్పిని తట్టుకోలేడని భావించి మత్తు సూది ఇప్పించారు. అదే వారు చేసిన తప్పు అయింది. దాని వల్లే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాధ ఘటన ఎక్కడ జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.కర్ణాటకలోని చామరాజ నగర్ జిల్లా గుండ్లుపేట తాలూకాలోని హంగల గ్రామానికి చెందిన ఆనంద్, శోభ దంపతులకు ఇటీవలే పండంటి మగ బిడ్డ జన్మించాడు. కొడుకు పుట్టినప్పటి నుంచి చాలా సంతోషంగా ఉన్న ఈ కుటుంబం.. బాలుడికి సంప్రదాయ బద్ధంగా చేయాల్సిన అన్ని కార్యక్రమాలను చేస్తూ వస్తోంది. అయితే చిన్నారికి ఆరు నెలలు నిండగా చెవులు కుట్టించాలని భావించారు. అయితే అంత చిన్న పిల్లాడికి చెవులు కుట్టిస్తే నొప్పి భరించలేక ఏడుస్తాడని ఆలోచించారు.

%కుటుంబం అంతా కలిసి ఆలోచించి మరీ చిన్నారికి చెవులు నొప్పెట్టకుండా ఉండాలంటే ఏం చేయాలో నిర్ణయించింది. ముఖ్యంగా బాలుడికి మత్తు సూది ఇప్పిస్తే.. నొప్పి తెలియదని అప్పుడు చెవులు కుట్టిస్తే బాబు ఏడవకుండా ఉంటాడని అనుకున్నారు. ఈక్రమంలోనే బొమ్మలాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడి వైద్యులకు ఈ విషయం చెప్పారు. తమ కుమారుడికి మత్తు సూది ఇస్తారో లేదో కనుక్కున్నారు. అయితే అక్కడే ఉన్న వైద్యుడు ఇస్తామని అందుకు 200 రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో కుటుంబం చెవులు కుట్టించుకోవడానికి ముహూర్తం కూడా పెట్టుకుంది.ఫిబ్రవరి 3వ తేదీ సోమవారం మంచి రోజు ఉండగా.. బాబును తీసుకుని ముందుగా బొమ్మలాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. ఈక్రమంలోనే డ్యూటీలో ఉన్న వైద్యుడు శిశువు చెవులకు మత్తు సూది ఇచ్చారు. ఐదు నిమిషాలు కాగానే బాలుడు పూర్తిగా స్పృహ కోల్పోయాడు. దీంతో భయపడిన కుటుంబ సభ్యులు అతడిని పెద్దాసుపత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే బాలుడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబ సభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి గొడవ చేశారు. మత్తు డోస్ ఎక్కువ అవడం వల్లే బాలుడు చనిపోయాడంటూ వైద్యులతో గొడవకు దిగారు.విషయం తెలుసుకున్న పోలీసులు.. హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. బాలుడికి పోస్టుమార్టం నిర్వహిస్తే.. అతడి మృతికి గల కారణం తెలుస్తుందని నిజంగానే వైద్యుడు తప్పు చేసి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు కాస్త వెనక్కి తగ్గారు. తమకు కచ్చితంగా న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకున్నారు. చెవులు కుట్టించే కార్యక్రమంలోనే బాలుడు చనిపోవడంతో.. కుటుంబ సభ్యులు సహా బంధువులు అంతా కన్నీరుమున్నీరు అవుతున్నారు.


## హెచ్ 1బీ వీసాదారులకు ట్రంప్ మరో బిగ్ షాక్.. ఇక ఆ విధానం రద్దు!




**వాషింగ్టన్-నవభూమి:** అమెరికా ఫస్ట్ నినాదంతో సంచలన నిర్ణయాలు తీసుకుంటున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. విదేశాలకు చెందిన వారి కంటే అమెరికా పౌరులకే అన్ని రకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే వీసా గడువు ముగిసినా అమెరికాలోనే ఉంటున్న వారిని.. తప్పుడు పత్రాలతో అక్రమ మార్గాల్లో చట్టవ్యతిరేకంగా అమెరికాలో అడుగుపెట్టిన వారిని.. స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని శరవేగంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే 205 మంది భారతీయులతో కూడిన విమానం బుధవారం.. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ల్యాండ్ అయింది. ఈ క్రమంలోనే తాజాగా మరో సంచలన నిర్ణయానికి ట్రంప్ సర్కార్ చర్యలు చేపడుతోంది. ఈ నిర్ణయం గనక అమల్లోకి వస్తే.. అమెరికాలోని హెచ్ 1 బీ, ఎల్ 1 వీసాలు కలిగిన ఉద్యోగులకు మరిన్ని కష్టాలు ఎదురుకానున్నాయి.ఎఇఇప్పటివరకు హెచ్ 1బీ, ఎల్1 వీసాలు కలిగి ఉన్న వారికి వాటి గడువు పూర్తి కాగానే ఆటోమేటిక్‌గా ఆ వీసాలు రెన్యువల్ అయ్యేవి. ఈ వీసా ఆటో రెన్యూవల్ విధానాన్ని గతంలో అధికారంలో ఉన్న జో బైడెన్ తీసుకువచ్చారు. అయితే బైడెన్ కల్పించిన ఈ వీసాలను ఆటోరెన్యూవల్ చేసుకోవడానికి ఉన్న అవకాశాన్ని రద్దు చేయాలని ఇద్దరు రిపబ్లికన్ సెనెటర్లు తాజాగా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలోనే అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న విదేశీయులకు మరో భారీ షాక్ ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్-1బీ, ఎల్-1 వర్క్ వీసాలకు ఆటోరెన్యూవల్ విధానం అనేది ఇమ్మిగ్రేషన్ అమలు చేసేందుకు అత్యంత ప్రమాదకరమైందని ఆ సెనెటర్లు పేర్కొన్నారు.

ఇహెచ్-1బీ, ఎల్-1 వీసాల గడువును పొడిగిస్తూ.. కొన్ని నెలల క్రితమే బైడెన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఆ వీసా గడువు కేవలం 180 రోజులు ఉండగా.. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు కొన్ని రోజుల ముందే.. డెమోక్రటిక్ ప్రభుత్వం దాన్ని 540 రోజులకు పెంచింది. దీన్ని గత నెల 13వ తేదీన ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఫైనల్ చేసింది. దీని వల్ల వలసదారులు, శరణార్థులు, గ్రీన్‌కార్డ్‌దారులు, హెచ్-1బీ, ఎల్-1 వీసా దారుల భాగస్వాములకు భారీగా లబ్ధి చేకూరింది. వర్క్ వీసాలపై పనిచేస్తున్న భారతీయులకూ ప్రయోజనం కలిగింది.అయితే బైడెన్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం.. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ విధానాలకు అడ్డుకట్టగా మారింది. ఈ ఆటో రెన్యూవల్ ఉంటే.. కఠిన వలసల నియంత్రణ, కఠిన వీసా రూల్స్‌కు అడ్డంకిగా మారుతుందని సెనెటర్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని సెనెటర్లు జాన్‌కెన్నడీ, రిక్ స్కాట్‌లు కాంగ్రెస్ రివ్యూ యాక్ట్ కింద గత నెల 31వ తేదీన తీర్మానం ప్రతిపాదించారు. వర్క్‌పర్మిట్స్‌ను ఆటోమేటిక్‌గా 540 రోజులు పొడిగించేలా నిబంధన తీసుకురావడం అనేది ఇమ్మిగ్రేషన్ చట్టాల అమలును దెబ్బతీస్తుందని.. అమెరికా భద్రత కూడా ప్రమాదంలో పడుతుందని సెనెటర్లు తెలిపారు.

## ఆమే నా సీరియస్ గర్ల్‌ఫ్రెండ్..: పాలాహర్డ్‌తో ప్రేమాయణంపై తొలిసారి నోరు విప్పిన బిల్ గేట్స్



**వాషింగ్టన్-నవభూమి:** అపర కుబేరుడు, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ గురించి దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 69 ఏళ్ల వయసులోనూ యువకులతో పోటీ పడుతూ మరీ అద్భుతమైన ఆలోచనలు చేస్తుంటారు. కొన్నేళ్ల క్రితమే భార్యకు విడాకులు ఇచ్చిన ఈయన ఓ మహిళతో ప్రేమలో కూడా పడ్డారు. గత కొంతకాలంగా ఇందుకు సంబంధించి అనేక వార్తలు వస్తున్నా ఆయన స్పందించలేదు. కానీ తొలిసారి ఆయన తన ప్రేయసి గురించి వెల్లడించారు. తాను నిజంగానే పాలా హర్డ్‌ను ప్రేమిస్తున్నానని.. తనే నా సీరియస్ గర్ల్‌ఫ్రెండ్ అంటూ చెప్పుకొచ్చారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.1955వ సంవత్సరంలో జన్మించిన బిల్ గేట్స్.. 1994లో మెలిందా ఫ్రెంచ్ గేట్స్‌ను పెళ్లి చేసుకున్నారు. అయితే చాలా ఏళ్ల పాటు హాయిగా కలిసి జీవించిన వీళ్లకు ముగ్గురు పిల్లలు కూడా పుట్టారు. అయితే 27 ఏళ్ల పాటు అన్యోన్యంగా సాగిన వీరి దాంపత్య జీవితానికి స్వస్తి పలుకుతూ 2021లో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి బిల్ గేట్స్ ఒంటరిగానే జీవిస్తున్నారు. అయితే కానీ ఆయన పాలా హర్డ్‌తో ప్రేమలో ఉన్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. వీరిద్దరూ కలిసి డేటింగ్ కూడా చేస్తున్నారంటూ పెద్ద ఎత్తున పుకార్లు వచ్చాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
గురువారం
06 । ఫిబ్రవరి । 2025



## న్యాక్ కేసులో జేఎన్‌యూ ప్రొఫెసర్ సస్పెండ్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉన్నత విద్యాసంస్థలకు ఇచ్చే 'నేషనల్ అసెసమెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్'(న్యాక్) గుర్తింపును అడ్డుపెట్టుకుని లంచాలు డిమాండ్ చేసిన కేసులో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. గుంటూరులో ఉన్న కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ విద్యాసంస్థకు అనుకూలంగా 'ఏం౦' నివేదిక ఇచ్చేందుకు న్యాక్ పరిశీలన బృందం.. ఏకంగా రూ.1.8 కోట్లను లంచంగా డిమాండ్ చేసినట్టు సీబీఐ అధికారులు తెలిపారు. అయితే.. పలు చర్చల తర్వాత రూ.28 లక్షలకు సెటిల్ అయిందని పేర్కొన్నారు. దీనిలో పరిశీలన బృందం చైర్మన్ రూ.10 లక్షలు, సభ్యులు ఒక్కొక్కరూ రూ.3 లక్షల చొప్పున తీసుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. అదేవిధంగా ల్యాప్‌టాపలు, బంగారం, సహా పరిశీలన బృందంలోని ఓ సభ్యుడి సతీమణి విదేశీ ప్రయాణానికి అయ్యే ఖర్చును కూడా లంచం కింద డిమాండ్ చేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనిలో ఒక్క రాజీవే.. రూ.1.3 కోట్లు డిమాండ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.



## పెట్టుబడుల గమ్యస్థానం తెలంగాణ

రానున్న రోజుల్లో హైదరాబాద్ మహానగరాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్, మధ్యలో రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు... ఇలా అనేక అంశాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రి దావోస్ వేదికగా ఆవిష్కరించారు. దావోస్ కేంద్రంగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు-2025లో గత ఏడాదితో పోలిస్తే తెలంగాణకు నాలుగు రెట్లు అధికంగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ సంస్థలు ఆసక్తి చూపించాయంటే ఆ ప్రయత్నంలో ప్రభుత్వం భారీ విజయం సాధించినట్టే. నాయకత్వ కృషి ఎంతో ఉంటే తప్ప పెట్టుబడులు రావు. నమ్మకం కలగందే పెట్టుబడులకు సంస్థలు కూడా ముందుకు రావు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' అన్న నినాదంతో అనుసరిస్తున్న విధానాలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు దోహదపడ్డాయి. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం దావోస్‌లో అడుగుపెట్టిన క్షణం నుంచి నిరంతరం శ్రమించింది. పరిమితమైన సమయంలో క్షణం తీరికలేకుండా ప్రపంచ దిగ్గజాలతో సంప్రదింపులు జరిపింది. ముఖ్యమంత్రి మాటల్లో చెప్పాలంటే 'తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించడం ద్వారా అధిక పెట్టుబడులను ఆకర్షించాం. గత ఏడాది మా ప్రభుత్వం రూపొందించిన అనుకూల విధానాలే దీనికి కారణం' అన్నారు. ఆయన ప్రయత్నాల ఫలితంగానే ఈ రోజు తెలంగాణ పేరు ప్రపంచ వేదికలపై వినిపిస్తోంది. ఏకంగా రూ.1,78,950 కోట్ల విలువ చేసే పెట్టుబడులు తెలంగాణకు రావడమంటే ఆషామాషీ కాదు. వీటితో దాదాపు 50 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుంది. దావోస్‌లో 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' అన్న అంశంపై వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహించిన సదస్సులోను, 'రీఇమేజింగ్ అర్బన్ మొబిలిటీ-ట్రెండ్స్, ఇన్నోవేషన్స్ అండ్ ఆపర్చునిటీస్-2030 అండ్ బియాండ్' అన్న అంశంపై భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), హెచ్ఎంసీ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులోను తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలు, లక్ష్యాలను ప్రపంచ దిగ్గజాల ముందు ముఖ్యమంత్రి స్పష్టంగా ఆవిష్కరించారు. కమ్యూనికేషన్ రంగంలో శరవేగంగా వచ్చిన మార్పులను అందిపుచ్చుకోవడంలో రాజీవ్‌గాంధీని, సరళీకృత ఆర్థిక విధానాలతో దేశానికి మార్గనిర్దేశకులైన పీవీ నరసింహారావును, అలాగే హైదరాబాద్‌లో ఐటీ రంగ విస్తరణకు చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యలు, హైదరాబాద్ ఒక మహానగరంగా విస్తరించడానికి విస్తృతమైన మౌలిక సదుపాయాలు కల్పించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి నేతలు చూపిన బాటను కొనసాగిస్తామని, దేశాన్ని ఐదు ట్రిలియన్ల ఎకానమీగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి సంకల్పానికి తెలంగాణ వంతుగా నిలబడతామనీ దావోస్‌లో రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు ఒకే వేదికపైన మాట్లాడిన సందర్భంలో కూడా రేవంత్‌రెడ్డి తన వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, అభివృద్ధి విషయంలో ప్రపంచంతో పోటీపడతామన్నారు. మూడు రాష్ట్రాల నుంచి గలగలా పారే కృష్ణా, గోదావరి నదులతో పోలుస్తూ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా మూడు రాష్ట్రాలూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన నాయకుడు రేవంత్‌రెడ్డి. ఆ మాటలు ప్రపంచ ఆర్థిక సదస్సు మోడరేటర్ సమీర్ శరణ్‌నే కాదు.. ఎంతో మంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలను కూడా ఆకర్షించాయి. మూడు రోజుల దావోస్ పర్యటనలో రేవంత్‌రెడ్డి ఇదే ఒరవడిని కొనసాగించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయన స్పీడ్ ఒక అసెట్. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం గత ఏడాది కాలంలో దూరదృష్టితో అమలు చేస్తున్న ప్రణాళికలు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగిస్తున్నాయి. కొత్తగా డేటా సెంటర్ల ఏర్పాటు లేదా విస్తరణకు ఆయా సంస్థలు చొరవ చూపడానికి అదీ ఒక కారణమే. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో శరవేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను అందరికన్నా ముందుగా అందిపుచ్చుకుని హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి సదస్సును నిర్వహించడమే కాకుండా, ప్రత్యేకంగా ఏఐ సిటీ నిర్మించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆ రంగంలో విస్తరించాలన్న సంస్థల్లో విశ్వాసాన్ని పెంచింది. హైదరాబాద్ కేంద్ర బిందువుగా డేటా సెంటర్లను నెలకొల్పడానికి ఐటీ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయంటే, అందుకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా నిలుస్తున్న తీరు ఆయా సంస్థలకు నమ్మకం కలిగిస్తున్నది. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీల మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలను అందిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పెరగడం, కాలుష్య కారక వాహనాలను తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎంతగా కట్టుబడి ఉందో అర్థమవుతుంది. మూసీ ప్రక్షాళన కూడా హైదరాబాద్ నగర భవిష్యత్తుకు ఒక బృహత్తరమైన ప్రణాళిక. కొందరు కావాలని కూల్చివేతలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేసినప్పటికీ మరో వంద సంవత్సరాల పాటు హైదరాబాద్ కాలుష్య రహిత, పర్యావరణ హితమైన నగరంగా విలసిల్లాలని చేపట్టిందే మూసీ పునరుజ్జీవం. కాలుష్య కాసారంగా మారిన మూసీని ప్రక్షాళన చేసి, ఈ మహానగర నీటి అవసరాలను తీర్చడమే కాకుండా, నల్గొండ ప్రజల సాగునీరు వంటి అనేక విషయాలతో ముడిపడిన అంశాలను దావోస్ వేదికగా ముఖ్యమంత్రి వివరించారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ మహానగరాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతు న్నాం. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్, మధ్యలో రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు... ఇలా అన్ని విషయాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రి దావోస్ వేదికగా ఆవిష్కరించారు. %ప్రపంచ వేదికల్లో తెలంగాణ ఇమేజ్‌ని పెంచాలన్న ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో పెట్టుబడులను కొందరు హేళన చేస్తున్నారు. అయితే, రాష్ట్రానికి మంచి చేస్తున్నారా లేక రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తున్నారా అన్నది ప్రజలు గమనిస్తూ ఉంటారు. హైదరాబాద్‌లో ఉన్న కంపెనీతో దావోస్‌లో ఒప్పందమేంటని కొందరు వ్యంగ్య ధోరణులు ప్రదర్శిస్తున్నారు. వారి హయాంలోనూ అదే జరిగినా, మరిచిపోయి నిస్సిగ్గుగా తెరమీదకు వస్తుంటారు. నిజానికి హైదరాబాద్‌కు చెందిన ఒక కంపెనీ తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్‌లలోనూ విస్తరణకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసింది. ఆయా ప్రభుత్వాల నుంచి లభించే ప్రోత్సాహకాలు, అవకాశాలు, అపాయింట్‌మెంట్స్... ఒకటేమిటి అనేకానేక అంశాలు ఇందులో ఇమిడి ఉంటాయి. వీటన్నింటికీ దావోస్ ఒక వేదికగా నిలుస్తుంది. తమిళనాడులో ఆ రాష్ట్రానికి సంబంధించిన ఏదైనా ఒక సమస్య తెరమీదకొస్తే ఆ రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ ఒకే వేదికపైకి వస్తాయి.

# చిన్ననాటి బీజాలే ఫలాలనిస్తాయి



నియమబద్ధంగా చదవడం, నియమబద్ధంగా పనిచేయడం, నియమబద్ధంగా జీవితాన్ని గడపడం, ఇవన్నీ క్రమశిక్షణకు గొప్ప తార్కాణాలు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే, క్రమశిక్షణ అంటే సక్రమమైన ప్రవర్తనను కలిగి ఉండటమే! వాస్తవానికి క్రమశిక్షణ అందరికీ అవసరమే. ముఖ్యంగా బాల్యం నుంచే క్రమశిక్షణా విలువలను కలిగి ఉండేలా చూడాలి. ఎందుకంటే, చిన్నప్పుడు క్రమశిక్షణ అలవడటం చాలా సులువు. ఇక అదే దారిలో పయనిస్తారు. బాల్యం నుంచే క్రమశిక్షణతో జీవితాన్ని గడిపిన వారు ఉన్నత శిఖరాలను అధిరోహించారు. కొందరు చరిత్ర సృష్టిస్తే, మరికొందరు చరిత్రను తిరగరాశారు. దీనికంతటికి వారంతా నియమబద్ధ జీవితాలను క్రమశిక్షణతో నిర్వహించడమే ఏకైక కారణం. చిన్ననాటి నుండే క్రమశిక్షణ విలువలు అలవరితే వారి భావి జీవితాలు బాగుపడతాయి. చిన్నప్రాయంలోనే ఆత్మవిశ్వాసం, కార్య సాధన, పరోపకారం, స్వయం పోషకత్వం, నిగ్రహం, త్యాగం, జీవ కారుణ్యం, సమాజ సేవ లాంటి సుగుణాలు చిన్నారుల్లో పెంపొందిస్తూ, ఒకసారి వీటికి బీజం పడిందంటే ఇక తిరిగే ఉండదు. అందుకే చిన్ననాటి నుండే పిల్లలలో క్రమశిక్షణ విలువలు పెంపొందించే కృషి నిరంతరం కొనసాగాలి. దీనికై మొదట తల్లిదండ్రులే బాధ్యత వహించాలి. మరీ ముఖ్యంగా తల్లే మరింత చొరవ చూపాలి. ఎందుకంటే తల్లే మొదటి గురువు. తదుపరి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల్లో మొదటగా క్రమశిక్షణ విలువలను పెంపొందించాలి. పెద్దలను గౌరవించడం, తల్లిదండ్రుల పట్ల పూజ్య భావం, గురువులను గౌరవించడం, ఉన్నది ఉన్నట్లుగా చెబుతూ సత్యాన్ని పలకడం. మంచి అలవాట్లను వివరిస్తూ ఆచరించేలా చేయాలి. చిన్ననాట నాటిన బీజాలే మహావృక్షాలై ఫలాలను ఇస్తాయి. మంచి బీజాలు అయితే మంచి



ఫలాలు, చెడు బీజాలు అయితే చెడు ఫలాలు ఇది సర్వసాధారణమే. అందుకే బాలురు నడవవలసిన త్రోవను విధిగా వారికి నేర్పాలి, చూపాలి. అదే త్రోవలో నడిచేలా కృషి చేయాలి. దీంతో ఖచ్చితంగా ప్రయోజకులౌతారు. చిన్నారుల్లో క్రమశిక్షణ విలువలను పెంపొందించాలంటే మొదట తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలి. క్రమశిక్షణ విలువలను వారు కలిగి ఉంటే కచ్చితంగా బాగుపడతారు. ఇందులో సందేహాలకు తావే లేదు. దీనికి విరుద్ధంగా ఎవరు పట్టించుకోకుండా మంచి చెడుల గురించి చెప్పకుండా వారి పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే, చదువులలో వెనుక పడుతూ సోమరిపోతులుగా, జులాయిలుగా, రౌడీలుగా, బాధ్యతారాహిత్యంగా తయారయ్యే పరిస్థితి దాపురిస్తుంది. దాంతో సమాజానికి కడుభారంగా మారుతూ, అనేక దుశ్చర్యలకు పాల్పడుతుంటారు. ఇలాంటివన్నీ మనం గమనిస్తూనే ఉన్నాం కదా.!

దీనికైనా జీవితంలో ఎదురైన ఒక అనుభవం. సుమారు 12 ఏళ్ల క్రితం ఒక ప్రభుత్వ సర్వేకి వెళ్ళినప్పుడు ఒక ఇంటికి వెళ్లి, అట్టి కుటుంబానికి చెందిన పిల్లోడిని మీ అమ్మానాన్న లు ఉన్నారా? అని అడిగితే, సదురు పిల్లోడు వారితో నీకేం పని అంటూ నిర్లక్ష్యంగా జవాబు ఇచ్చాడు. ఇలాగే మరో ఇంటికి వెళ్లి అదే ప్రశ్న అడిగితే, ఆ కుటుంబం యొక్క పిల్లోడు రండి కూర్చోండి సార్, వారిని పిలుస్తానంటూ మర్యాదగా ప్రవర్తించాడు. ఈ రెండు గృహాల వ్యత్యాసాలను ఒకసారి గమనించండి. గతేడాది యాదృచ్ఛికంగా ఆ రెండు గృహాల వివరాలను సేకరిస్తే, మొదటి గృహపు అడ్రస్సు లేదు. రెండో గృహంలోని పిల్లలంతా చక్కగా ఉన్నత చదువులను అభ్యసిస్తున్నట్లు తెలుసుకున్నాను. ఇది కేవలం క్రమశిక్షణ విలువలను పాటించడం వల్లనే సాధ్యమవుతుందని స్పష్టం అవుతుంది. అందుకే మొదట చిన్నారుల్లో క్రమశిక్షణ విలువలను పెంపొందించేలా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు ఉమ్మడి కృషి జరపాలి. క్రమశిక్షణతో విలువలు పెరుగుతుంది. ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. వ్యక్తి కావచ్చు, వ్యవస్థ కావచ్చు, ఏదైనా సరే! రాణించాలంటే విధిగా క్రమశిక్షణ చోటు చేసుకోవాల్సిందే! దండన ముఖ్యం కాదు. వాస్తవాలను వివరిస్తూ, విశ్లేషిస్తూ, ప్రవర్తనలో మార్పు తెచ్చేలా కృషి చేయాలి. ప్రవర్తనలో మార్పు వస్తే ఇక పరివర్తనే! ఇదే అభివృద్ధికి సూచి. ఇదంతా చిన్నప్రాయంలోనే జరగాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలి. పిల్లల మానసిక వికాసానికి, జ్ఞానాభివృద్ధికై సాధ్యమయ్యే రీతుల్లో సకల చర్యలను తీసుకోవాలి. విష సంస్కృతికి దారి తీసే టీవీ, సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచాలి. అవి స్లో పాయిజన్ గా మారుతూ హింస, ద్వేషం, అసూయ, జవాబుదారీతనం లేమి, నిర్లక్ష్యం, విచ్చలవిడి బ్రతుకులకు దారితీస్తాయి. సెల్ఫోన్ ప్రభావంతో చదువులో పూర్తిగా వెనుకబడిన వారు అనేకులు. పెడద్రోవ పడేవారు ఉన్నారు తస్మాత్ జాగ్రత్త! మంచి అలవాట్లు, మంచి ఆలోచనలు, మంచి పనులు ఇలాంటి మంచి పైనే దృష్టి సారించేలా చేయాలి. దీనికై నాకు గుర్తుకు వచ్చిన ఒక యదార్థ సంఘటన (ఎక్కడో చదివిన గుర్తు ). ఒక కరుడుగట్టిన నేరస్తునికి ఉరిశిక్షను అమలు చేసే క్రమంలో నీ చివరి కోరిక ఏంటని అడుగుతారు. వాడు తన తల్లిని చూడాలంటాడు. అబ్బో తల్లి పై ప్రేమ అంటూ వెంటనే అతని తల్లిని పిలుస్తారు. తల్లిని చూసిన వెంటనే తల్లి వద్దకు పరిగెత్తి మీద పడి చెవిని కొరికేస్తాడు. ఈ పరిస్థితిని గమనించిన పోలీసులు వెంటనే వాడిని విదిలించి వాడిని దూరం చేస్తూ ఎందుకు ఇలా చేశావురా అని ప్రశ్నిస్తూ రెండు తగిలిస్తే వాడు వెక్కివెక్కి ఏడుస్తూ, సార్ నేను చిన్నతనంలో పక్కింటి స్టీల్ సామాను దొంగలిస్తే మా అమ్మ ఏమి అనలేదు. ఆ పని తప్పని చెప్పలేదు. అది తప్పని చెప్పకుండా నన్ను వదిలేసింది. అందుకే నాకు ఈ దుర్గతి అంటూ విలపిస్తాడు. ఆనాడే దొంగతనం చేయడం పాపం, తప్పని చెబితే నేను చేసే వాడిని కాదు. ఇలా తయారయ్యే వాడిని కాదంటూ ఏడుస్తాడు. ఇది యదార్థ సంఘటన. అవును ఖచ్చితంగా చిన్ననాడే మంచి బుద్ధులు మంచి అలవాట్లు నేర్పాలి. ఈ విషయంలో తల్లితండ్రులు మరీ ముఖ్యంగా తల్లే పూర్తి బాధ్యత వహించాలి. తదుపరి పాఠశాలలో సైతం అందుకు కృషి జరగాలి. క్రమశిక్షణ బలవంతంగా రుద్దినట్లుగా కాకుండా, ఆత్మగౌరవానికి, ఆత్మ శక్తికి సంబంధించిన జీవిత ధ్యేయంగా ఉండేలా అలవర్చుకునేలా చేయాలి. ఇక వాళ్ళ భవిష్యత్తు వాళ్లపైనే ఆధారపడుతూ అభివృద్ధి బాటలో పయనిస్తారు. మరోసారి మనవి చేస్తున్నా. ఈ విషయంలో తల్లితండ్రులు, పెద్దలు మరియు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.

**డాక్టర్ యం. ప్రభుదయాల్**
**మాజీ సెనేట్ మెంబర్ - కాకతీయ యూనివర్సిటీ,**
**జీవిత సభ్యుడు - ఐఏటిఈ**
**మండల విద్యాశాఖ అధికారి - కొత్తగూడెం**

# యూజీసీ సంస్కరణల మంచీచెడూ!



విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల యూజీ, పీజీ కోర్సులకు సంబంధించి 'కనీస బోధనా ప్రమాణాల' ముసాయిదా నిబంధనలు %-%2024ను తీసుకువచ్చింది. విద్యార్థులకు విద్యా సంబంధమైన విషయాల పట్ల మరింత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కల్పించడం, నిబంధనలను సరళతరం చేయడం, ఏకరీతిగల విద్యా ప్రమాణాలు తీసుకురావడం, దేశీయ ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలతో అనుసంధానం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో ఈ నిబంధనలు రూపొందించారు. భారతదేశంలోని అన్ని రాష్ట్ర, కేంద్ర, ప్రైవేట్, డీమ్డ్ ఉన్నత విద్యా సంస్థలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. దేశీయ ఉన్నత విద్యా సంస్థలు ఏ మేరకు ఈ సంస్కరణలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయో, వాటివల్ల ఒనగూరే ప్రయోజనాలు, సవాళ్ళ ఏమిటో ఇప్పుడు పరిశీలించాల్సి ఉంది. %సమర్థత గల విద్యా సంస్థల కోసం ప్రతిపాదించిన 'ద్వివార్షిక ప్రవేశాలు', విద్యార్థులకు సంవత్సరానికి రెండుసార్లు విద్యాసంస్థలలో ప్రవేశం పొందే అవకాశాన్ని కల్పిస్తాయి. విద్యాసంస్థలలో పరీక్షల ఆలస్యం వలన గాని, వ్యక్తిగత, మరే ఇతర కారణాల వలన గాని ఏ విద్యార్థి అయినా విద్యా సంవత్సర ప్రారంభంలో ప్రవేశం పొందలేకపోతే అలాంటి వారికి ఈ ప్రతిపాదన ఉపయోగపడుతుంది. దేశీయ ఉన్నత విద్యాసంస్థల లోకి విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి, తద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని సంపాదించడానికి ఈ చర్య ఉపయోగపడడమే గాక దేశీయ ఉన్నత విద్యా సంస్థలు మెరుగైన గ్లోబల్ ర్యాంకులు సాధించడంలో తోడ్పడుతుంది. అయితే ఉన్నత విద్యా సంస్థలు అందిస్తున్న ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు లేక సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితులలో ఈ విధానం ఏ విధంగానూ ఉపయోగం కాదు అనే విమర్శ కూడా ఉంది. ముఖ్యంగా అధ్యాపకుల పైన మరింత భారం పడే అవకాశం ఉంది. యూజీసీ ప్రతిపాదించిన 'వికేంద్రిత విద్యార్థి హాజరు విధానం' వల్ల ఉన్నత విద్యా సంస్థలు వారు అందించే ప్రోగ్రాముల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల హాజరు విధానాలు నిర్ణయించుకునే స్వావలంబనను పొందుతాయి. ఈ విధానం వ్యక్తిగత హాజరు కంటే అభ్యాస ఫలితాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచడంలో దోహదపడుతుంది. ఈ ప్రతిపాదన వినూత్నమైన బోధన విధానాలకు వెసులుబాటు కల్పిస్తుంది. అంతేగాక, ఆన్‌లైన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ వంటి ప్రత్యామ్నాయ అభ్యాస పద్ధతులకు పెద్దపీట వేస్తుంది. అయితే, ఈ విధానం వల్ల విద్యా సంస్థల హాజరు విధానాల మధ్య సారూప్యత కొరవడి, విద్యార్థులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు గందరగోళానికి గురయ్యే అవకాశమూ ఉంది. విద్యాసంస్థలు హాజరు విధానాలు అతిసులభతరంగానో లేదా బాగా కఠినంగానో రూపొందించి ఆ విధంగా విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతీసే అవకాశం ఉంది. హాజరుకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థుల అభ్యాసం, క్రమశిక్షణ వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

యూజీసీ ప్రతిపాదిత 'బహుళ ప్రవేశ, నిష్క్రమణ విధానం' విద్యార్థులకు నిర్దిష్ట దశల వద్ద (సర్టిఫికేట్, డిప్లొమా, డిగ్రీ) ఒక ప్రోగ్రామ్ నుంచి నిష్క్రమించే అవకాశాన్ని కల్పించడమే గాక, వారి వ్యక్తిగత, ఆర్థిక, లేదా వృత్తిపరమైన అవసరాలను పూర్తి చేసుకున్న తరువాత కాలంలో తిరిగి ఆయా ప్రోగ్రాముల్లో ప్రవేశించేందుకు కూడా వీలు కల్పిస్తుంది. ఈ విధానం నిరంతర విద్యను ప్రోత్సహిస్తుంది. ఇది ముఖ్యంగా కార్మిక, పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనకరం. అయితే క్రెడిట్ బదిలీల నిర్వహణ, వివరమైన విద్యార్థి సంబంధిత రికార్డులను నిర్వహించడం, పాఠ్యాంశాలు ఏకరీతిని కొనసాగించడం వంటి అంశాలు పాలనా భారాన్ని పెంచుతాయి. గ్యాప్ తరువాత విద్యార్థులను తిరిగి సంఘటితం చేయడం కష్టం కావచ్చు. దీనికి సరిపోయే సరిసమాన కోర్సులు, మరీముఖ్యంగా నిష్ణాతులైన అధ్యాపకులను సమకూర్చుకోవడం తలకు మించిన భారం కాగలదు. 'భిన్న వ్యవధులు గల డిగ్రీ, పీజీ ప్రోగ్రాములు' ప్రవేశపెట్టాలన్న యూజీసీ ప్రతిపాదనను ఓ ప్రగతిశీల చర్యగా చెప్పవచ్చును. మూడు నుంచి నాలుగేళ్ళ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు, ఒకటి నుంచి రెండేళ్ళ పీజీ ప్రోగ్రాములను అందించడం ద్వారా, విద్యార్థుల విభిన్న అకడమిక్, ప్రొఫెషనల్, వ్యక్తిగత లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో, విద్యార్థుల విదేశీ కలలను సాకారం చేయడంలో ఉపయోగపడతాయి. అంతేగాక, ఒక సంవత్సరపు పీజీ ప్రోగ్రాములు త్వరగా ఉద్యోగం కావాలనుకునే వారికి ఉపయుక్తంగా ఉంటాయి. ఈ విధానం విద్యార్థులు స్పెషలైజేషన్ ఎంచుకోవడంలో, బహుళశాస్త్ర విద్యాభ్యాసం చేయడంలో, పరిశోధనా అవకాశాలను అందిపుచ్చుకోవడంలో సహాయపడతాయి. అంతేగాక వృత్తి నిపుణులు, పార్ట్ టైం విద్యార్థుల వైవిధ్యమైన అవసరాలు తీర్చడంలో ఈ విధానం ఉపయోగపడుతుంది. అయితే, ఈ భిన్న వ్యవధులు గల డిగ్రీల ఉపయుక్తత ఎంత అన్నదానిపై పలు సందేహాలు ఉన్నాయి. తక్కువ వ్యవధి ప్రోగ్రాములు తక్కువ కఠినంగా కనిపించవచ్చు, ప్రత్యేకంగా ఆర్థిక లేదా వ్యక్తిగత కారణాల వల్ల వాటిని ఎంచుకున్న విద్యార్థులకు నష్టాన్ని కలిగించవచ్చు. భిన్న వ్యవధులు గల డిగ్రీ, పీజీ ప్రోగ్రాములు ప్రారంభించడానికి ముందు తగిన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాల్సి ఉంటుంది. సిలబస్ తయారు చేయడంతో పాటు, క్రెడిట్స్ వ్యవస్థను రూపొందించడం, అధ్యాపకుల పనిభారం సర్దుబాటు చేయడం జరగాలి. ఏ విద్యార్థి ఐనా 'ఏక కాలంలో రెండు యూజీ లేదా పీజీ డిగ్రీలు' చదివే సదవకాశాన్ని యూజీసీ ప్రతిపాదించింది. ఈ విధానం బహుళ శాస్త్రాలు, నైపుణ్యాలను కలుపుకుంటూ, విద్యార్థుల జ్ఞానంతోపాటు ఉపాధి అవకాశాలను పెంచుతుంది. గ్రామీణ, దూర ప్రాంతాల విద్యార్థులకు, పని చేసుకుంటూ చదువుకునే వారికి ఇది అత్యంత ఉపయోగకరం. అయితే, రెండు డిగ్రీలు ఏక కాలంలో చేయడం వల్ల విద్యార్థి ఏ డిగ్రీలోనూ సమగ్రమైన విజ్ఞానాన్ని, కావలసిన నైపుణ్యాన్ని సంపాదించడం సాధ్యంకాక పోవచ్చును. విద్యాసంస్థల నిర్వాహకులకు ఈ విధానం అమలు పెను సవాలుగా మారే ప్రమాదం ఉంది. ఒక ప్రోగ్రామ్ ప్రధాన సబ్జెక్టులో 50శాతం క్రెడిట్లను సంపాదించడం విద్యార్థులకు తప్పనిసరి చేస్తూ, మిగిలిన క్రెడిట్లను నైపుణ్య కోర్సులు, అప్రెంటిషిప్, శిక్షణ, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడానికి అనుమతించే ఈ యూజీసీ ప్రతిపాదన సరళమైన విద్యా లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ప్రతిపాదన, విభాగ నైపుణ్యంతోపాటు అంతర శాఖా విద్యనూ సమతుల్యం చేస్తూ, విద్యార్థులకు సమగ్రమైన జ్ఞానంతో పాటు, విస్తృత నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు వీలు కల్పిస్తుంది. అయితే, ప్రధాన విభాగంలో క్రెడిట్లను 50 శాతానికి పరిమితం చేయడం, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి వృత్తి రంగాల్లో నైపుణ్యతను తగ్గించే అవకాశం ఉంది. ఇటువంటి సరళమైన విధానాన్ని అమలుచేయడం కోసం మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల శిక్షణ, పరిశ్రమ సహకారంలో గణనీయమైన పెట్టుబడులు అవసరం. విద్యా సంస్థల మధ్య ఏకరీతిన నాణ్యత, ప్రాముఖ్యతను నిర్ధారించడం, క్రెడిట్ బదిలీలను నిర్వహణ, పాఠ్య ప్రణాళిక అనుసంధానం పెనుసవాళ్లుగా మారతాయి. యూజీసీ ప్రతిపాదించిన ఈ ప్రగతిశీల సంస్కరణలు నిస్తేజంగా ఉన్న దేశీయ ఉన్నత విద్యా రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాయనడంలో సందేహం లేదు. అయితే ఉన్నత విద్యలో మౌలిక వసతులను అభివృద్ధి చేయకుండా, అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులను నియమించకుండా, టెక్నాలజీ వినియోగాన్ని పెంచకుండా, పరిశ్రమకు కావలసిన అంతర్జాతీయ ప్రమాణాల కరికులమ్‌ను అభివృద్ధి చేయకుండా, నూతన ఆవిష్కరణలకు దిశానిర్దేశం లేకుండా, ఇటువంటి సంస్కరణలు ఎన్ని తీసుకువచ్చినా తర్వాత సవాళ్ళను అధిగమించడం కష్టమవుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## జయ ఏకాదశి రోజు ఇలా చేయండి.. మహావిష్ణువు, లక్ష్మీదేవి అనుగ్రహం మీకే!

భక్తి



మాఘ మాసంలో శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశిని జయ ఏకాదశి అంటారు. ఈ రోజున శ్రీ మహావిష్ణువును పూజించడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. జయ ఏకాదశి వ్రతం చేయడం వల్ల వ్యక్తిలోని పాపాలు తొలగిపోయి మోక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఏకాదశిని భీష్మ ఏకాదశి అని కూడా అంటారు. జయ ఏకాదశి ఆచరణ జయ ఏకాదశి రోజున ఉపవాసం ఉండటం చాలా ముఖ్యమైనది. ఉపవాసం అంటే ఆహారం తీసుకోకుండా కేవలం నీరు మాత్రమే తీసుకోవడం. అయితే, కొంతమంది ఫలాలు , పాలు కూడా తీసుకుంటారు. ఈ రోజున విష్ణువును పూజించాలి , విష్ణు సహస్రనామం వంటి స్తోత్రాలు పఠించాలి. రాత్రి జాగరణ చేసి భజనలు, కీర్తనలు చేయడం కూడా శుభప్రదంగా భావిస్తారు. జయ ఏకాదశి 2025 ఫిబ్రవరి 8న శనివారం జరగనుంది. ఈ ఏకాదశి మాఘ మాసం, శుక్ల పక్ష ఏకాదశికి చెందుతుంది. ఏకాదశి తిథి ప్రారంభం: ఫిబ్రవరి 7, 2025, రాత్రి 09:26 - ఏకాదశి తిథి ముగింపు: ఫిబ్రవరి 8, 2025, రాత్రి 08:15 - పారణ సమయం: ఫిబ్రవరి 9, 2025, ఉదయం 07:04 - నుండి 09:17 - మధ్య జయ ఏకాదశి మహత్యం ఈ ఏకాదశిని ఆచరించడం వలన పాపముల నుండి విముక్తి లభించడంతో పాటు వైకుంఠ ప్రవేశం సాధ్యమవుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున విష్ణువు భక్తిగా ఉపవాసం చేయడం అత్యంత ఫలప్రదమని చెబుతారు. విష్ణువును ప్రసన్నం చేసుకునే వారికి ఎల్లప్పుడూ లక్ష్మీదేవి అనుగ్రహం ఉంటుందని నమ్ముతారు.. జయ ఏకాదశి పురాణం పూర్వకాలంలో, ఉత్తరావతి అనే నగరంలో దేవదత్తుడు అనే రాజు ఉండేవాడు. ఆయనకు జయ మరియు విజయ అనే ఇద్దరు కుమార్తెలు ఉండేవారు. జయ చాలా అందంగా ఉండేది మరియు ఆమెను లక్ష్మీదేవి గా భావించేవారు. ఒకరోజు, జయ తన స్నేహితులతో కలిసి నది ఒడ్డున విహరిస్తుండగా, అక్కడకు వచ్చిన గంధర్వుడు ఆమెను చూసి మోహితుడయ్యాడు. అతను ఆమెను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు . ఆమెను తనతో తీసుకువెళ్లడానికి ప్రయత్నించాడు. జయ అతన్ని ప్రతిఘటించింది. ఆమె తండ్రికి విషయం చెప్పింది. రాజు గంధర్వుడితో యుద్ధం చేశాడు . అతన్ని ఓడించాడు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 | హైదరాబాద్
గురువారం
06 । ఫిబ్రవరి । 2025

## నకిలీ కుంకుమ పువ్వుని గుర్తించండి ఇలా..!



ఒక చిన్న గ్లాసు నీటిలో కుంకుమపువ్వు రేకులు మూడింటిని వేసి కలపాలి. నీళ్ల వెంటనే రంగు మారితే అవి నకిలీవని గుర్తించాలి. నిజమైన కుంకుమపువ్వు రేకులు రంగు విడవడానికి చాలా సమయం తీసుకుంటాయి. ఇవి పాలు, నీళ్ల సహా ఏ ద్రవంలోనూ కరగవు.

కుంకుమ పువ్వు రేకులు ఎరుపు రంగులో ఉంటాయి. కానీ వాటిని ఆహార పదార్థాల్లో కలిపినప్పుడు లేత పసుపు రంగుని విడుస్తాయి. రేకులు వేసిన నీళ్ల లేదా పాలు ఎరుపు రంగులోకి మారినా రేకులు రంగు వెలిసి కనిపించినా అవి నకిలీవని తెలుసుకోవచ్చు.

రెండు రేకులను నోట్లో వేసుకుని నమిలితే నోరంతా చేదుగా అవుతుంది. అలా కాకుండా నాలుకమీద తీపిదనం తెలిస్తే అవి నకిలీవని గుర్తించాలి.

రేకులకు నిప్పు పెడితే అవి మండని పక్షంలో శుద్ధమైన కుంకుమ పువ్వుగా గుర్తించాలి. నకిలీ రేకులు వెంటనే మండిపోతాయి.

# భలే బగ్రు





మొక్కలు, మట్టి, సేంద్రియ పదార్థాల నుంచి సేకరించిన రంగులతో భిన్నమైన డిజైన్లను ముద్రించుకున్న బగ్రు కుర్తీలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. మెత్తగా, సౌకర్యంగా ఉండే ఈ కుర్తీలను లెగింగ్, జీన్స్‌తో కలిపి ధరించవచ్చు. ఎక్కువగా ముదురు రంగులను కలిగి ఉండే బగ్రు కుర్తీలు అన్ని వయసుల మహిళలకూ అనువుగా ఉంటాయి. టెర్రకోటా, ఆక్సిడైజ్‌డ్ జ్యువెలరీ ఈ రకం దుస్తులకు చాలా బాగా నప్పుతుంది. ఒంటె తోలుతో తయారయ్యే రాజస్థానీ జూతీలు ఇలాంటి కుర్తీలకు బ్రహ్మాండంగా మ్యాచ్ అవుతాయి. ప్రింటెడ్ కాటన్‌ను ఇష్టపడేవాళ్లు, ఉద్యోగస్తులు వెలసిపోని, మన్నికైన, సౌకర్యవంతమైన బగ్రు కుర్తీలను నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.

బగ్రు ప్రింట్ ఒక రకానికి చెందినహ్యాండ్ బ్లాక్ ప్రింట్. వందేళ్ల క్రితం చిప్ప అనే కులానికి చెందినవాళ్లు, సహజ రంగులను ఉపయోగించి ఈ ప్రింట్లను ముద్రించడం మొదలుపెట్టారు. రాజస్థాన్‌లోని బగ్రు అనే ప్రాంతానికి పరిమితమైన ఈ బగ్రు ప్రింట్లు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి. వీటిని ముద్రించడం కోసం, డిజైన్లతో కూడిన చెక్క బ్లాకులను ఉపయోగించడం విశేషం. ప్రింట్లు వినూత్నంగా ఉండడం, వాటి కోసం సహజ రంగులను ఉపయోగించడం, కాటన్ వస్త్రాల మీదే ప్రింట్లను ముద్రించడం వల్ల, ప్రత్యేకించి వేసవిలో బగ్రు ప్రింట్ల దుస్తులకు ఆదరణ పెరుగుతూ ఉంటుంది.

**ఇలా గుర్తించాలి**

బగ్రు వస్త్రాలు పక్షులు, పూలు, వాటిని కలుపుతూ అల్లుకునే లతల డిజైన్లతో రూపొందుతూ ఉంటాయి. జామెట్రిక్ డిజైన్లలో కూడా ఈ వస్త్రాలు రూపొందుతూ ఉంటాయి. అయితే పెద్ద ప్రింట్లు ఉండేవే అసలైన బగ్రు అని గుర్తించాలి. అలాగే ప్రింట్ చుట్టూరా కొట్టొచ్చినట్టుండే నల్లని గీతగీసి ఉంటుంది.





# మధుమేహమా.. మహిళలూ జాగ్రత్త!

మధుమేహం (డయాబెటిక్) ఆడా మగా, పిల్లలు, పెద్దవారు అనే తేడాలేకుండా అందరికీ వస్తోంది. ఇది రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం ఎంతైనా మంచిది. వచ్చిన వారు తగ్గించుకోవటానికి అందుబాటులో ఉన్న మార్గాలను అన్వేషించాలి. ఏదైమైనా పురుషులతో పోలిస్తే మహిళలు ఈ వ్యాధి బారిన ఎక్కువగా పడుతున్నారు. నియంత్రణ విషయంలోనూ పురుషులతో పోల్చితే మహిళలే ఎక్కువగా కష్టపడాల్సివస్తుంది. నిరంతర పర్యవేక్షణ కూడా చేయాల్సివస్తోంది. ఎందుకంటే మహిళల్లో షుగర్ అనేది ఓ జీవనశైలి వ్యాధి మాత్రమే కాదు. దీని కారణంగా ఇతర ప్రమాదకరమైన వ్యాధులు కూడా వస్తుంటాయి. గుండె సంబంధిత ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. పురుషులతో పోలిస్తే షుగర్ కలిగిన మహిళలు 4 రెట్లు గుండె జబ్బులకు లోనయ్యే అవకాశం ఉంది. ఇవే కాకుండా కిడ్నీ వ్యాధులు, ఇతర మానసిక సమస్యలు కూడా మధుమేహం ఉన్న మహిళల్లో అధికంగా ఉంటాయనేది పలు అధ్యాయనాల్లో తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు ఈ వ్యాధి పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవటం ఉత్తమం.

**కారణాలేమంటే..**

రక్తంలో షుగర్ కంట్రోల్ లేకపోవటం వల్ల మహిళల్లో ఈస్ట్రోజెన్ హార్మోన్‌కు శరీరం స్పందించే తత్వం తగ్గిపోతుంది. స్త్రీలలో సెక్స్ పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది. ఇన్సులిన్ సెన్సివిటీ కూడా మహిళల్లోనే అధికంగా ఉంటుంది. శరీరంలో శక్తి సమతుల్యత, గ్లూకోజ్ మెటబోలిజం స్త్రీ, పురుషుల్లో విభిన్నంగా ఉంటుంది. అందువల్లనే చాలామంది మహిళలు రక్తంలో వచ్చే ఇబ్బందులే కాకుండా కొన్ని ప్రత్యేకమైన ఆరోగ్య సమస్యలను కూడా ఎదుర్కొంటారు. సాధారణంగా ఇలాంటి వారికి టైప్ 2 డయాబెటిస్ అధికంగా వస్తుంది. 40 ఏళ్లు పైబడిన వారు, అధిక బరువున్నవారు, కుటుంబంలో తల్లిదండ్రులు, లేదా తోబుట్టువులకు షుగర్ ఉన్న వారు, గర్భధారణ సమయంలో, అధికంగా కొలెస్ట్రాల్, పీసీఓఎస్‌తో బాధపడుతున్న వారు, శారీరకంగా చురుకైన జీవనశైలి లేని వారు ఈ వ్యాధి భారిన పడుతుంటారు.

**ఇన్ఫెక్షన్ల ముప్పు..**100 మందిలో 50 మంది మహిళలు తమ జీవిత కాలంలో ఎప్పుడో ఒకసారి వెజైనా, యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్లను ఎదుర్కోవాల్సివస్తోంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవటం, మూత్రాశయంలో మూత్రం పూర్తిగా ఖాళీ కాకపోవటం వల్ల అక్కడ బ్యాక్టీరియా అభివృద్ధి చెందే ప్రమాదం ఉంది. వెజైనా దగ్గర ఈస్ట్ ఇన్ఫెక్షన్ బారిన పడే ప్రమాదం ఉంది.

**పీసీఓడీ, పీసీఓఎస్‌తోనూ సమస్యలే..**

మహిళల్లో చాలామంది పీసీఓడీ, పీసీఓఎస్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 40 శాతం మందికి మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. బీపీ, గుండెజబ్బులు, బ్రెయిన్ హెమరేజ్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులకు పీసీఓడీతో సంబంధం ఉంది. ప్రపంచంలోనూ, మనదేశంలోనూ ఈ సమస్యలు తీవ్రంగానే ఉన్నాయి. ప్రతి నలుగురిలో ఒక అమ్మాయి ఈ సమస్యతో బాధపడుతున్నట్లుగా గణాంకాలు ఉన్నాయి. తొలినాళ్లలోనే దీనిని గుర్తించటం, తినే ఆహారంలో పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవటం, యోగా, స్విమ్మింగ్ వంటివి వ్యాయామాలు చేయటం, ఒత్తిడిని తగ్గించుకోవటం, బరువు పెరగకుండా చూసుకోవటం ద్వారా ఇలాంటి సమస్యలను నివారించుకోవచ్చు.

**రాకుండా ఉండాలంటే**

రక్తంలో చక్కెరస్థాయిలను అదుపులో ఉంచుకోవాలి.తగినంత నీటిని తాగాలి
కాటన్ లో దుస్తులు ధరించాలి
మూత్రాన్ని ఆపుకోకుండా జాగ్రత్తపడాలి

గర్భధారణ సమయంలో%


%రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు గర్భధారణ కూడా కష్టమే. ఒకవేళ వచ్చినా తొలి నెలల్లోనే గర్భస్రావం కావటం, పుట్టే పిల్లల్లో లోపాలు, ప్రి-మెచ్యూర్ డెలీవరీ, శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి సమయంలో డాక్టర్ పర్యవేక్షణలో జాగ్రత్తలు పాటించటం ముఖ్యం. సాధారణంగానే మెనోపాజ్‌లో వేడి ఆవిర్లు, మూడ్‌స్వింగ్స్, నిద్రలేమి, ఒత్తిడి, ఆందోళన వంటి ఎన్నో సమస్యలు మహిళలను వేధిస్తుంటాయి. మధుమేహం కారణంగా నెలసరి సమస్యలు, కంటిచూపు తగ్గిపోవటం, కిడ్నీ సమస్యలు వంటివి కూడా మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి.

ఇబ్బందులు ఇవీ

**మూత్ర సంబంధిత ఇబ్బందులు**

రుతుక్రమం దెబ్బతినటం.. పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) మధుమేహం లక్షణాలు ప్రతి ముగ్గురిలో ఒకరికి మధుమేహం ఉన్నా తెలియటం లేదు. మొదట్లో పెద్దగా లక్షణాలు కనిపించకపోవటమే దీనికి కారణం. సమస్య పెరిగే కొద్దీ కొన్ని హెచ్చరికలు పొడచూపుతుంటాయి.

అతిగా దాహం వేయటం.. నోరు ఎండిపోవటం



విపరీతంగా ఆకలి వేయటం
మూత్రం ఎక్కువగా రావటం
అసాధారణ బరువు పెరగటం లేదా తగ్గటం
రక్తంలో గ్లూకోజు పెరిగితే తలనొప్పి, చూపు మసకబారటం, నిస్సత్తువ
తీవ్రమైతే గాయాలు, పుండ్లు త్వరగా మానకపోవటం
తరచూ మూత్రకోశ ఇన్ఫెక్షన్లు గజ్జల్లో దురద పెట్టడం
జననాంగం పొడిబారిపోవటం
లైంగిక కోరికలు తగ్గిపోవటం

ఇవి పాటించటం మేలు

వ్యాయామం చేయటం ద్వారా బరువును అదుపులో ఉంచుకోవాలి.
తాజా పండ్లు, కాయగూరలు ఆహారంలో భాగం చేసుకోవాలి
విటమిన్లు, ఖనిజాలు వంటి పోషకాలుండే మొక్కల ఆధారిత ఆహారం మేలు
ఆహారం ఒకేసారి కాకుండా తక్కువమొత్తంలో ఎక్కువసార్లు తీసుకోవాలి
చక్కెరలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే పదార్థాలు కాకుండా సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఓట్‌మీల్, తృణధాన్యాలు తినాలి
మంచినీటిని అవసరమైంతస్థాయిలో తీసుకోవాలి.
శీతల పానీయాలను మానేయాలి
పీచు ఎక్కువగా ఉండే పండ్లు తీసుకోవాలి.

# పైథానీకి పూర్వ వైభవం



ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సవ్యసాచి ముఖర్జీ ఇటీవల నిర్వహించిన వేడుకల్లో... బరోడా రాణి రాధిక రాజే గైక్వాడ్ తళుక్కుమన్నారు. ఈ వేడుకల్లో ఆమె కట్టుకున్న నలుపు రంగు పైథానీ చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెడలో వేసుకున్న పొడవైన హారాల సెట్ చీర అందాన్ని ద్విగుణీకృతం చేసింది. దీనికి హుందాతనం తోడై రాజరికదర్పంతో వేడుకల్లో వెలిగిపోయారు రాధిక రాజే.

**ఏమిటీ చీర గొప్పదనం?**

రాధిక రాజే కట్టుకున్నది వందేళ్లనాటి కాటన్ పైథానీ నౌవరీ చీర. అంతేకాదు మహారాష్ట్ర రాజకుటుంబీకుల సంప్రదాయ వస్త్రం. తొమ్మిది గజాల ఈ చీర కొంగు, అంచులని స్వచ్ఛమైన బంగారంతో తయారు చేశారు. చీర మొత్తాన్ని నూలు దారాలు ఉపయోగించి మగ్గంపై నేశారు. మహారాష్ట్ర ఔరంగాబాద్‌లోని పైథానీ పట్టణంలోని చేనేత కళాకారులు వీటిని రూపొందిస్తారు. ఆ ప్రాంతం పేరుతోనే పైథానీ చీరలుగా ఇవి ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. వీటిల్లో పట్టు చీరలది ప్రత్యేక స్థానం. ఈ పైథానీ నేత కళ శతాబ్దాల నాటిది. నాణ్యమైన రంగురంగుల దారాలను బంగారు లేదా వెండి పోగులతో కలిపి చీరను నేస్తారు. ఏ రెండు పైథానీ చీరలు కూడా ఒకే రకంగా ఉండవు. వేటికవే వైవిధ్యంగా ఆకట్టుకొంటాయి. అందుకే ఇవి దేశంలోనే అత్యంత ఖరీదైన చీరలుగా పేరు పొందాయి.

**ఆమె ఖాతా... చీరల నిధి**

రాధిక రాజేకి భారతీయ వారసత్వ చీరలంటే ఎంతో ఇష్టం. ఆమె వద్ద చారిత్రక నేపథ్యంతో ముడిపడిన పురాతన కాలం చీరలు చాలా ఉన్నాయి. వాటి గురించి తెలుసుకోవాలంటే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిస్తే చాలు... అక్కడ అపురూపమైన చీరల నిధిని చూడవచ్చు. ఆమె ప్రత్యేకమైన చీర ధరించినప్పుడల్లా ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు షేర్ చేయడమే కాదు... ఆ చీర ప్రత్యేకత, ఎవరు బహూకరించారు తదితర అంశాలన్నీ వివరిస్తారు. సవ్యసాచి ముఖర్జీ ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఉత్సవంలో రాధిక పాల్గొన్నారు. ఆ ఫొటోలతోపాటు మరొక ఫొటో కూడా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇందులో ఆమె అందమైన గులాబీ రంగు చీరతోపాటు ఆకుపచ్చని జాకెట్ ?ధరించారు. ఈ సందర్భంగా తన మనసులోని భావాన్ని ఇలా రాసుకున్నారు... "ఇది తొమ్మిది గజాల జరీ కాటన్ పైథానీ చీర. ఈ అందమైన తొమ్మిది గజాల చీర మొత్తం జరీ పువ్వులతో నిండి ఉంది. చీరకు జతగా యాంటిక్ ఫ్రెంచ్ బ్రోకేడ్ బ్లౌజ్ వేసుకున్నా! ఈ చీర భారతదేశ వస్త్ర వారసత్వానికి ప్రతీక. ఇండోర్ మహారాణి సంయోగిత రాజే ఇలాంటి చీరలు కట్టుకునేవారు. ఈ చేనేత సంప్రదాయ కళ ఇకపై కూడా కొనసాగాలని కోరుకుంటున్నా! నాజూగ్గా ఉంటూ అందమైన పువ్వులు, జరీ మోటిఫ్‌లతో నిండిన టిష్యూ, షిఫాన్, కాటన్, చందేరీ సిల్క్ చీరలను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం నౌవరీ (తొమ్మిది గజాలు) చీరలను ఎవరూ కొనడం లేదు. వీటిని ఎక్కువగా అమ్మమ్మలు, బామ్మలు లేదంటే పనివాళ్లు, మత్స్యకారులు కట్టుకుంటున్నారు. వీటికి పూర్వ వైభవం తెచ్చేందుకే ఈ ప్రయత్నం."

**గతంలో కూడా...**

రాధిక రాజే ఈ నలుపు రంగు కాటన్ పైథానీ చీరని గతంలో కూడా ఓసారి ధరించారు. అప్పట్లో ఓ మ్యాగజైన్ కవర్ షూట్ నిమిత్తం ఆమె ఈ చీర కట్టుకుని దిగిన ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశారు. ఈ చీర గురించి చెబుతూ ఇది అత్యంత అరుదైన చీర అనీ, తనకు చాలా ప్రీతిపాత్రమైనదనీ, ఇలాంటి చీరలు ప్రస్తుతం లభ్యం కావట్లేదనీ వివరించారు.

## గోరింటాకుతో కురులు ఆరోగ్యంగా...



గోరింటాకును మెత్తగా రుబ్బి తలకు పట్టించాలి. అరగంటసేపు ఆరిన తరవాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే శిరోజాలకు పోషణ అంది చక్కగా పెరుగుతాయి. మాడు మీద దురద, చుండ్రు, కురుపులు లాంటి సమస్యలు రావు.

గుప్పెడు గోరింట ఆకులను ఒక కప్పు కొబ్బరి నూనెలో వేసి బాగా మరిగించి వడకట్టాలి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెని చేతి వేళ్లతో తీసుకుని మాడుకు పట్టేలా మర్దన చేయాలి. పలుచని వస్త్రాన్ని తలకు కట్టుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తల స్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే వెంట్రుకల కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం, నెరవడం లాంటి సమస్యలు తగ్గుతాయి. ఒక కప్పు గోరింటాకు పొడిలో రెండు చెంచాల మెంతి పొడి, ఒక చెంచా శీకాయ పొడి, ఒక చెంచా ఉసిరి పొడి వేసి అర కప్పు టీ డికాషన్‌తో ముద్దలా కలపాలి. దీనిని తల వెంట్రుకలకు, మాడుకు పట్టించాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేస్తే శిరోజాలు రాలడం తగ్గి నల్లగా ఒత్తుగా నిగారిస్తాయి.ఒక కప్పు గోరింటాకు పొడిలో రెండు చెంచాల కాఫీ పొడి, ఒక చెంచా మందార నూనె వేసి నీళ్లతో కలిపి తలకు పట్టిస్తే జుట్టు నెరవడం తగ్గుతుంది.గోరింట పొడిని గుడ్డు తెల్ల సొనతో కలిపి తలకు పట్టించి రెండు గంటల తరవాత శీకాయ పొడితో తలస్నానం చేస్తే తల వెంట్రుకలు నున్నగా మెత్తగా మెరుస్తాయి.ఒక కప్పు బ్లాక్ టీలో అర కప్పు గోరింట పొడిని కలిపి రాత్రంతా నాననివ్వాలి. ఉదయాన్నే ఈ మిశ్రమంలో కొద్దిగా పెరుగు కలిపి తలకు పట్టించి ఇరవై నిమిషాల తరవాత తలస్నానం చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.

## ఒడిదుడుకుల్లో స్టాక్ మార్కెట్లు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాల కారణంగా దేశీయ సూచీలు బుధవారం అనిశ్చితిలో కొనసాగుతున్నాయి. లాభనష్టాలతో దోబూచులాడుతున్నాయి. కొంతకాలంగా వరుసగా విక్రయాలు సాగిస్తూ వస్తున్న విదేశీ మదుపర్లు మంగళవారం గేర్ మార్చారు. 800 కోట్ల రూపాయలకు పైగా విలువైన షేర్లను కొనుగోలు చేశారు. బుధ, గురు వారాలలో ఆర్బీఐ ద్రవ్య పరపతి మీటింగ్ జరగనుంది. కీలక వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. మంగళవారం ముగింపు (78, 583)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం 120 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభనష్టాలతో దోబూచులాడుతోంది. ప్రస్తుతం ఉదయం 10:20 గంటల సమయంలో 158 పాయింట్ల లాభంతో 78, 437 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదులుతోంది. ప్రస్తుతం 1 పాయింట్ స్వల్ప లాభంతో 23, 740 వద్ద కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ మాత్రం స్పష్టమైన లాభాలతో ఉన్నాయి. సెన్సెక్స్‌లో ఐజీఎల్, ఎన్‌సీసీ, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఏంజెల్ వన్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఆసియన్ పెయింట్స్, నెస్లే, ఫియోనిక్స్ మిల్స్, బర్గర్ పెయింట్స్ షేర్లు భారీ నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 656 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 248 పాయింట్ల లాభంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ ప్రస్తుతానికి 87.14గా ఉంది.




## మరింత పెరిగిన బంగారం ధరలు.. బంగారం, వెండి ధరలు ఇవే..



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం, వెండి కొనాలనుకుంటున్నారా? బంగారం ధరలు రోజు రోజుకు పెరుగుతూ ఆల్‌టైమ్ గరిష్టానికి చేరుకుంటున్నాయి. ఇటీవల 80 వేల పైకి చేరిన బంగారం ధర ఆ తర్వాత కూడా స్థిరంగా పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఫిబ్రవరి 5న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 85, 210కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 78, 110కి చేరింది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 85, 360కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 78, 260కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 85, 210కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 78, 110కి చేరింది. వెండి ధరలు కిలోకి వంద రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 85, 210, రూ. 78, 110
విజయవాడలో రూ. 85, 210, రూ. 78, 110
ఢిల్లీలో రూ. 85, 360, రూ. 78, 260
ముంబైలో రూ. 85, 210, రూ. 78, 110
వడోదరలో రూ. 85, 260, రూ. 78, 160
కోల్‌కతాలో రూ. 85, 210, రూ. 78, 110
చెన్నైలో రూ. 85, 210, రూ. 78, 110
బెంగళూరులో రూ. 85, 210, రూ. 78, 110
కేరళలో రూ. 85, 210, రూ. 78, 110
పుణెలో రూ. 85, 210, రూ. 78, 110

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)

హైదరాబాద్‌లో రూ. 105, 900
విజయవాడలో రూ. 105, 900
ఢిల్లీలో రూ. 99, 400
చెన్నైలో రూ. 106, 900
కోల్‌కతాలో రూ. 98, 400
కేరళలో రూ. 105, 900
ముంబైలో రూ. 98, 400
బెంగళూరులో రూ. 98, 400
వడోదరలో రూ. 98, 400
అహ్మదాబాద్‌లో రూ. 98, 400

## స్వర్ణం.. సులభ రుణం!




**న్యూఢిల్లీ-నవభూమి:** గత ఏడాది నుంచి బంగారం ధర వేగంగా పెరుగుతూ వస్తోంది. సామాన్యులు కొనగలరా..? అనే స్థాయికి చేరుకుంది. దాంతో కొత్తగా బంగారం కొనుగోలు చేసే వారు కాస్త తగ్గినప్పటికీ.. ఉన్న నగలను తాకట్టు పెట్టే రుణాలు పొందే ట్రెండ్ మాత్రం ఊపందుకుంది. తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం. గత ఏడాది డిసెంబరు నాటికి బ్యాంకుల బంగారం రుణాల పోర్ట్‌ఫోలియో వార్షిక ప్రాతిపదికన 71.3 శాతం వృద్ధితో రూ.1.72 లక్షల కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాదిలో ఇదే సమయానికి పసిడి రుణ పోర్ట్‌ఫోలియో వృద్ధి కేవలం 17 శాతమే. గడిచిన కొన్ని సంవత్సరాల్లో బంగారం విలువ బాగా పెరగడంతో పాటు బ్యాంకులు తనఖా రహిత వ్యక్తిగత రుణాల మంజూరులో ఆచితూచి వ్యవహరిస్తుండటం ఇందుకు ప్రధానం కారణాలుగా తెలుస్తోంది. వ్యక్తిగత రుణం లభించే అవకాశం లేని వారికి బంగారం తనఖా రుణాలు మెరుగైన ప్రత్యామ్నయంగా మారాయని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. వ్యక్తిగత రుణంతో పోలిస్తే, గోల్డ్ లోన్స్‌పై వడ్డీ కూడా తక్కువగా ఉండటం మరో కారణమని వారు పేర్కొన్నారు.గత ఏడాది మార్చి-డిసెంబరు మధ్యలో బంగారం తనఖా రుణాల్లో 68 శాతం వృద్ధి నమోదైందని.. అదే కాలంలో బంగారం ధరలు 21 శాతం పెరిగాయని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అజిత్ వెలోనీ అన్నారు. 2023 నవంబరులో ఆర్‌బీఐ తనఖా రహిత రుణాలపై రిస్క్ వెయి టేజీని 125 శాతానికి పెంచింది. దాంతో బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు తాకట్టుపై ఇచ్చే బంగారం రుణాలపై దృష్టి సారించాయి. వ్యక్తిగత రుణాలను తగ్గించాయి. దాంతో గత ఏడాది డిసెంబరుతో ముగిసిన 9 నెలల్లో వ్యక్తిగత రుణాలు కేవలం 5-6 శాతం వృద్ధి చెందాయి. అంతక్రితం సంవత్సరంలో ఇదే కాలానికి పర్సనల్ లోన్స్‌లో 16.5 శాతం వృద్ధి నమోదైంది.గత డిసెంబరుతో ముగిసిన మూడు త్రైమాసికాల్లో తనఖా రహిత రుణాలకు చెందిన ఇతర విభాగాల్లోనూ కేవలం 9.7 శాతం వృద్ధి నమోదైంది. 2023లో ఇదే కాలానికి ఆ విభాగాల రుణ వృద్ధి 20.8 శాతంగా ఉంది. కాగా, రిటైల్ రుణాల పరిధిలోకి వచ్చే హౌసింగ్, వెహికిల్, క్రెడిట్ కార్డ్, పర్సనల్ లోన్స్ విభాగాలన్నింటి రుణ వృద్ధి కూడా 17.6 శాతం నుంచి 14.9 శాతానికి జారుకుంది.

# న్యాక్ కేసులో జేఎన్‌యూ ప్రొఫెసర్ సస్పెండ్





**న్యూఢిల్లీ-నవభూమి:** ఉన్నత విద్యాసంస్థలకు ఇచ్చే 'నేషనల్ అసెసమెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్'(న్యాక్) గుర్తింపును అడ్డుపెట్టుకుని లంచాలు డిమాండ్ చేసిన కేసులో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. గుంటూరులో ఉన్న కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ విద్యాసంస్థకు అనుకూలంగా 'ఏ++' నివేదిక ఇచ్చేందుకు న్యాక్ పరిశీలన బృందం.. ఏకంగా రూ.1.8 కోట్లను లంచంగా డిమాండ్ చేసినట్టు సీబీఐ అధికారులు తెలిపారు. అయితే a గిఫ్టిటీ ప్రధాన కార్యాలయమైన అర్థ భారత్ యొక్క COO, ICAI నుండి CA ఉమెన్ ఆఫ్ ది ఇయర్" అవార్డును గెలుచుకున్నారు.న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5,2025: కేంద్ర న్యాయ - న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఒక గొప్ప కార్యక్రమంలో అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ %IFSC LLP% యొక్క చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అశ్విని సావ్రికర్‌కు ఉమెన్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ప్రదానం చేశారు. దానికి మిస్టర్. రంజిత్ కుమార్ అగర్వాల్, ప్రెసిడెంట్, %ICAI%, చరణ్‌జోత్ సింగ్ నందా, %ICAI% వైస్ ప్రెసిడెంట్ మరియు ప్రీతి పరాస్ సావ్లా, %ICAI% సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ - చైర్‌పర్సన్, %ICAI, WMEC కూడా హాజరయ్యారు.గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్-సిటీ లో ఏర్పాటు చేసిన మొదటి డిస్ట్రెస్డ్ డెట్ ఫండ్ అయిన 1100 కోట్ల రూపాయల విలువైన అర్థ గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్‌కు అర్థ భారత్ ఇన్వెస్ట్మెంట్ మేనేజర్‌గా పనిచేస్తుంది. ఇది భారతదేశంలోని ఏకైక అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రం. శ్రీమతి సావ్రికర్ అర్థభారత్ వద్ద రిస్క్ మేనేజ్మెంట్, కంప్లయన్స్, బ్యాక్-ఆఫీస్ కార్యకలాపాలు, హెచ్‌ఆర్, ఫైనాన్స్ మరియు అడ్మినిస్ట్రేషన్‌ను పర్యవేక్షిస్తారు. ఈ అవార్డును భారతదేశంలోని %CA%లకు అత్యున్నత నియంత్రణ సంస్థ అయిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసింది. అవార్డును స్వీకరించిన తరువాత, శ్రీమతి సావ్రికర్ ఇలా వ్యాఖ్యానించారు, "ఈ అవార్డు ఆర్థిక రంగంలో మహిళా నిపుణుల బలానికి నివాళి, వారు భారతదేశాన్ని అమృత్ కల్ వైపు నడిపించడానికి తమ నైపుణ్యాన్ని అందిస్తున్నారు మరియు వికసిత్ భారత్ యొక్క దృష్టిని సాధించడంలో ప్రభుత్వానికి సహాయపడుతున్నారు. ఈ గుర్తింపు ప్రతి మహిళా పెద్ద కలలు కనడానికి, ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి మరియు అలా చేయడంలో, వారి కుటుంబాలను మరియు దేశాన్ని గర్వపడేలా చేయడానికి ప్రోత్సహిస్తుందని నేను ఆశిస్తున్నాను "అని అన్నారు.

'ICAI ద్వారా స్థాపించబడిన CA ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, వృత్తిలో అత్యుత్తమ సేవలందిస్తున్న మహిళా CA లు, సభ్యులు మరియు విద్యార్థులను గుర్తిస్తుంది. ఇది వారి అభిరుచి, అంకితభావం మరియు సంకల్పం సానుకూల సామాజిక ప్రభావాన్ని సృష్టించిన వారిని గౌరవిస్తుంది. సభ్యులకు మార్గదర్శకత్వం వహించడం, సెషన్‌లు నిర్వహించడం, అవగాహన కల్పించడం, జ్ఞానాన్ని అందించడం మరియు సామాజిక మార్పును స్వీకరించడం ద్వారా 'ICAI కి గణనీయంగా సహకరించిన మహిళా సభ్యుల నుండి అవార్డు గ్రహీతలు ఎంపిక చేయబడతారు' అని CA ఉమెన్ ఎక్స లెన్స్ అవార్డులపై ICAI వివరణాత్మక నోట్ పేర్కొంది. CA సంస్థ గోఖలే - సాథేలో ఇంటర్న్‌షిప్‌తో తన ప్రయాణాన్ని ప్రారంభించిన అశ్విని సావ్రికర్, 22 ఏళ్ల చిన్న వయస్సులో చార్టర్డ్ అకౌంటెంట్‌గా అర్హత సాధించారు, ఆమె గ్రాడ్యుయేషన్‌తో పాటు ఈ కఠినమైన అర్హతను పూర్తి చేయగలిగింది. భారత దేశంలోని బహుళజాతి ఆడిటింగ్ సంస్థలు మరియు విదేశీ బ్యాంకులలో పనిచేసిన ఆమె విశిష్టమైన కెరీర్‌లో, అశ్విని సావ్రికర్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ధృవపత్రాలను సంపాదించడం ద్వారా తన వృత్తిపరమైన స్థితిని మరింత పెంచుకుంది, కింది వాటితో సహా:? చార్టర్డ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెక్యూరిటీస్ - ఇన్వెస్ట్‌మెంట్ UK నుండి ఆపరేషనల్ రిస్క్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేట్ చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్ చార్టర్ నుండి CFA ఇన్స్టిట్యూట్, USA.

ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నల్ ఆడిటర్స్, USA నుండి సర్టిఫైడ్ ఇంటర్నల్ ఆడిటర్ అర్హతఆమె 2021 నుండి 2024 వరకు ఒమన్‌లోని ఇండియన్ స్కూల్స్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా పనిచేశారు మరియు ప్రస్తుతం వారి అకాడెమిక్ కమిటీకి అధ్యక్షత వహిస్తున్నారు. ఆమె ఆర్థిక చతురతకు మించి, అశ్విని సావ్రికర్ ఒక నిష్ణాతురాలైన హిందూస్థానీ శాస్త్రీయ గాయని మరియు ఆసక్తిగల యాత్రికురాలు, ఉత్తర ధ్రువం మరియు అంటార్కిటికాతో సహా ప్రతి ఖండాన్ని సందర్శించారు. చార్టర్డ్ అకౌంటెంట్ల కుటుంబం నుండి వచ్చిన ఆమె వృత్తిలో విశేషమైన ఉదాహరణగా కొనసాగుతోంది. ఆమె అసాధారణమైన విజయాలు మరియు ఆమె వృత్తి పట్ల అచంచలమైన నిబద్ధతతో, అశ్విని సావ్రికర్ భారతదేశం, ప్రపంచం అంతటా ఉన్న మహిళా నిపుణులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. పలు చర్చల తర్వాత రూ.28 లక్షలకు సెటిల్ అయిందని పేర్కొన్నారు. దీనిలో పరిశీలన బృందం చైర్మన్ రూ.10 లక్షలు, సభ్యులు ఒక్కొక్కరూ రూ.3 లక్షల చొప్పున తీసుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. అదేవిధంగా ల్యాప్‌టాపలు, బంగారం, సహా పరిశీలన బృందంలోని ఓ సభ్యుడి సతీమణి విదేశీ ప్రయాణానికి అయ్యే ఖర్చును కూడా లంచం కింద డిమాండ్ చేశారని తెలిపారు.

ఈ వ్యవహారంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనిలో ఒక్క రాజీవే.. రూ.1.3 కోట్లు డిమాండ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

## ఈ వారమే 'ఇన్‌కమ్ ట్యాక్స్' బిల్.. భారీ మార్పులతో కొత్త చట్టం.. అంచనాలు ఇవే!




**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంటులో ఈ వారమే కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రవేశపెట్టన్నారని తెలుస్తోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం అమలులో ఉన్న ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 1961 స్థానాన్ని భర్తీ చేయనుంది. కొత్త చట్టం పన్ను చెల్లింపుల ప్రక్రియను మరింత సులభతరం చేయనుంది. ఫిబ్రవరి 1వ తేదీన వార్షిక బడ్జెట్ ప్రసంగంలో కొన్ని ముఖ్యమైన ప్రకటనలు చేశారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అందులో ఒకటి కొత్త ఆదాయపు పన్ను చట్టం బిల్లు. గత శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా వచ్చే వారమే కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొస్తామని తెలిపారు. కొత్త చట్టం 60 సంవత్సరాల నాటి పాత చట్టం స్థానాన్ని భర్తీ చేయనుంది.కొత్త ఆదాయపు పన్ను చట్టం సులభమైన భాషలో ఉండనుందని, పన్ను చెల్లింపుదారులు సులభంగా అర్థం చేసుకునేలా తయారు చేస్తున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. దీంతో పాటుగా డిజిటల్ ప్రాసెస్‌ని ప్రమోట్ చేయనున్నారని, దీంతో ట్యాక్స్ ఫైలింగ్ పూర్తిగా డిజిటల్ విధానంలోకి మారనుందని తెలిపుతున్నాయి. డిజిటలీకరణ తీసుకురావడంతో ఆదాయపు పన్నులకు సంబంధించిన చట్టపరమైన సమస్యలు చాలా వరకు తగ్గుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అలాగే కొత్త చట్టంలో అసెస్మెంట్ ఇయర్, ఫైనాన్షియల్ ఇయర్‌ని కలిపేసి ట్యాక్స్ ఇయర్‌గా మార్చనున్నారని తెలుస్తోంది.

కొత్త చట్టంలో తీసుకొచ్చే మార్పుల్లో చాలా వరకు ట్యాక్స్ పేయర్ల నుంచి తీసుకున్న ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే ఆదాయపు పన్నులకు సంబంధించి కొత్త పన్ను విధానాన్ని 2020లో తీసుకొచ్చారు. ప్రస్తుతం 1961 చట్టం పరిధిలో ఉంది. కొత్త చట్టం పరిధిలో కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చే అవకాశాలు ఉన్నాయి. అందుకు ట్యాక్స్ రేట్లలో మళ్లీ మార్పులు చేయొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, బడ్జెట్‌లోనే కీలక మార్పులు చేసిన క్రమంలో పెద్దగా ఉండకపోవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. కొత్త పన్ను విధానంలోకి ట్యాక్స్ పేయర్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టినట్లు ఇటీవలే కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఛైర్మన్ రవి అగర్వాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం 75 శాతం మంది కొత్త విధానంలోకి మారిపోయారని, బడ్జెట్ చర్యల వల్ల 95-97 మంది త్వరలోనే మారతారని అంచనా వేశారు. దీంతో ట్యాక్స్ రిటర్న్ ఫైలింగ్ మరింత ఈజీ అవుతుందన్నారు. కొత్త పన్ను చట్టం ముసాయిదా బిల్లును ఆరు నెలల్లో సిద్ధం చేశారని, సులభమైన భాషలో అర్థం చేసుకునే విధంగా కొత్త చట్టం ఉంటుందన్నారు. దీని ద్వారా ట్యాక్స్ పేయర్లు సులభంగా అర్థం చేసుకుని పన్నులు చెల్లించడంలో సమస్యలు ఎదురుకాకుండా ఉంటుందన్నారు. కొత్త చట్టం ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌కి సరిపోయేలా ఉంటుందని తెలిపారు. పాత నిబంధనలు తొలగించనున్నారని, దీంతో చాలా తక్కువ నిబంధనలు

## అమెరికా-చైనా కయ్యం మనకు లాభమే




**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం మన దేశానికి మేలు చేస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 10 నుంచి చైనా దిగుమతులపై 35 శాతం సుంకాలు విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ప్రకటించారు. దీంతో అమెరికా మార్కెట్లో చైనా వస్తువులు ప్రియం కానున్నాయి. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు అమెరికా కంపెనీలు భారత్‌వైపు చూసే అవకాశం ఉందని భావిస్తున్నాయి. అయితే మన దేశానికి ఈ లాభం ఏ మేరకు ఉంటుందనే విషయం మన ఉత్పత్తి సామర్థ్యం, పోటీతత్వాలపై ఆధారపడి ఉంటాయని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ చెప్పారు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంతో మన దేశం నుంచి ఆ దేశానికి ఎలక్ట్రిక్ మెషినరీ, వాటి విడి భాగాలు, ఆటోమొబైల్ విడి భాగాలు, మొబైల్, ఫార్మా, రసాయనాలు, బట్టలు, వస్త్రాల ఎగుమతి పుంజుకునే అవకాశం ఉందని సహాయ్ అంచనా వేశారు.

## ప్రయాణికులకు గుడ్ న్యూస్.. త్వరలో టోల్‌ట్యాక్స్ స్మార్ట్ కార్డులు




**న్యూఢిల్లీ-నవభూమి:** జాతీయ రహదారులను ఉపయోగించే సాధారణ ప్రయాణికులకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా అన్ని టోల్ బూత్‌లలో 'మంత్లీ టోల్ ట్యాక్స్ స్మార్ట్ కార్డ్'ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు యోచిస్తోంది. ఈ నిర్ణయంపై కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ స్పీడుగా చర్యలు తీసుకుంటోంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ఈ పథకాన్ని ప్రవేశపెట్టడానికి అనుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ స్మార్ట్ కార్డ్ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఈ కార్డు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని టోల్ ప్లాజాల్లో చెల్లుబాటు అవుతుంది. ఈ కార్డుదారులకు టోల్ ఛార్జీలపై తగ్గింపు కల్పిస్తుందని వివిధ నివేదికలు చెబుతున్నాయి. అయితే ఈ కొత్త స్మార్ట్ కార్డు పథకం సాధారణ ప్రయాణికులకు టోల్ ఛార్జీలను తగ్గించి, వారిపై ఆర్థిక భారాన్ని భారీగా తగ్గిస్తుంది. ఇందులో ముఖ్యంగా వాణిజ్య వాహనాలు, సుదీర్ఘ ప్రయాణాలు చేసే వారికి మంచి ఉపశమనం కలగనుంది. ఈ విధానం ద్వారా సాధారణ ప్రయాణికులు, వాణిజ్య వాహనాలు, ఎక్స్‌ప్రెస్ వేలో తరచుగా ప్రయాణించే వారికి మరింత మేలు జరుగుతుంది.

## లక్షకు రూ.4 లక్షలు.. ఇప్పుడు 2 షేర్లకు 1 షేరు ఫ్రీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** స్మాల్ క్యాప్ కేటగిరికి టెక్స్‌టైల్ సెక్టార్ కంపెనీ ఎస్బీసీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకి ఆఫర్ ప్రకటించింది. కంపెనీకి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు జనవరి 24 న సమావేశమయ్యారు. డిసెంబర్ 31తో ముగిసిన మూడో త్రైమాసికం ఫలితాల ప్రకటనతో పాటు తమ షేర్ హోల్డర్స్ బోనస్ షేర్లు ఇచ్చేందుకుఆమోదం తెలుపారు. రికార్డు తేదీ నాటికి 2 షేర్లు కొంటే మరో షేరు బోనస్ రూపంలో అందుతుంది. అలాగే ఈ స్టాక్ గత మూడేళ్ల కాలంలో 290 శాతం పెరిగింది. లక్ష పెట్టిన వారికి దాదాపు రూ.4 లక్షలు అందించింది. ఇది రూ.30 లోపు లభించే ఒక పెన్నీ స్టాక్‌కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం బోనస్ షేర్లు 1:2 నిష్పత్తిలో జారీ చేసేందుకు బోర్డు సిఫార్స్ చేసింది. దీని అర్థం రికార్డు తేదీ నాటికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ గల 2 ఈక్విటీ షేర్లు తమ డీమ్యాట్ ఖాతాలో కలిగి ఉంటే అలాంటి వారికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ గల 1 ఈక్విటీ షేరుని బోనస్ రూపంలో ఉచితంగా అందించనుంది కంపెనీ. ఇక ఈ బోనస్ షేర్లు జారీ చేసేందుకు అర్హులైన వారిని నిర్ణయించేందుకు రికార్డు తేదీని త్వరలోనే ప్రకటిస్తామని కంపెనీ తెలిపింది.

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో ఎస్బీసీ ఎక్స్‌పోర్ట్స్ షేరు ధర 1.81 శాతం నష్టంతో రూ. 20.57 వద్ద ట్రేడమవుతోంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 37.90గా ఉండగా కనిష్ఠ ధర రూ. 18.40 వద్ద ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 13 శాతం నష్టపోయింది. గత నెల రోజుల్లో ఈ షేరు 23 శాతం నష్టాన్ని ఇచ్చింది. అదే విధంగా గత ఆరు నెలల్లోనూ 23 శాతం నష్టపోయింది. అదే గత మూడేళ్లలో 290 శాతం మేర పెరిగింది. లక్ష పెట్టిన వారికి దాదాపు రూ.4 లక్షల వరకు అందించింది. ఐదు సంవత్సరాల్లో 174 శాతం లాభాన్ని తమ వాటాదారులకు అందించింది. ప్రస్తుతం మార్కెట్ విలువ రూ. 657 కోట్లుగా ఉంది.

ఎస్బీసీ ఎక్స్ పోర్ట్స్ లిమిటెడ్ సంస్థ హ్యాండ్ మేడ్ కార్పెట్స్, కాటన్ పిల్లోస్, కుషన్ కవర్స్, బెడ్ స్ప్రేడ్స్ వంటి మొదలైన ఉత్పత్తులు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తుంది. 4 సంవత్సరాల్లోనే ఈ కంపెనీ ఉత్తర్ ప్రదేశ్‌లో ప్రసిద్ధ బ్రాండ్‌గా గుర్తింపు పొందింది. ఈ కంపెనీ 1991 లో ప్రారంభించారు. ప్రస్తుతం ఘజియాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

# బంగారం ధర ఆల్ టైమ్ రికార్డు..




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. కొండెక్కుతున్న ధరలతో ఊహకు అందనంత వేగంగా సరికొత్త రికార్డులకు చేరుకుంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలతోపాటు.. పెళ్లిళ్ల సీజన్ మొదలు కావడంతో బంగారం ధర శర వేగంతో దూసుకుపోతోంది. బుధవారం ఉదయం ఆల్‌టైమ్ రికార్డు ధరకు బంగారం చేరుకుంది. నమోదైన వివరాల ప్రకారం.. 24 క్యారట్ల బంగారంపై రూ. 1,040 పెరగగా, 22 క్యారట్ల బంగారంపై రూ. 950 పెరిగింది. దీంతో దేశంలో 24 క్యారట్ల బంగారం ధర రూ. 87 వేలకు చేరగా.. 22 క్యారట్ల బంగారం రూ.79,050గా నమోదైంది. ఇక కేజీ వెండి ధర రూ. 97,302గా ఉంది.

**కొనుగోలు దారుల ఆందోళన..**

బంగారం ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో పసిడి ఆభరణాలు కొనుగోలు చేసే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న బంగారం ధర, నగలు కొనుగోలు చేసే వారికి ఆందోళన కలిగిస్తున్నాయి. బంగారం ధరలు గత వారం రోజులుగా భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం బంగారం ధర ఆల్ టైం గరిష్ట స్థాయిని తాకింది. అంతేకాదు బంగారం ధర బడ్జెట్ అనంతరం మరింత భారీగా పెరిగింది. ప్రస్తుతం బంగారం ధర చరిత్రలో మొదటిసారిగా రూ. 87 వేల మార్కుకు చేరుకుంది. ధరల పెరుగుదల ఇలానే కంటిన్యూ అయితే.. అతి త్వరలోనే లక్ష రూపాయలు దాటడం ఖాయంగా కనిపిస్తోందని నిపుణులు అంచనా వేస్తున్నారు .ప్రధానంగా బంగారం ధరలు పెరగడానికి ముఖ్య కారణం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరలేపిన వాణిజ్య యుద్ధమేనని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు స్టాక్ మార్కెట్లు కూడా భారీగా పతనం అవుతున్నాయి. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం వైపు మళ్లిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ తోడుకావడంతో బంగారం విక్రయాలు పెరుగుతున్నాయి.

**తెలుగు రాష్ట్రాల్లో ఇవాళ్టి ధరలు ..**

తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో.. 10 గ్రాములు 24 క్యారట్ల బంగారం ధర రూ.87 వేలు ఉండగా.. 22 క్యారట్ల బంగారం రూ.79,050గా నమోదైంది. వెండి ధర నాలుగు రోజుల తరువాత పెరిగింది. ఇవాళ కిలో వెండిపై రూ. వెయ్యి పెరిగి రూ. 97,302 వద్ద కొనసాగుతోంది.





## ఇకపై ఛాట్ జీపీటీ, డీప్ సీక్ వాడకాన్ని ఆపాలి.. కేంద్ర ప్రభుత్వం..

**న్యూఢిల్లీ-నవభూమి:**ఛాట్ జీపీటీ, డీప్ సీక్, గూగుల్ జెమిని వంటి విదేశీ యాప్‌ల వినియోగం భారతదేశంలో వేగంగా పెరుగుతోంది. వినియోగదారులు తమ పనిని సులభంగా, వేగంగా పూర్తిచేయడానికి ఈ యాప్‌లను విరివిగా ఉపయోగిస్తున్నారు. అయితే, ఏఐ టూల్స్ వినియోగించే సమయంలో డేటా భద్రత, గోప్యతకు సంబంధించి అందరి మదిలో అనేక రకాల ప్రశ్నలు, సందేహాలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే ఏఐ యాప్స్ ఉపయోగించాలంటే తప్పనిసరిగా వినియోగదారులు తమ పరికరాల్లో డేటాకు యాక్సెస్‌ను తప్పక అనుమతించాల్సిందే. ఇది ఏఐ టెక్నాలజీ యాప్స్ వాడేవారి వ్యక్తిగత సమాచారం లీక్ అయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది. జాతీయ భద్రత, సున్నితమైన, గోప్యమైన సమాచారానికి హాని కలిగిస్తుందనే ఉద్దేశంతోనే తమ ఉద్యోగులు ఛాట్ జీపీటీ, డీప్ సీక్ ఇక మీదట వాడకూడదని కఠిన ఆంక్షలు విధించింది కేంద్ర ఆర్థికశాఖ. వంటి %ూా×% యాప్‌లు వల్ల కలిగే ప్రయోజనాల కారణంగా భారతదేశంలో ఈ టెక్నాలజీ వేగంగా ప్రజాదరణ పొందింది. కంటెంట్ సృష్టికి, డేటా విశ్లేషణ, కోడింగ్, భాషా అనువాదం, ఇతర పనులలో వినియోగదారులకు ఎంతో సహాయపడుతోంది ఏఐ. అందుకే విద్యార్థులు, నిపుణులు, వ్యాపారవేత్తలలో ఈ యాప్‌ల వాడకం వేగంగా పెరుగుతోంది.

## ‘తేరే బాప్’ అంటూ రెచ్చిపోయిన ఖర్గే



**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో తన ప్రసంగానికి బీజేపీ ఎంపీ, మాజీ ప్రధానమంత్రి చంద్రశేఖర్ కుమారుడు నీరజ్ శేఖర్ అడ్డుపడటంతో ఒక్కసారిగా సహనం కోల్పోయారు. “నేను మీ తండ్రి సమాకాలికుడిని. ఇంకా నువ్వు చిన్నపిల్లాడిడివే. కూర్చో” అని ఖర్గే గద్దించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఖర్గే మాట్లాడుతూ, అమెరికా డాలర్‌తో రూపాయి విలువ పడిపోయిందని అన్నారు. వెంటనే నీరజ్ శేఖర్ ఆయన ప్రసంగానికి అడ్డుపడటంతో ఖర్గే ఒక్కసారిగా సహనం కోల్పోయారు. “నేను మీ తండ్రి (తేరేబాప్) సమకాలికుడిని. నువ్వేం మాట్లాడతావు? షట్ అప్ అండ్ సిట్” అని మండిపడ్డారు. దీంతో సభలో గందరగోళం తలెత్తింది. చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్ వెంటనే ఇరువర్గాలను శాంతపరచేందుకు ప్రయత్నించారు. చంద్రశేఖర్ ఈ దేశంలోనే పెద్ద నాయకులలో ఒకరని, ఆయన గౌరవానికి కొలమానాలు లేవని అన్నారు. మాజీ ప్రధానిపై ఖర్గే చేసిన సంబోధనను ఉపసంహరించుకోవాలని కోరారు. దివంగత చంద్రశేఖర్, తాను కలిసి ఒకేసారి అరెస్టు అయ్యామని, ఆ కారణంగానే మీ తండ్రి నా సమకాలికుడని చెప్పానని ఖర్గే వివరణ ఇచ్చారు. దీనిపై ధన్‌ఖడ్ స్పందిస్తూ, మీరు ‘ఆప్‌కే బాప్’ అనడాన్ని సమర్థించుకుంటున్నారా? మరొక గౌరవ సభ్యుడితో మాట్లాడుతూ మీరు ‘ఆప్ కే బాప్’ అనడం సరికాదు. దయచేసి మీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోండి అని మరోసారి ఖర్గేను కోరారు. దీనిపై ఖర్గే తిరిగి మాట్లాడుతూ, ఎవరీ అవమానించడం తన అలవాటు కాదని, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను ఎన్నోసార్లు బీజేపీ అవమానించిందని గుర్తు చేశారు. స్నానం చేసేటప్పుడు రైన్‌కోట్ వేసుకుంటారని, ఆయన మాట్లాడరని, ప్రభుత్వాన్ని నడపలేరని ఎన్నోసార్లు సభ్యులు వ్యాఖ్యలు చేశారని, కానీ మన్మోహన్ మాత్రం దేశ ప్రయోజనాల దృష్ట్యా మౌనంగా ఉండిపోయారని అన్నారు. మౌని బాబా అని పిలిచినా ఆయన మాట్లాడలేదని, వ్యక్తులను అవమానపరచడం బీజేపీ అలవాటు అయితే, అవమానాలను భరించే అలవాటు తమదని అన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ మాజీ ఎంపీ అయన నీరజ్ చంద్రశేఖర్ 2019లో బీజేపీలో చేరారు. సోషలిస్ట్ అగ్రనాయకుల్లో ఒకరైన ఆయన తండ్రి చంద్రశేఖర్ 1990 అక్టోబర్ నుంచి 1991 జూన్ వరకూ ఆరు నెలలు దేశ ప్రధానిగా సేవలందించారు.

## అక్కడి బాలికల హాస్టల్లో బాత్రూంలకు తలుపులే లేవు.. నిత్యం నరకం చూస్తున్న విద్యార్థినులు!



**ఉత్తర కర్ణాటక-నవభూమి:**ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఉన్నా లేకపోయినా.. పెద్ద పెద్ద భవనాలు, పరిశుభ్రమైన టాయిలెట్లు మాత్రం మనకు కనిపిస్తూనే ఉంటాయి. నిర్వహణ కూడా చక్కగానే ఉంటుంది. కానీ 120 మంది విద్యార్థులు ఉంటున్న ఓ సర్కారు హాస్టల్లోని టాయిలెట్లు, బాత్రూంలకు మాత్రం తలుపులు కూడా లేవు. నిత్యం కంపు వాసన వస్తున్నా.. మూత్ర విసర్జన, మల విసర్జన, స్నానాలు చేసేటప్పుడు తోటి విద్యార్థులు చూస్తున్నా.. తప్పని సరి పరిస్థితుల్లో వారు తమ అవసరాలను తీర్చుకోవాల్సి వస్తోంది. ఈ దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటున్న ఆ విద్యార్థులు ఎవరు, ఇది ఎక్కడ జరిగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఉత్తర కర్ణాటకలోని కొప్పల్ తాలూకా బేటగేరిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన వసతి గృహం పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారిపోయింది. అక్కడ మొత్తంగా 120 మంది విద్యార్థినులు ఉండి చదువుకుంటుండగా.. సరిపడా బాత్రూంలు, టాయిలెట్లు లేవు. ఉన్న వాటికి కూడా అసలు తలుపులే లేవు. ఏమాత్రం పరిశుభ్రంగా లేని ఆ బాత్రూంలు, టాయిలెట్లనే ప్రస్తుతం విద్యార్థినులు వాడుకుంటున్నారు. మల, మూత్ర విసర్జనలతో పాటు స్నానాలు చేయాలన్నా తోటి విద్యార్థులకు కనిపించే పరిస్థితి. అయినా సరే చదువుకోవాలంటే వీటన్నిటినీ తట్టుకోవాల్సి వస్తుండగా.. విద్యార్థినులు నిత్యం నరకం చూస్తున్నారు. ఇప్పటికే ఈ విషయమై అనేక సార్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి ఉపయోగమూ లేకపోవడంతో.. పైఅధికారులకు సంప్రదించారు. ఈక్రమంలోనే సమగ్ర శిక్షా విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ హెచ్ అంజినప్ప జనవరి 16వ తేదీన సదరు పాఠశాలను తనిఖీ చేశారు. బాలికలు చెప్పినట్లుగా ఆ హాస్టల్లో నిర్వహణ సరిగ్గా లేదని.. బాత్రూంలు, టాయిలెట్లకు కనీసం తలుపులు కూడా లేవని నివేదిక ఇచ్చారు. ముఖ్యంగా ఆ బడి ప్రధానోపాధ్యాయురాలు నిధులు దాచుకుంటూ నిర్వహణపై పూర్తి నిర్లక్ష్యం వహించారని తెలిపారు. ఆమె చేస్తున్న తప్పుల వల్ల పిల్లలు శిక్షను అనుభవిస్తున్నారని వివరించారు. పరిశుభ్రత లేకపోవడం వల్ల దోమలు పెరిగి అనేక మంది విద్యార్థినులు అనారోగ్యం పాలెట్లు చెప్పుకొచ్చారు. అలాగే రోజూ దుర్వాసనతో మరింత ఇబ్బంది పడుతున్నారని.. ఈ సమస్యల వల్ల కనీసం చదువుపై కూడా పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారని స్పష్టం చేశారు. దీంతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ శ్రీశైల్ బిరిదార్ జనవరి 20వ తేదీన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కస్తూరి బిడాగర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ ఉత్తర్వు ఇంకా అమలు కాలేదు. కానీ వెంటనే ఆమెపై చర్యలు తీసుకుని బడిని బాగు చేస్తామని అధికారులు వివరిస్తున్నారు. చూడాలి మరి ఏం జరగనుంది అనేది.

## పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ మిలిటెంట్లు..

# అలర్ట్ అయిన భారత ఇంటెలిజెన్స్ వర్గాలు



**హమాస్-నవభూమి:**హమాస్ మిలిటెంట్లను అంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు.. గత కొంత కాలంగా గాజా స్ట్రిప్‌పై భీకర దాడులు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గాజాలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యం.. సొరంగాల్లో దాక్కొని ఉన్న హమాస్ నేతలను వెంటపడి మరీ హతమార్చుతోంది. ఈ క్రమంలోనే హమాస్‌కు కంచుకోటగా ఉన్న గాజాలో వారి ఆటలు సాగడం లేదు. దీంతో ఇతర ప్రాంతాలపై పట్టు సాధించేందుకు హమాస్ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఉగ్రవాద స్థావరాలను అడ్డాగా మారిన పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ ప్రవేశించనున్నట్లు ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి హమాస్ నేత హాజరవుతుం డటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ మిలిటెంట్లు అడుగుపెడుతున్నారనే ప్రచారం నేపథ్యంలో భారత ఇంటెలిజెన్స్ వర్గాలు అప్రమత్తం అయ్యాయి. బుధవారం కాశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా.. పీవోకేలో అల్ అక్సా ఫ్లడ్స్ పేరుతో ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దౌమి పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. ఈ సభను రావల్కోట్‌లోని సబీర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఇందులో హమాస్ సహా ఉగ్రసంస్థలైన లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, ఇతర సీనియర్ నాయకులు కూడా పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దౌమి ప్రసంగానికి సంబంధించి కరపత్రాలు, ఇతర మార్గాల్లో పీఓకేలో ప్రచారం చేస్తున్నారు. అయితే తన ప్రసంగంలో ఖలీద్ కద్దౌమి.. కాశ్మీర్‌లో పోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి మాట్లాడవచ్చని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకు పీఓకేలో ఉన్న జిహాదీ సంస్థలు ఇన్నేళ్లుగా వారు చేస్తున్న పోరాటాలకు బలం చేకూర్చేలా వాదనలు సృష్టించేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకునే అవకాశాలు ఉన్నాయనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. మసూద్ అజర్ సోదరుడు తల్హా సైఫ్, అస్గర్ ఖాన్, ఇలియాస్ మసూద్ వంటి ఉగ్రవాదులు కూడా ఈ సభకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. మరోవైపు.. ఇదే సమయంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. జమ్మూ కాశ్మీర్‌పై మంగళవారం హై లెవల్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిని అమిత్ షా పర్యవేక్షించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, సీమాంతర చొరబాట్లను అడ్డుకోవడం సహా పలు కీలక అంశాలపై దృష్టిసారించాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించారు. కాశ్మీర్‌లో వాహనాల తనిఖీలను కూడా ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఇక గతేడాది ఆగస్ట్‌లో హమాస్ నేతలతో లష్కరే తోయిబా టెర్రరిస్ట్ సైఫుల్లా ఖలీద్.. ఖతార్ రాజధాని దోహాలో భేటీ అయ్యాడు. అయితే 2018లో సైఫుల్లా ఖలీద్‌ను అమెరికా ఉగ్రజాబితాలో చేర్చింది. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు ఈ సైఫుల్లా ఖలీద్ సన్నిహితుడు కావడం గమనార్హం.

## 41 కి.మీ. పొడవు..10 కి.మీ వెడల్పు.. అసలేమిటీ గాజా?



**ఉక్రెయిన్ -నవభూమి:**ప్రస్తుతం ఈ భూమ్మీద అత్యంత దుర్భర పరిస్థితులు ఉన్నది ఉక్రెయిన్‌లోని డాన్ బాస్..ఇజ్రాయెల్ పొరుగున ఉన్న గాజాలోనే..20 లక్షల మంది ప్రజలు కేవలం 41 కి.మీ. పొడవు, 10 కి.మీ వెడల్పు ఉన్న ప్రాంతంలో నివసిస్తున్నారంటే..? తాగునీరు, కరెంటు ఇస్తున్నప్పటికీ నిత్యం కత్తులు నూరే శత్రు దేశం.. కటిక పేదరికం.. ఇంకా చెప్పాలంటే అక్కడ బతుకుతున్నా.. బతుకు మీద ఆశ లేదు. 2023 అక్టోబరు 7నాటి హమాస్ దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడడంతో గాజా పూర్తిగా ధ్వంసమైంది. అక్కడ ఇప్పుడు ఎటుచూసినా కల్లోలమే. బాంబుల దాడుల్లో భారీ భవనాలు కూలిపోవడంతో శిథిలాలు గుట్టలుగా పేరుకుపోయాయి. %ూశ్రీంశీ =ఝఀ% - ఉచిత బస్సు ... ఖజానాకు ఆరు వేల కోట్లు ఖర్చు కూల్చారు.. కట్టాలంటే 40 ఏళ్లు కూల్చడం తేలికే.. నిర్మించడమే కష్టం.. ఇది గాజా విషయంలో సరిగ్గా సరిపోతుంది. గాజాను పునర్ నిర్మించాలంటే 40 ఏళ్లు పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అత్యంత జనసాంద్రత ఉండే గాజాలో చాలాచోట్ల శిథిలాల కింద మృతదేహాలు చిక్కుకుపోయాయి. వాటిని తీసినవారే లేరు. గాజాను గాజా స్ట్రిప్ గానూ పిలుస్తారు. అంటే ఒక విమానాశ్రయ రన్ వే లాగా పొడవుగా ఉంటుంది కాబట్టి. ఈ ప్రాంతం మధ్యధరా సముద్రం తూర్పు తీరంలో ఉంది. వాస్తవానికి ఇది పాలస్తీనాలో భాగమ. కానీ, గాజాను సాయుధ మిలిటెంట్ సంస్థ అయిన హమాస్ కంట్రోల్ చేస్తోంది. ఉత్తర గాజా, దక్షిణ గాజా, ఖాన్ యూనిస్, రఫా.. ఇవీ గాజాలోని ప్రాంతాలు. గాజా హెడ్ క్వార్టర్ కాబట్టి ఆ పేరిటే పిలుస్తారు. ఐక్యరాజ్య సమితి అబ్జర్వేషన్ కంట్రీ అయిన పాలస్తీనాలో భాగమే గాజా. కానీ, హమాస్‌ను పాలస్తీనా అథారిటీ గుర్తించలేదు. వెస్ట్ బ్యాంక్ కేంద్రంగా పనిచేస్తుంది పాలస్తీనా అథారిటీ. అతి చిన్న భూభాగంలో 20 లక్షలమంది జీవనం సాగిస్తుండడంతో ప్రపంచంలోనే అత్యంత జనసాంద్రత కలిగిన ప్రాంతాలలో ఒకటిగా మారింది. ఈజిప్ట్ దాదాపు రెండు దశాబ్దాలు గాజాను పాలించింది. 1967లో ఆరు రోజుల యుద్ధంలో అరబ్ దేశాలపై విజయం సాధించిన ఇజ్రాయెల్ గాజా స్ట్రిప్, వెస్ట్ బ్యాంక్ పై నియంత్రణ సాధించింది. తర్వాత 38 సంవత్సరాలు గాజాను గుప్పిట పట్టింది. 2005లో అంతర్జాతీయ సమాజం, స్వదేశంలోనూ ఒత్తిడి రావడంతో గాజా నుంచి వైదొలగింది. 2007లో జరిగిన ఎన్నికల్లో గాజాలో అధికారంలోకి వచ్చిన హమాస్ అప్పటినుంచి అధికారంలో ఉంది. మళ్లీ అక్కడ ఎన్నికలు నిర్వహించలేదు. 2023 అక్టోబరు 7న హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌లోకి చొరబడి విధ్వంసం రేపారు. దీంతో ఇజ్రాయెల్ ప్రతి దాడులకు దిగింది. ఇప్పటివరకు 15 నెలల్లోనే 50 వేల మంది వరకు ప్రాణాలు కోల్పోయారు.

## ఆ మూడు నియోజకవర్గాలే కీలకం.. ఎవరూ ఓడినా అంతే సంగతులు..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. కాసేపట్లో పోలింగ్ ముగు ఓస్తుంది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు రానున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో ఏపార్టీకి మెజార్టీ వస్తుందనే సంగతి పక్కనపెడితే.. అందరి దృష్టి మూడేమూడు నియోజకవర్గాలపై ఉంది. ఈ మూడు నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారనేది తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఈ మూడు నియోజవర్గాల్లో అధికార ఆప్‌కు చెందిన ముగ్గురు కీలక నేతలు పోటీచేయడంతో ఈ నియోజకవర్గాలపై ఆసక్తి నెలకొంది. మాజీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి అతిషి, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ఫలితం ఎలా ఉండబోతుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. అరవింద్ కేజ్రీవాల్, అతిషి ఈజీగా గెలుస్తారని కొందరు రాజకీయ పండితులు అంచనా వేస్తుండగా ఈ రెండు నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచే అవకాశాలు ఉన్నాయని చెప్పేవాళ్లు లేకపోలేదు. దీంతో ఈ మూడు నియోజకవర్గాల ఓటర్లు ఎలాంటి తీర్పునిచ్చారనేది తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

న్యూఢిల్లీ..ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. గత మూడు ఎన్నికల్లో వరుసగా ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్న కేజ్రీవాల్ నాల్గవసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2020లో 21వేల687 ఓట్ల మెజార్టీతో గెలిచిన కేజ్రీవాల్ ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఢిల్లీ మాజీ సీఎం షీలాదీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ ఇదే నియోజకవర్గం నుంచి పోటీచేస్తుండగా.. బీజేపీ నుంచి పర్వేష్ సింగ్ వర్మ పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి పోటీలో ఉండటంతో ఓట్లు చీలి బీజేపీ అభ్యర్థి గెలుస్తారనే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు కొందరు వ్యక్తం చేస్తున్నారు. విజయంపై ధీమాగా ఉన్నప్పటికీ అరవింద్ కేజ్రీవాల్‌ను మరోవైపు ఓటమి భయం వెంటాడుతుందనే ప్రచారం జరుగుతోంది. కేజ్రీవాల్ ఓడిపోతే మాత్రం రాజకీయంగా ఆయనకు గట్టి ఎదురుదెబ్బగా భావించాల్సి ఉంటుంది. ఢిల్లీ సీఎం అతిషి కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. ఆమె ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ బలమైన అభ్యర్థిని నిలబెట్టడంతో ఆమెకు కొంత ఇబ్బంది ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అల్కాలంబ కాంగ్రెస్ నుంచి, రమేష్ బిదురి బీజేపీ నుంచి పోటీచేస్తున్నారు. రమేష్ బిదురి బీజేపీ నుంచి గతంలో ఎంపీగా పనిచేశారు. ముగ్గురు బలమైన అభ్యర్థులు కావడంతో ఈ నియోజకవర్గంలో గెలుపు ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది.

జంగ్‌పుర..ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ కీలక నేత మనీష్ సిసోడియా ఈసారి తన నియోజకవర్గాన్ని మార్చుకున్నారు. ప్రతాప్‌గంజ్ నుంచి గత ఎన్నికల్లో పోటీచేసిన సిసోడియా ఈసారి జంగ్‌పుర నుంచి బరిలో దిగారు. 2015, 2020 ఎన్నికల్లో ఆప్ నేత ప్రవీణ్ కుమార్ ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ప్రస్తుతం సిసోడియా పోటీచేయగా.. ఆయనపై తర్విందర్ సింగ్‌ను బీజేపీ పోటీకి పెట్టగా.. కాంగ్రెస్ పర్వద్ సూరీని పోటీకి దింపింది.

## కొత్త రచ్చ... (డిప్యూటీ) సీఎం నివాసంలో

# దున్నపోతులను బలిచ్చారు!



**ముంబై-నవభూమి:**మహారాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రచ్చ ప్రారంభమైంది. ఇందులో భాగంగా... మహారాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక నివాసం “వర్ష”లో క్షుద్రపూజలు జరిగాయని, అక్కడ దున్నపోతులను బలిచ్చారని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ సంచలన ఆరోపణలు చేశారు. దీంతో... ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై.. షిండే, ఫడ్నవీస్ స్పందించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక నివాసం “వర్ష”లో క్షుద్రపుజలు జరిగాయని.. అక్కడ దున్నపోతులను బలిచ్చి, వాటి కొమ్ములను అక్కడే పాతిపెట్టించరని.. సీఎం సీటు తనకే దక్కాలని, మరొకరు ఆ సీటులో ఎక్కువకాలం కొనసాగొద్దనే ఉద్దేశంతోనే డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే ఈ పని చేశారని రౌత్ ఆరోపించారు. ఈ ఆరోపణలు సంచలనంగా మారాయి. %ూశ్రీంశీ =ఝఀ% - రాజకీయ నిరుద్యోగం పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు! ఈ నేపథ్యంలో ఈ ఆరోపణలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ఈ క్షుద్రపూజల ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. తన కుమార్తె పదో తరగతి చదువుతోందని.. త్వరలో పరీక్షలు ఉండటంతో అధికారిక బంగ్లాలోకి ఇంకా మారలేదని.. కుమార్తె పరీక్షలు అయిన తర్వాత “వర్ష”లోకి షిఫ్ట్ అవుతామని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి అధికారిక నివాసం “వర్ష”లో మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే ఉంటున్నారు. ఈ సందర్భంగా క్షుద్రపూజల ఆరోపణలపై ఆయన స్పందించారు. ఈ క్షుద్ర పూజలు జరిగాయని ఆరోపణలు చేస్తున్నవారికి ఇలాంటి వ్యవహారాల్లో బాగా అనుభవం ఉండి ఉండొచ్చని కామెంట్ చేశారు. కాగా... గత ఏడాది డిసెంబర్ 5న సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన దేవేంద్ర ఫడ్నవీస్ ప్రస్తుతం “సాగర్” బంగ్లాలోనే నివాసం ఉంటున్న సంగతి తెలిసిందే.

## ఏపీలో ఎక్కడైనా పింఛన్లు తీసుకునే వెసులుబాటు



**అమరావతి-నవభూమి:**ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాజిక భద్రతా పింఛన్లను రాష్ట్రంలో ఎక్కడైనా తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ చేసుకునే వీలు కల్పించింది. గతంలో ఏ నెల పింఛన్ ఆ నెలలోనే తీసుకోవాలనే నిబంధన ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు నెలలకు ఒకసారి తీసుకునే అవకాశమిచ్చింది. ఇక తాజాగా రాష్ట్రంలో ఏ జిల్లాలోనైనా తీసుకునే సౌకర్యం కల్పించడంతో పింఛనర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం సామాజిక పింఛన్లు తీసుకుంటున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వరంగా చెబుతున్నారు. ప్రస్తుతం ఎక్కడివారు అక్కడే పెన్షన్లు తీసుకోవాలనే నిబంధన ఉండటం వల్ల.. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నవారు.. ఇతర కారణాల వల్ల దూర ప్రాంతాలకు వెళ్లిన వారు తరచుగా పింఛను ఇచ్చే సమయానికి రావాల్సివస్తోంది. దీంతో ఎన్నో వ్యయ ప్రయాలకు లోనవుతున్నారు.

నెలనెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రత్యేకంగా హాజరవుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ సమస్య వెళ్లడంతో వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పింఛను ఒక చోట నుంచి మరోచోటకి బదిలీ చేసుకునే ఆప్షన్ ఇవ్వాలని సూచించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. సీఎం ఆదేశాలతో ఈ నెల నుంచి పింఛను బదిలీ చేసుకునే ఆప్షన్ అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా పెన్షన్లను సులువుగా బదిలీ చేసుకునే సౌకర్యం కల్పించారు. లఅయితే తమ పింఛన్లను ఎక్కడ తీసుకోవాలని అనుకుంటున్నారో.. ఆ ప్రాంతం సచివాలయం పేరు, కోడ్, మండలం, జిల్లాలను ప్రస్తుత సచివాలయంలో అందజేయాల్సివుంటుంది.

## కుంభమేళాలో తొక్కిసలాటపై

# హేమా మాలిని షాకింగ్ కామెంట్స్



**న్యూఢిల్లీ-నవభూమి:**ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో మహా కుంభమేళా ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి భక్తులు, పర్యాటకులు దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఈ క్రమంలో... గత నెల 29న కుంభమేళలోని మౌనీ అమావాస్య రోజున తెల్లవారుజామున భారీ తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో సుమారు 30 మంది చనిపోగా.. దాదాపు 60 మందివరకూ తీవ్రంగా గాయపడ్డారని చెబుతున్నారు. దీంతో... ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా మరిగణించిన యోగి సర్కార్... దీనిపై జ్యుడీషియల్ కమిటీని నియమించింది. ఈ ఘటనలో కుట్రకోణం ఉందని ఆరోపించింది. మరోపక్క ఈ తొక్కిసలాట ఘటనపై సమాజ్ వాదీ పార్టీ నేతలు ఘాటుగా స్పందిస్తున్నారు. ఇందులో భాగంగా.. కుంభమేళాలో జరుగుతున్న విషయాల గురించి చెబుతున్న సర్కార్.. తొక్కిసలాట ఘటనలో జరిగిన విషయాలను ఎందుకు దాచిపెడుతుందని ప్రశ్నించారు. ఇప్పటికీ ఈ ఘటనలో చనిపోయినవారి సంఖ్య విషయంలో క్లారిటీ లేదని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన అఖిలేష్ యాదవ్... యోగి సర్కార్ ఈ మరణాలను దాచిపెడుతుందని అన్నారు. ఈ ఘటన వెనుక కుట్రకోణం ఉంటే.. వారిపై కఠినచర్యలు తీసుకోవాలని.. ఇదే సమయంలో కుంభమేళా బాధ్యతల్ని ఆర్మీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. మరోపక్క.. ఈ ఘటనపై జయాబచ్చన్ స్పందించారు. ఇందులో భాగంగా... తొక్కిసలాట అనంతరం శవాలను నదిలోకి విసిరేశారంటూ జయా బచ్చన్ సంచలన ఆరోపణలు గుప్పించారు. కుంభమేళా త్రివేణీ సంగమం పూర్తిగా కాలుష్య కూపంగా మారిపోయిందని తెలిపారు. ఈ సమయంలో బీజేపీ ఎంపీ హేమామాలిని స్పందించారు. మరణాలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. అవును... కుంభమేళా ఘటనలో 30 మంది చనిపోవడం స్పందించిన బీజేపీ ఎంపీ హేమామాలిని షాకింగ్ వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం అని అంటూనే.. ఇది అంత పెద్ద సంఘటన కాదు.. దీన్నీ అతిశయోక్తి చేసి చెబుతున్నారు.. కుంభమేళా ఘనంగా జరుగుతోంది.. చాలా మంది వస్తున్నారు అని తెలిపారు. సమాజ్ వాదీ పార్టీ నేతలు తమ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు. దీంతో.. హేమా మాలిని వ్యాఖ్యలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఒక్కరు గాయపడినా అది తప్పే అని.. అలాంటిది 30 మంది మరణిస్తే అది అంత పెద్ద విషయం కాదని అనడం ఏమిటని నెటిజన్లు నిలదీస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ ఎంపీ తారిఖ్.. హేమా మాలిని కుంభమేళాలో వీఐపీ ట్రీట్ మెంట్‌తో పాల్గొన్నారని.. అక్కడ పరిస్థితులు బాగా దిగజారిపోయాయని.. ఇక్కడ పోలీసులు, అధికారులు వీఐపీల కోసమే చూస్తున్నారని.. సామాన్య ప్రజల భద్రతను గాలికి వదిలేశారని.. ఆమె వ్యాఖ్యలు బాధితులను ఎగతాళి చేయడమే అని ఫైర్ అయ్యారు.

నవచిత్ర





## కొంపముంచిన ఏఐ.. మాధవన్‌కు అనుష్క కాల్

ఏఐ వాడకం విరివిగా పెరిగిన క్రమంలో ఏది నిజమో, ఏది అబద్ధమో తెల్చుకోవడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే పలువురు నేరగాళ్ల తమ కార్యక్రమాలను చకచకా చేసుకుంటూ పోతున్నారు. మరోవైపు సినీ, క్రికెట్ తారల అభిమానులు కూడా తమకు నచ్చిన విధంగా వీడియోలను క్రియేట్ చేస్తున్నారు. దీంతో సాధారణ ప్రజలే కాదు, బడా సెలబ్రిటీలు కూడా ఏది నిజమో, ఏది అబద్ధమో తేల్చుకోలేకపోతున్నారు. తాజాగా నటుడు మాధవన్ తనకు ఎదురైనా అనుభవాన్ని ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకున్నారు.మాధవన్ మాట్లాడుతూ.. 'ఏఐ వల్ల నేను కూడా మోసపోయాను. గతంలో సోషల్‌మీడియాలో నేనొక వీడియో చూశాను. ఫుట్‌బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో... మన క్రికెటర్ కోహ్లీని ప్రశంసలతో ముంచెత్తున్న వీడియో అది. కోహ్లీ అంటే తనకెంత ఇష్టమో.. ఆయన నాయకత్వ లక్షణాలను పొగుడుతూ రొనాల్డో మాట్లాడారు. అది నాకెంతో నచ్చింది. వెంటనే దానిని షేర్ చేయాలనిపించి ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకున్నా. కొంతసేపటికి అనుష్క శర్మ నుండి నాకు మెసేజ్ వచ్చింది. అది రియల్ వీడియో కాదని.. ఫేక్ అని.. ఏఐతో దానిని సృష్టించారని ఆమె తెలిపింది. ఆ నిమిషం నాకు కాస్త ఇబ్బందిగా అనిపించింది. టెక్నాలజీ గురించి అవగాహన ఉన్న నేను కూడా ఏఐ వీడియోను గుర్తించలేకపోయాను. కాబట్టి టెక్నాలజీ వల్ల కూడా ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని అర్థమైంది.



## సినిమా హిట్‌కు ఫార్ములా అదే: ఖుషి కపూర్

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా ఖుషి కపూర్ ఇప్పటికే సినీ రంగ ప్రవేశం చేసింది. ది ఆర్చీస్ సినిమాతో కెరీర్‌ను మొదలుపెట్టిన ఖుషి కపూర్ ఆ సినిమాతో ఫ్లాప్ ను అందుకుంది. ప్రస్తుతం ఖుషి నటించిన లవ్ యాపా సినిమా ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఖుషి చాలా యాక్టివ్ గా పాల్గొంటుంది. లవ్ యాపా ప్రమోషన్స్‌లో భాగంగా ఖుషి ఏ సినిమాకైనా పబ్లిసిటీ చాలా ముఖ్యమని, మనం దేన్నైనా ఆడియన్స్ వరకు తీసుకెళ్తేనే వారు ఆదరిస్తారని, అలా కాకుండా సినిమా తీశాం చూస్తారులే అనుకుంటే కుదరదని ఈ సందర్భంగా ఖుషి తెలిపింది. లవ్ యాపా సినిమా అందరి కంటే యూత్ ను ఎక్కువగా ఎట్రాక్ట్ చేస్తుందని, కచ్చితంగా ఈ సినిమాను యూత్ మొత్తం ఆదరిస్తారని ఖుషి భావిస్తోంది. అసలేమైందంటే 16 ఏళ్ల లోపు వయసున్న ప్రతీ ఒక్కరికీ లవ్ యాపా నచ్చుతుందని ఖుషి ఈ సందర్భంగా తెలిపింది. అయినా మనం చేసిన సినిమా ప్రతీ ఒక్కరికీ నచ్చేలా తీయలేమని, తన మొదటి సినిమా ది ఆర్చీస్ సినిమాకీ, ఇప్పటికీ తాను చాలా డెవలప్ అవడంతో పాటూ చాలా నేర్చుకున్నానని, స్టోరీ సెలెక్షన్ విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఖుషి వెల్లడించింది. లవ్ యాపా సినిమా ఓటీటీలో కాకుండా థియేటర్లలో రిలీజవుతుండటం వల్ల కాస్త టెన్షన్ పడుతున్నట్టు ఖుషి తెలిపింది. ట్రైలర్ రిలీజ్ టైమ్ లో బిగ్ స్క్రీన్ పై తనను తాను చూసుకున్నప్పుడు ఒణికిపోయానని, కానీ అలా చూసుకుని ఎంతో ఆనందపడ్డానని ఖుషి ఈ సందర్భంగా వెల్లడించింది. సినిమా సక్సెస్ అనేది కలెక్షన్స్ పై ఉంటుంది కాబట్టి ఆ కలెక్షన్స్ రావడానికి తన వంతు కృషి చేస్తానని ఖుషి ఈ సందర్భంగా చెప్పింది. ఆమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ హీరోగా నటించిన లవ్ యాపా సినిమాకు అద్వైత్ చందన్ దర్శకత్వం వహించగా ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించాడు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన మలయాళ సూపర్ హిట్ సినిమా లవ్ టుడే సినిమాకు రీమేక్ గా లవ్ యాపా రూపొందింది. ఖుషి కపూర్ ఈ సినిమా విజయంపై ఎన్నో ఆశలు పెట్టుకుంది.

## ఖుష్బూ చేతికి గాయాలు.. అసలేమైందంటే



సీనియర్ హీరోయిన్ ఖుష్బూ పలు విధాలుగా మంచి పేరు తెచ్చుకుంది. నటిగా, నిర్మాతగా, పొలిటీషియన్ గా ఆమె బాగా పాపులరైంది. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఖుష్బూ గాయాల పాలైనట్టు తెలుపుతూ కొన్ని ఫోటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఆ ఫోటోలు చూసిన ఖుష్బూ ఫ్యాన్స్ ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా తన ఎడమ చేతిని చూపిస్తూ ఆ చేతికి అయిన గాయాల ఫోటోలను ఖుష్బూ పోస్ట్ చేసింది. అయితే ఖుష్బూ గత కొంతకాలంగా కండరాల ఎలర్జీకి గురై తీవ్ర నొప్పితో బాధ పడుతున్నట్టు తెలుస్తోంది. మామూలుగా స్పోర్ట్స్ పర్సనాలిటీస్ హార్డ్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం వల్ల ఇలాంటి కండరాల ఎలర్జీతో బాధ పడుతూ ఉంటారు. మళ్లీ ఇప్పుడు ఖుష్బూ కూడా అలాంటి సమస్యతోనే బాధ పడుతుందని సమాచారం. గతంలో చాలా బొద్దుగా ఉండే ఖుష్బూ తన వర్కవుట్స్ తో చాలా స్లిమ్ గా మారిన విషయం తెలిసిందే. అందుకే ఆమెకు ఇప్పుడు ఈ సమస్యతో బాధ పడుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఖుష్బూ చేతికి డాక్టర్లు ఫిజియోథెరపీ చేస్తున్నారు. అయితే ఇంత బాధలో కూడా ఖుష్బూ షూటింగుల్లో పాల్గొంటుందట. ఈ విషయం తెలిసిన ఫ్యాన్స్ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమెకి సలహాలిస్తున్నారు. ఒకప్పుడు తెలుగు, తమిళ సినిమాల్లో అవకాశాలందుకుంటూ ప్రేక్షకుల్ని అలరించిన ఖుష్బూ ఈ మధ్య జబర్దస్ కు జడ్జిగా వ్యవహరిస్తూ తన కామెడీతో అందరినీ ఆకట్టుకుంటుంది. కమెడియన్స్ తో కలిసి జోకులేస్తూ జబర్దస్త్ ద్వారా మంచి పాపులారిటీని సంపాదించింది ఖుష్బూ. తన భర్త సుందర్ కూడా నటుడిగా, డైరెక్టర్ గా మంచి పేరు దక్కించుకున్నాడు. ఎక్కువగా హార్రర్ సినిమాలను తీస్తూ ఆడియన్స్ ను అలరిస్తూ ఉంటాడు సుందర్. ఇదిలా ఉంటే ఖుష్బూ తన కూతుళ్లను ఇండస్ట్రీకి పరిచయం చేయాలని ప్రయత్నిస్తున్నట్టు ఈ మధ్య వార్తలొస్తున్నాయి.

## గోడ పక్కన కూర్చోవొద్దు అన్నా వినడం లేదా!



తలపతి విజయ్ కోలీవుడ్ లో ఎంత పెద్ద హీరో చెప్పాల్సిన పనిలేదు. కోట్లాది మంది అభిమానుల్ని సంపాదించిన స్టార్ అతడు. తెలుగులో పవన్ కళ్యాణ్ ఎంత ఫేమస్సో... తమిళనాడులో విజయ్ అంతటి సంచలనం. ఇప్పటికే అతడు నటించిన సినిమాలెన్నో 500 కోట్ల వసూళ్లు తెచ్చిన సందర్భాలెన్నో. ఇటీవలే రాజకీయాల్లోకి కూడా అడుగు పెట్టాడు. ఎన్నికల బరిలోనూ నిలిచాడు. వచ్చే ఎన్నికల్లో గెలిచి సీఎం అవ్వాలని చూస్తున్నారు. ఇటు నటుడిగా బిజీగా ఉంటూనే రాజకీయాలు చూస్తున్నాడు. ప్రస్తుతం నటిస్తోన్న 69వ చిత్రం 'జన నాయగన్' తర్వాత సినిమాలకు రిటైర్మెంట్ ప్రకటిస్తాడు. ఆ తర్వాత రాజకీయంలోనే బిజీ అవుతాడు. ఇలా నటుడిగా ...నాయకుడిగా ఉన్న విజయ్ చాలా సైలెన్స్ అన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతడు పెద్దగా ఎవరితోనూ మాట్లాడడట. షూటింగ్ సయయంలో షాట్ అయిన వెంటనే ఒంటరిగా కూర్చుంటాడట. అసలేమైందంటే అదీ ఎవరూ లేని ప్లేస్ చూసుకుని ఎక్కడో ఉన్న గోడ పక్కన ఎవరికీ కనిపించకుండా కూర్చుంటాడట. ఈ విషయాన్ని త్రిష రివీల్ చేసింది. అలా గోడ పక్కన కూర్చోవద్దని..తన పద్దతి మార్చుకోవాలని త్రిష సలహా ఇచ్చినట్లు తెలిసింది. త్రిష-విజయ్ బాల్య స్నేహితులు. ఒకే స్కూల్..ఒకే కంచం అన్నంతగా క్లోజ్. ఇద్దరు కలిసి కొన్ని సినిమాలు కూడా చేసారు.

చివరిగా లియోలో నటించారు. ఆ తర్వాత మళ్లీ కలిసి నటించలేదు. ప్రస్తుతం విజయ్ హీరోగా హెచ్. వినోద్ దర్శకత్వంలో జన నాయగన్ తెరకెక్కుతోంది. ఇది రాజకీయ నేపథ్యమున్న సినిమా. ఎన్నికల బరిలో ఉన్న నేపథ్యంలో చివరి సినిమా రాజకీయ నేపథ్యం గల కథ అయితే బాగుటుందని సూచించడంతో వినోద్ ఇలా వస్తున్నాడు. ఇప్పటి వరకూ వినోద్ తెరకెక్కించిన

## బాలయ్య మాస్ కాంబో కోసం ఆ ముగ్గురు



నందమూరి బాలకృష్ణ వరుస విజయాలతో దూసుకెళ్తూ.. తన కెరీర్‌లో మరో హిట్ ప్రాజెక్ట్‌ను లైన్‌లో పెట్టేశారు. యంగ్ మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మరోసారి బాలయ్య సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. వీరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'వీర సింహా రెడ్డి' పెద్ద హిట్ అవ్వడంతో మళ్లీ ఈ క్రేజీ కాంబో రిపీట్ అవుతోంది. అయితే ఇప్పటి వరకు ఈ ప్రాజెక్ట్‌ను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తుందన్న ప్రచారం సాగింది. కానీ తాజా సమాచారం ప్రకారం, అసలు నిర్మాత ఎవరు అన్న విషయం గురించి స్పష్టత వచ్చింది. ఇటీవల బాలకృష్ణ 'డాకు మహారాజ్' సినిమాతో సంక్రాంతి బరిలో నిలిచి భారీ హిట్ కొట్టారు. ఆ తర్వాత 'అఖండ 2' సెట్స్‌పైకి వెళ్లిన బాలయ్య, దీనిని త్వరగా పూర్తి చేసి కొత్త ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెట్టాలని చూస్తున్నారు. బాలకృష్ణ ప్రస్తుతం బోయపాటి శ్రీనుతో మళ్లీ హ్యాట్రిక్ కోసం 'అఖండ 2'ను పూర్తి చేయబోతున్నారు. అసలేమైందంటే మరోవైపు.. గోపీచంద్ మలినేనితో చేయబోయే సినిమాకు సంబంధించిన పనులు ముందుకు సాగుతు న్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, బాలకృష్ణ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రాబోయే సినిమా మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై కాదు. సాహు గారపాటి, సుధాకర్ చెరుకూరి, సతీష్ కిలారు ఈ ముగ్గురు కలిసి సినిమాను నిర్మించనున్నారు. ఇప్పటికే నిర్మాతల మధ్య చర్చలు ముగిసినట్టు టాక్. ముగ్గురు కలిసి ఒక న్యూ బ్యానర్ ను రెడీ చేస్తున్నట్లు టాక్. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. గోపీచంద్ మలినేని ప్రస్తుతం బాలీవుడ్‌లో సన్నీ డియోల్‌తో 'జాట్' సినిమా చేస్తుండగా, ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యాక బాలయ్య సినిమాకు సమయం కేటాయించనున్నారు. బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబినేషన్‌పై టాలీవుడ్‌లో మంచి హైప్ ఉంది. 'క్రాక్', 'వీర సింహా రెడ్డి' వంటి మాస్ ఎంటర్‌టైనర్స్‌తో సక్సెస్‌ను అందుకున్న గోపీచంద్ మలినేని, బాలయ్య కోసం మరో భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్లాన్ చేస్తున్నాడు.ఇప్పటికే బిగ్ బిజినెస్ హ్యాపెనింగ్ అవుతోంష్టం.






## ఐసీసీ ర్యాంకింగ్స్.. కాటేరమ్మ కొడుకుల జాతర.. ఇది ఎస్ఆర్‌హెచ్ మాస్టర్‌స్ట్రోక్



**హైదరాబాద్-నవభూమి:** భారత యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మకు గుడ్ టైమ్ నడుస్తోంది. ఇప్పుడు అతడు పట్టిందల్లా బంగారం అవుతోంది. బరిలోకి అడుగు పెడితే భారీ సెంచరీలతో అదరగొడుతున్న అభిషేక్.. బంతి చేతపడితే వికెట్ల మీద వికెట్లు తీస్తూ మ్యాచులు వన్‌సైడ్ చేసేస్తున్నాడు. అతడ్ని చూస్తేనే ప్రత్యర్థి జట్లు వణికిపోతున్నాయి. ఎక్కడ తమ మీద వచ్చి పడతాడోనని భయపడుతున్నాయి. అలాంటి అభిషేక్ ఇప్పుడు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో రప్పా రప్పా అంటూ దూసుకెళ్తున్నాడు. అతడితో పాటు మరో కాటేరమ్మ కొడుకు ట్రావిస్ హెడ్ కూడా ర్యాంకింగ్స్‌లో పరుగులు పెడుతున్నాడు. ఆ సంగతేంటో ఇప్పుడు చూద్దాం..తాజాగా టీ20 ర్యాంకింగ్స్ ప్రకటించింది ఐసీసీ. ఇందులో ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఫస్ట్ ప్లేస్‌లో నిలిచాడు. 855 పాయింట్లతో అతడు తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. టీమిండియా విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ లిస్ట్‌లో 2వ స్థానాన్ని దక్కించుకున్నాడు. 829 రేటింగ్ పాయింట్లతో హెడ్ తర్వాతి పొజిషన్‌లోకి దూసుకొచ్చాడతను. ఇంతకుముందు 40వ స్థానంలో ఉన్న అభిషేక్.. ఇంగ్లండ్ సిరీస్‌లో దుమ్మురేపడంతో ఏకంగా 38 స్థానాలు మెరుగుపర్చుకొని టాప్-2కి చేరుకున్నాడు. అతడి తర్వాతి స్థానంలో హైదరాబాదీ తిలక్ వర్మ (803 పాయింట్లు) ఉన్నాడు. సూర్యకుమార్ యాదవ్ (738) 5వ స్థానంలో ఉన్నాడు. ఇది చూసిన నెటిజన్స్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇద్దరు ఓపెనర్లు తొలి రెండు స్థానాల్లో ఉన్నారని.. ఇక ఐపీఎల్-2025లో ఒక్కో టీమ్‌కు దబిడిదిబిడేనని కామెంట్స్ చేస్తున్నారు.

## పోయిన చోటే వెతుక్కుంటున్న వరుణ్.. విధినే ఎదిరించిన యోధుడు



**హైదరాబాద్-నవభూమి:** పోయిన చోటే వెతుక్కోవాలని పెద్దలు అంటుంటారు. ఓడిపోయిన చోటే నిలబడి, తలబడి గెలుపు జెండా ఎగరేయాలని చెబుతుంటారు. ఇప్పుడు అదే పని చేస్తున్నాడు టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి. ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి చాలా మంది ఆటగాళ్లు వస్తుంటారు, పోతుంటారు. కానీ కొందరు మాత్రమే ఎన్ని అపజయాలు ఎదురైనా నిలబడి ఫైట్ చేస్తారు. అలాంటి వాళ్లే సుదీర్ఘ కాలంలో ఆటలో కొనసాగుతారు. వరుణ్ కూడా ఆ బాటలోనే నడుస్తున్నాడు. 2021లోనే భారత జట్టులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ మిస్టరీ స్పిన్నర్ 3 ఏళ్ల పాటు కనిపించకుండా పోయాడు. టీ20 వరల్డ్ కప్-2021లో టీమిండియా ఓటమిని కారణంగా చూపుతూ అప్పట్లో వరుణ్‌ను టీమ్‌లో నుంచి తీసేశారు.వరుణ్ జూనియర్ కావడం, ప్రపంచ కప్‌లో సరిగ్గా రాణించకపోవడంతో అతడిపై వేటు పడింది. దీంతో రెండేళ్ల పాటు అతడు చాలా బాధపడ్డాడు. అయితే ధైర్యంగా నిలబడి మళ్లీ వేట మొదలుపెట్టాడు. స్పిన్‌లో మరిన్ని వేరియేషన్స్ నేర్చుకున్నాడు. బంతిని ఇంకా వేగంగా వేయడం ప్రాక్టీస్ చేశాడు. అలా ఐపీఎల్‌లో సక్సెస్ అయ్యాడు. అక్కడి నుంచి గతేడాది టీమిండియాలోకి కమ్‌బ్యాక్ ఇచ్చాడు. అప్పటి నుంచి వచ్చిన ప్రతి అవకాశాన్ని రెండు చేతులా ఉపయోగించుకుంటున్నాడు.

నవక్రీడ

## ఇంగ్లండ్‌తో తొలి వన్డే..



**హైదరాబాద్-నవభూమి:** టీ20 సిరీస్‌లో 4-1 తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన భారత్.. ఇప్పుడు అదే జట్టుతో వన్డే సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఇరు టీమ్స్ మధ్య మూడు వన్డేలు జరగనున్నాయి. చాంపియన్స్ ట్రోఫీకి ముందు జరిగే సిరీస్ అవడంతో ఫామ్ అందుకోవడం, విజయాల బాట పట్టడం, స్క్వాడ్‌పై ప్రయోగాలు చేయడంతో పాటు వన్డేలకు అలవాటు పడేందుకు ఈ సిరీస్‌ను రెండు జట్లు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు బలంగా కనిపిస్తోంది. అనుభవం ఉన్న ఆటగాళ్లతో నిండిన టీమిండియా.. ఇంగ్లీష్ టీమ్‌ను తొక్కిపడేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో తొలి వన్డేలో మన టీమ్ ప్లేయింగ్ ఎలెవన్ ఎలా ఉండనుందో ఇప్పుడు చూద్దాం..తొలి వన్డేలో భారత్ ఎక్కువగా ప్రయోగాలు చేయాలని భావించడం లేదని తెలుస్తోంది. రెండు లేదా మూడో వన్డేలో ఎక్స్‌పెరిమెంట్స్ జరిగే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఎక్కువగా సీనియర్లతోనే మొదటి మ్యాచ్‌లో బరిలోకి దిగడం పక్కాగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఓపెనర్లుగా కెప్టెన్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ దిగుతారు. ఆ తర్వాత ఫస్ట్ డౌన్‌లో విరాట్ కోహ్లీ, సెకండ్ డౌన్‌లో కేఎల్ రాహుల్ ఆడటం ఖాయం. హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ మిడిలార్డర్ బాధ్యతలు చూసుకుంటారు. వరుణ్ చక్రవర్తి స్పెషలిస్ట్ స్పిన్నర్ రోల్ పోషిస్తాడు. పేస్ బౌలింగ్ బాధ్యతల్ని అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి మహ్మద్ షమి చూసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**